ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 21.07.2024 | సంపుటి : 11 సంచిక : 11 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

విద్యార్థుల త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడింది. నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. వారి సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యత. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నాం. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చాం. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాం. పరీక్షలు మాటిమాటికి వాయిదా పడటం మంచిదికాదు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## ప్రభుత్వ ఖాళీలన్నీ భర్తీచేస్తాం
## నిరుద్యోగపరిష్కారమే తొలి ప్రాధాన్యం

- సివిల్స్ అందుకునే వారి కోసం చేయూత
- సింగరేణి ఆర్థిక సాయంతో అభ్యర్థులకు భరోసా
- ఇకనుంచి ఏటా జూన్‌లో జాబ్ క్యాలెండర్
- డిసెంబర్ కల్లా అపాయింట్‌మెంట్లు
- నిరుద్యోగులకు అండగా నిలవడమే మా లక్ష్యం
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. సివిల్స్ అభ్యర్థులకు చేయూతనిచ్చేలా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకాన్ని ప్రజాభవన్‌లో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నారు. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడ మే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అందుకే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. గత పదేళ్లలో నిరుద్యోగులకు తీరని నష్టం మిగతా 2లో..

## పలువురు ఐఏఎస్‌ల బదిలీ..

**జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్ నియామకం**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా, గృహనిర్మాణం, సాధారణ పరిపాలన శాఖ (స్మార్ట్ గవర్నెన్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్, సాధారణ పరిపాలన శాఖ (సర్వీసుల) ముఖ్య కార్యదర్శిగా బెనహర్ మహేష్ దత్ మిగతా 2లో..



## భారీగా డ్రగ్స్ పట్టివేత

రాజస్థాన్‌కు చెందిన నిందితుల అరెస్టు

హైదరాబాద్(జనంసాక్షి): రాజస్థాన్ నుంచి హైదరాబాదకు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని మిగతా 2లో..

## సంకీర్ణ రాజకీయాలకు ఆద్యుడు ఎన్టీఆరే..

- రాజకీయాల్లో ఆయనో ట్రెండ్ సెట్టర్
- కష్టాన్ని నమ్ముకునే వారే కమ్మవారు
- అమ్మలాగా అన్నంపెట్టి ఆదుకునే గుణం వారి సొంతం
- తెలంగాణ అభివృద్ధిలో వారు భాగస్వామ్యం కావాలి
- వారికి అన్ని విధాలుగా అండగా ఉంటాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

## నేడు హస్తినకు సీఎం

- రెండ్రోజుల పాటు పర్యటన
- కాంగ్రెస్ అగ్రనేతలు, పలువురు కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యే అవకాశం

2లో

## ప్రజాప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుంది

**మూసీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం • ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తాం**

- ప్రపంచ పర్యాటకులు తరలి వచ్చేలా అభివృద్ధి చేస్తాం
- జంటనగరాల నుంచే తెలంగాణకు 65 శాతం ఆదాయం
- హైదరాబాద్‌కు ఎవరొచ్చినా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం
- గోపన్‌పల్లి ఫ్లైవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచ పర్యాటకులు మూసీకి వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూసీని చూస్తే ప్రజా ప్రభుత్వం గుర్తుకు వచ్చేలా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మూసీ అంటే ముక్కు మూసుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేయడానికి మీ సహకారం కావాలని కోరారు. ఔటర్‌రింగ్‌రోడ్డు, రీజినల్‌రింగ్‌రోడ్డు మధ్య సెమి అర్బన్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను మిగతా 2లో..

## భారాస ధనదాహానికి కాళేశ్వరం బలి

కమీషన్ల కోసమే ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ కుంగింది

తుమ్మడిహట్టి దగ్గర ప్రాజెక్టు కట్టిఉంటే ఇంకోలా ఉండేది: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీ: గత ప్రభుత్వం అట్టహాసంగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ, అంతకుముందే 16 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా రూ.38 వేల కోట్ల అంచనాతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టిందని గుర్తు చేశారు. అలాంటి ప్రాజెక్టును కేసీఆర్ పక్కకు నెట్టారని విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద నీరు లేదని ప్రాజెక్టు డిజైన్ మార్చేశారని, కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎక్కువ నిధులు కేటాయిస్తే ఎక్కువ కమిషన్లు వస్తాయని భావించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా పెరగలేదు. ఐదేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కింద కేవలం 65 టీఎంసీలు ఎత్తిపోశారు. ఏడాదికి సగటున కేవలం మిగతా 2లో..

## 25న కేబినేట్ భేటీ



**బడ్జెట్‌కు ఆమోదముద్ర**

హైదరాబాద్(జనంసాక్షి): ఈ నెల 25న తెలంగాణ కేబినెట్ భేటీ జరుగనుంది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉదయం 9 గంటలకు కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కేబినెట్ బ్జడెట్‌కు ఆమోదం తెలపనుంది. మరోవైపు.. ఈ నెల 23 నుంచి మిగతా 2లో..

## పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తేవాలి



**విహారయాత్ర కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

- తెలంగాణ వ్యాప్తంగా వాటిని గుర్తించాలి
- అక్కడికి ప్రజలు వెళ్లేలాగా ప్రమోట్ చేయాలి
- పర్యాటక ఆదాయంపైనా దృష్టి పెట్టాలి
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సూచన

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, ఎన్సీసీపై బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. సాంస్కృతిక సారథి కళాకారులు గత ఏడు నెలలుగా ఏ విధులు నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం ఆరాతీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదు.. వారి సేవలు వినియోగించు కునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసింది.. ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది.. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయండి, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మిగతా 2లో..

## అధికారమే మారింది

- పాలన పాతదే: కిషన్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మిగతా 7లో..

## నీట్ యూజీ ఫలితాలు విడుదల

**పరీక్ష కేంద్రాల వారీగా వెల్లడించిన ఎన్టీఏ**



దిల్లీ(జనంసాక్షి):నీట్–యూజీ 2024పరీక్షలో పేపర్ లీకేజీ, అవకతవకల వ్యవహారంపై దుమారం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా నీట్–యూజీ ఫలితాలు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) శనివారం వెల్లడించింది. ఫలితాలను వెల్లడించేటప్పుడు విద్యార్థుల గుర్తింపు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడింది. నీట్–యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన 40కిపైగా పిటిషన్లపై ఇటీవల భారత ప్రధాన మిగతా 2లో..



## పార్టీ ఫిరాయింపులపై జోక్యం చేసుకోండి

**మా ఎమ్మెల్యేలను బెదిరించి చేర్చుకుంటున్నారు • రాష్ట్రంలో రాజ్యాంగంపై దాడి జరుగుతోంది**

**నిరుద్యోగ హామీలను తుంగలో తొక్కారు • గవర్నర్‌కు భారాస బృందం వినతి**

హైదరాబాద్(జనంసాక్షి): తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న సంగతి గురించి గవర్నర్‌కు తెలిపామని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చని అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కెటిఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు శనివారం గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. ఆ తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా తుంగలో తొక్కుతోందో ఆయనకు వివరించాం. హామీలు అమలు చేయాలన్న విద్యార్థుల అరెస్టులు, అక్రమ కేసులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని వివరించామని అన్నారు. గవర్నర్ చాలా సీరియస్‌గా ఈ అంశాలపై స్పందించారు. హోంశాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగు తానని చెప్పారు. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్న సంగతి గురించి గవర్నర్‌కు తెలిపాం. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని.. స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని ఆయనకు మిగతా 2లో..

## కులగణన వల్ల అనేక సమస్యలు


**కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని కొంతకాలంగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కులగణనపై స్పందించిన కేంద్రమంత్రి, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాసవాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో కులగణన చేపట్టేందుకు మద్దతు తెలిపారు. కానీ, అది సమాజ విభజనకు దారి తీస్తుందన్నారు. అందుకే వాటి సమాచారాన్ని బహిర్గతం చేయకూడదని హెచ్చరించారు. కమ్యూనిటీ ఆధారిత అభివృద్ధి పథకాలకు నిధుల మిగతా 2లో..





## వానలే వానలు



**వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు**

- కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి
- ప్రాజెక్టులకు భారీగా వచ్చి చేరుతున్న నీరు
- సింగరేణిలో బోగ్గు ఉత్పత్తికి అంతరాయం
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- క్రమంగా పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- ఎగవ నుంచి భారీగా వస్తోన్న వరదనీరు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

హైదరాబాద్(జనంసాక్షి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం తీరం వైపునకు కదులుతోంది. పూరీ తీరానికి 40 కిలో మీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రకృతమైందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఒడిశా– ఛత్తీస్ గఢ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న మిగతా 2లో..

## చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీ

**నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్(జనంసాక్షి): చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 30 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ప్రకటించారు. వాటిలో క్లస్టర్ డెవలంమెంట్ ఎగ్జిక్యూటివ్స్ 8, టెక్స్‌టైల్ డిజైనర్ ఉద్యోగాలు 22 ఉన్నట్టు తెలిపారు. ఐఐహెచ్‌టీ నుంచి చేనేత టెక్నాలజీలో డిప్లొమో చేసిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె మిగతా 2లో..

## పాఠశాలల పనివేళల్లో మార్పులు

**ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు నిర్వహణ**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ విద్యాశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ పనివేళల మార్పు గురించి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పని చేయనున్నట్లు మిగతా 2లో..

## ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులు కోర్టుకు హాజరుకావాల్సిందే

నాంపల్లి కోర్టు సంచలన ఆదేశాలు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏ1 ప్రభాకర్ రావు (ఎస్ఐబీ మాజీ చీఫ్), ఏ6 శ్రవణ్ రావును కోర్టులో హాజరుపర్చాలని నాంపల్లి కోర్టుఆదేశాలు జారీసింది. ఇప్పటికే ప్రభాకర్ రావుపైన కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ మిగతా 2లో..

## బంగ్లాదేశ్‌లో మహా రిజర్వేషన్ ఉద్యమం

**స్వదేశానికి వస్తున్న భారతీయులు**

ఢాకా(జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని సంస్కరించాలంటూ బంగాదేశ్‌లో విద్యార్థులు చేస్తోన్న ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న పలువురు భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21.07.2024

### పర్యాటక ప్రాంతాలను
# వెలుగులోకి తేవాలి

అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడా మైదానాలు ఉన్నాయి.. వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయి.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి మైదానాలను ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడా మైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్‌లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కల్చర్ అంటే ఆటలు, పాటలు అనుకుంటున్నారు.. కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలా మందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు.. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్టులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. రాష్ట్రంలో సంస్కృతి, వారసత్వ సంపదలు ఘనంగా ఉన్నా.. ఆ మేరకు వాటిని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు దృష్టి సారించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు.

### ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులు
# హాజరుకావాల్సిందే..

చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావు వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. అయితే ప్రభాకర్ రావు విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను పోలీసులు ఇండియాకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికాలో ప్రభాకర్ రావు ఉన్నట్లు సిట్ బృందం గుర్తించింది. శ్రవణరావు ఆచూకీని మాత్రం దర్యాప్తు బృందం ఇప్పటికీ కనుకోలేకపోయినట్లు తెలుస్తోంది. కాగా... ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చిన విషయం తెలిసిందే. ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే ఫోన్ టాపింగ్ జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఫోన్ టాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభాకర్ రావు విదేశాలకు వెళ్లిపోయాడు. దీంతో ప్రభాకర్ రావు ఆచూకీ కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. లుక్ అవుట్ నోటీసులకు స్పందన లేకపోవడంతో.. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు.

## బంగ్లాదేశ్‌లో మహా రిజర్వేషన్ ఉద్యమం

చేరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది విద్యార్థులు వచ్చారు. వారిలో 778 మంది సరిహద్దు మార్గాల ద్వారా రాగా, మరో 200 మంది విమానాల్లో సొంత దేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు.అంతర్జాతీయ సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్ చేరుకుంటున్న విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని సదుపాయాలు కల్పిస్తోందని విదేశాంగ శాఖ తెలిపింది.

## కులగణన వల్ల అనేక సమస్యలు

కేటాయింపు కోసం నిర్దిష్ట డేటా తరచూ అవసరమవుతోంది. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ డేటా ఉపయోగపడుతుంది. కులగణన నిర్వహించడం అవసరమే. కానీ, ఇందులో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. కులగణన ద్వారా సమాజంలో విభజన ఏర్పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ గణాంకాలను బయటకు తీసుకురావడం అంత మంచిది కాదు. ఎన్డీయే ప్రభుత్వంలో దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని విలేకరుల సమావేశంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని భారత్‌లో చూడవచ్చు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో కనుక చూస్తే కొందరు ఆదివాసీలు వీటికి దూరంగా ఉంటున్నారు. అలాంటి వారందరినీ ఒకే గొడుగు కిందకి తీసుకురాగలమా? కులగణనకు ముందు ఒక ముసాయిదా తీసుకురావాల్సి ఉంటుంది. దాన్ని పరిశీలించి కీలక నిర్ణయాలు తీసుకోవాలి. అది వచ్చేంత వరకు నేనేమీ మాట్లాడలేను అని పేర్కొన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## నేడు హస్తినకు సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆది, సోమవారాల్లో ఆయన హస్తినలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రేంవత్ రెడ్డి ఢిల్లీ చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో పాటు.. పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణతో పాటు కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పదవుల పంపకం పూర్తవ్వడంతో.. మిగిలిన పదవులు ఎవరెవరికి కేటాయించాలి.. పదవులు దక్కని సీనియర్లను ఎలా గౌరవించాలనే విషయంపై కూడా అధిష్టానంతో రేవంత్ చర్చించనున్నారు. మరోవైపు వరంగల్‌లో ఏర్పాటుచేయబోయే భారీ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ అమలు చేయడంతో రాహుల్‌తో సభ పెట్టిస్తే బాగుంటుందనే ఉద్దేశంలో రాష్ట్ర నాయకులు ఉన్నారు. ఈ విషయాన్ని హైకమాండ్‌కు రేవంత్ తెలియజేయనున్నారు..

## సంకీర్ణ రాజకీయాలకు ఆద్యుడు ఎన్టీఆరే..

**హైదరాబాద్(జనంసాక్షి):** రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వల్లనే దేశంలో సంకీర్ణ రాజకీయ శకం మొదలయ్యిందన్నారు. ఎందరో ఆయన నీడలో రాజకీయ జీవితాన్ని పొందారని అన్నారు. హైదరాబాద్ కమ్మ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ దేశానికి సంకీర్ణ రాజకీయాలు ఎన్టీఆర్ నేర్పించారన్నారు. ఎంతో మందిని రాజకీయాలకు పరిచం చేసిన వ్యక్తని అన్నారు. పది మందిని ఆదుకునే గుణం కమ్మవారిదని చెప్పారు. వారు తమ సమజమైన ఆదుకునే గుణంతో మరింతగా ఎదగాలని ఆకాక్షించారు. తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కష్టపడేతత్వం కమ్మవారిదని, అలా ఎన్నో రంగాల్లో వారు రాణిస్తున్నారని అన్నారు. కమ్మల కష్టానికి గుర్తింపు అవకాశాలు ఉంటాయని చెప్పారు. మట్టి నుంచి బంగారం తీయగల శక్తి కమ్మవారికి ఉందన్నారు. ఎన్టీఆర్ రాజకీయాలకు ఒక బ్రాండ్ అని లీడర్ షిప్ కు ఒక కబ్రాండ్ అని అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్మ కుటుంబ సభ్యులను ఒక్క దగ్గర చేర్చడం అభినందనీయమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2023కి ముందే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు.

# ప్రజాప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుంది



మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి సీఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఫ్లైఓవర్- పైకి ఉమెన్‌బైకర్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అనుమతించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "గోపనపల్లి ఫ్లైఓవర్ ద్వారా శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతుంది. మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిది. హైదరాబాద్ అభివృద్ధికి హైడ్రా అనే వ్యవస్థను తీసుకువస్తున్నాం. చిన్న వర్షం పడినా మన కాలనీలు మురికి కాల్వలు అయిపోతున్నాయి. మూసీని అభివృద్ధి చేసే బాధ్యత మాది. ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తాం". అని వెల్లడించారు.తెలంగాణకు 65 శాతం ఆదాయం జంట నగరాల నుంచే వస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. దేశం నలు మూలల నుంచి ఎవరొచ్చినా అక్కున చేర్చుకుం టున్నా మన్నారు. వైఎస్సార్ హయాంలో హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గోపనపల్లిలో ఎకరం రూ.100 కోట్లు పలుకుతోందని అన్నారు. గోపనపల్లికి వచ్చిన ఐటీ, ఫార్మా సంస్థల వల్ల భూమి ధర పెరిగిందని వివరించారు. " ఈ ప్రాంతంలో అవసరం కోసం అవసరమైన ఏ నిధులను ఆపకుండా పూర్తిస్థాయిలో ఎక్కడికక్కడ వేగంగా మీకు నిధులిస్తున్నాం. ఈ ప్రాంతం అభివృద్ధిని ప్రభుత్వం తీసుకుంటుంది. మన నగరానికి తలమానికం మూసీ నది. అలాంటి మూసీ నది మురికి కూపంగా మారి, ప్రపంచంలో ఉన్న చెత్త మొత్తం మూసీ నదిలో వేసే పరిస్థితి ఉంది. కాల్వలు, నాలాలు కబ్జా పెట్టుకుని మూసీ వైపు వెళ్లాల్సిన నీళ్లను మనం ఎక్కడికక్కడ కబ్జాలతో అడ్డుకోవడంతో ఈరోజు మన కాలనీలు అన్నీ చిన్న వర్షం పడినా జలమయం అయిపోతున్నాయి. దేశం నలుమూలల నుంచి ఎవరొచ్చినా అక్కున చేర్చుకుంటున్నా మన్నారు. "గోపనపల్లి ఫ్లైఓవర్ ద్వారా శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతుంది. మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిది. హైదరాబాద్? అభివృద్ధికి హైడ్రా అనే వ్యవస్థను తీసుకువస్తున్నాం. చిన్న వర్షం పడినా మన కాలనీలు మురికి కాల్వలు అయిపో తున్నాయి. మూసీని అభివృద్ధి చేసే బాధ్యత మాది. ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తాం,ఈ ప్రాంతంలో అవసరం కోసం అవసరమైన ఏ నిధులను ఆపకుండా పూర్తిస్థాయిలో ఎక్కడికక్కడ వేగంగా మీకు నిధులిస్తున్నామన్నారు.ఈ ప్రాంతం అభివృద్ధిని ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం అన్నారు.

### జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

జరిగిందని అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని మార్పులు చేశామని తెలిపారు. గ్రూప్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. అంతకుముందు సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ పాల్గొన్నారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడింది. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చాం. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాం. పరీక్షలు మాటిమాటికి వాయిదా పడటం మంచిదికాదు. అభ్యర్థుల సమస్యలను అర్థం చేసుకుని గ్రూప్-2ను వాయిదా వేశాం. నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం అని సిఎం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తున్నాం. జూన్ 2న నోటిఫికేషన్, డిసెంబర్ 9 లోపు ఉద్యోగాలిచ్చేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరపున సాయం చేస్తున్నాం. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా జాబ్ సాధించాలి. సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుంది.నోటిఫికేషన్ ఇచ్చి సమయానికి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు గత పదేళ్లలో లేవు. అందుకు కారణమేదైనా యువత ఉజ్వల భవిష్యత్ ఆగమైంది. దురదృష్టవశాత్తూ కొన్నేళ్లుగా తెలంగాణలో యువత ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే దానికంటే.. పరీక్షల్లో జరిగే నిర్వహణ లోపాలపై కొట్లాడేందుకే వారి సమయం వృథా అయ్యింది. యూపీఎస్సీ ఎప్పుడు పరీక్షలు నిర్వహించినా.. వాటిపై ఆరోపణలు లేవు. అందుకే మేం గతంలో యూపీఎస్సీ ఛైర్మన్‌ను కలిశాం. యూపీఎస్సీ తరహాలో కొన్ని మార్పులు చేసి వెంట వెంటనే నోటిఫికేషన్లు ఇస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్-2 పరీక్ష వాయిదా వేశామని చెప్పారు. ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే అని తెలిపారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ ఏటా మార్చ్‌లోగా అన్ని శాఖలలో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామన్నారు. జూన్ 2 లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక పక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సింగరేణి సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ తరఫున సాయం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నాం. మరోవైపు, తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటుపై ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ వర్శిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తొలి ఏడాది 2 వేల మందితో ప్రారంభించి క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారని వివరించారు.మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు ,ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్‌రావు, ఎంపీలు రామసహాయం రఘురామ్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు కోరెం కనకయ్య, వివేక్ వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, కె.ప్రేమసాగర్ రావు,మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మట్టా రాగమయి, కనీస వేతనాల కమిషన్ ఛైర్మన్ జనక్ ప్రసాద్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, సీఎంవో సెక్రటరీ మాణిక్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### భారాస ధనదాహానికి
## కాళేశ్వరం బలి

13 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. కాళేశ్వరం అన్ని పంపులు నడిస్తే కరెంటు బిల్లు రూ.13వేల కోట్లు అవుతుంది. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే.. కరెంట్ బిల్లు రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేశారు. అప్పటికీ మేడిగడ్డ పియర్స్ 5 ఫీట్లు కుంగాయి. మేడిగడ్డ బ్యారేజి కుంగిన విషయాన్ని కూడా భారాస నేతలు ఒప్పుకోవట్లేదు. ఎవరో బాంబు పెట్టి ఉంటారని సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాళేశ్వరం విషయంలో ఏం చేయాలనే దానిపై ఇంజినీర్లతో చర్చిస్తున్నాం. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచన మేరకు ముందుకెళ్తాం. రిపేర్లు చేస్తే.. కాళేశ్వరం పనికి వస్తుందేమో పరిశీలిస్తున్నాం. బ్యారేజీ అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందికి వదలాలని ఇంజినీర్లు చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం గేట్లు ఎత్తాలని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది" అని ఉత్తమ్ తెలిపారు.భారాస దోపిడీ విధానానికి కాళేశ్వరం ప్రాజెక్టు బలైపోయిందని ఉత్తమ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ ప్రజల అమూల్యమైన సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టు దుర్వినియోగం కాకూడదని భావిస్తున్నామన్నారు. మరమ్మతులు చేసైనా ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలన్న సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. "అన్నారం బ్యారేజీలో భారీగా సీపేజీ ఉంది. ఏదైనా నిపుణుల కమిటీ సూచనల ప్రకారమే ముందుకెళ్తాం. తుమ్మిడిహట్టి వద్ద అదనంగా ఒక ప్రాజెక్టు నిర్మించి తీరుతాం. గ్రావిటీ ద్వారా తక్కువ ఖర్చుతో నీరు తరలించేలా నిర్మిస్తాం. కాళేశ్వరం ఉపయోగంలోకి వస్తే.. దానిని కొనసాగిస్తాం" అని ఉత్తమ్ వివరించారు.

## 25న కేబినేట్ భేటీ..

ప్రారంభం కానున్న బ్జడెట్ సమా వేశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతా ధికారులతో సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచరంతో సమాధానాలు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సెషన్‌లో సమన్వయ లోపం గ్యాప్ లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సీఎస్ తెలిపారు. రాష్ట్ర వార్షిక బ్జడెట్‌ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనుంది. నోట్ ఆన్ డిమాండు మరియు రూపొందించి బ్జడెట్‌ను సిద్ధంగా ఉంచాలని, తద్వారా సభ్యులు దానిని పరిశీలించడానికి.. చర్చకు సంబంధించిన విషయాలను లేవనెత్తడానికి తగిన సమయం ఉంటుందని అధికారులను కోరారు.

## నీట్ యూజీ ఫలితాలు విడుదల

న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే నగరాలు, పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలను శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోగా విడుదల చేయాలని ఎన్టీఏను ఆదేశించింది.మిగతా కేంద్రాలతో పోలిస్తే అనుమానిత పరీక్ష కేంద్రాల్లో రాసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చాయా.. లేదా అని తెలుసుకోవడానికే ఈ జాబితాను కోరుతున్నామని తెలిపింది. ఫలితాలను ఎన్టీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అయితే విద్యార్థుల గుర్తింపు బయటపడకుండా చూడాలని సూచించింది. ఈ క్రమంలోనే ఎన్టీఏ నేడు ఫలితాలను విడుదల చేసింది. ఈ వ్యవహారంపై జులై 22న ధర్మాసనం తదుపరి విచారణ చేపట్టనుంది.ఈ ఏడాది మే 5న నీట్ యూజీ పరీక్ష జరిగింది. 571 నగరాల్లోని 4,750 సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 24 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇందులో 14 కేంద్రాలు విదేశాల్లో ఉన్నాయి.

### చేనేత, జౌళిశాఖలో
### ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు తాత్కాలిక పద్ధతిన మూడేళ్లపాటు పనిచేయాల్సి ఉంటుందని శైలజారామయ్యర్ స్పష్టం చేశారు.

### పలువురు ఐఏఎస్‌ల బదిలీ..

ఎక్కా నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఎ.శరత్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొర్ర లక్ష్మి, విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శిగా హరీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. హనుమకొండ స్థానిక సంస్థల అదనపు కమిషనర్ రాధిక గుప్తా మేడ్చల్ కు బదిలీ అయ్యారు.

### భారీగా డ్రగ్స్ పట్టివేత

రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులు, వ్యాపారవేత్తలే లక్ష్యంగా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. వారి నుంచి 1,250 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని తెలిపారు. నిందితులు నలుగురూ రాజస్థాన్‌కు చెందిన వారేనని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మీడియాకు వెల్లడించారు. హెరాయిన్‌ను చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బస్సుల్లో తీసుకొస్తున్నట్లు చెప్పారు.

### పాఠశాలల పనివేళల్లో మార్పులు

ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇక హైదరాబాద్, సికిం ద్రాబాద్ జంట నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల నిర్వహణ కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు.

# పార్టీ ఫిరాయింపులపై జోక్యం చేసుకోండి

వివరించాం. ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా గవర్నర్‌కు వివరించాం అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భారాస అండగా అండగా ఉంటుందని.. వారికి కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చే వరకూ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. రెండు ముఖ్యమైన అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను గవర్నర్‌కు తెలియజేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతూ.. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు చేసి కేసు పెడుతున్నట్లు చెప్పాం. విద్యార్థులపై లాఠీలు ఝులిపిస్తూ.. భయానక వాతావరణం సృష్టించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను యూనివర్సిటీల్లో చూస్తున్నామని కేటీఆర్ తెలిపారు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి ప్రకటనలు ఇచ్చారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. కేసీఆర్ హయాంలో జారీ అయిన గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు రద్దు చేసి పోస్టుల సంఖ్య పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తు చేశామన్నారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని గవర్నర్‌కు చెప్పామని కేటీఆర్ తెలిపారు. మెగా డీఎస్సీ అని చెప్పారు కానీ వేయలేదు. నిరుద్యోగ భృతి 4 వేలు ఇవ్వలేదు. అన్నింటికి మించి సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులను బయటకు ఈడ్చుకొచ్చి హింసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ ఉన్న విద్యార్థులపై దాడులు చేసి అప్రజస్వామికంగా వ్యవహరించారని వివరించి చెప్పామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి.. కాంగ్రెస్ టికెట్‌పై పార్లమెంట్‌కు పోటీ చేశారు. మ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రోటోకాల్ విషయంలో జరు గుతన్న అగౌరవాన్ని కూడా వివరించాం. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాస్తానని గవర్నర్ చెప్పారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా చూస్తానని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని గవర్నర్ చెప్పారు. ఇక్కడితో ఆగకుండా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండే పెద్దలను కలిసి కాంగ్రెస్ పార్టీ నిర్వాకాన్ని వివరిస్తాం. రాష్ట్రపతిని కూడా కలిసి చెబుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే వరకు, గ్రూప్-2, 3 పోస్టులు పెంచేదాకా, నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, నిరుద్యోగులకు అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని, కాలె వెంకటేశ్,గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు కెటిఆర్ వెంట ఉన్నారు.

# వానలే వానలు

భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నది వరద ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి వద్ద నీటమట్టం 30.5 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులుకాగా ప్రస్తుతం 1066 అడుగుల వరకు నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న కుండపోత వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. నిన్న రాత్రి నుంచి వర్షం కురుస్తోనే ఉంది. అయితే ఈ వారాంతంలో తెలంగాణ రికార్డు వర్షపాతాన్ని నమోదు చేసింది. రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మి.మీ. వర్షపాతం నమోదైంది.వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే 18 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఉత్తర తెలంగాణా లోని 11 జిల్లాలలో ఈనెల 20 , 21 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు.జూలై 20, 21 తేదీలలో 11 జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం,కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ జిల్లాల కలెక్టర్లు ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలసి ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ 11 జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని ఆమె అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్ద వాగుకు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల చిక్కుకుపోయిన దాదాపు 40 మందికి ఏవిధమైన అపాయం జరుగకుండా వివిధ శాఖల సమన్వయంతో కాపాడినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ను శాంతి కుమారి అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాకలో బానరి రాజు అనే వ్యక్తి వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైనట్లు తెలుస్తోంది. పడవల సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పలుచోట్ల పత్తి, వరి చేళ్లు మునిగిపోయాయి. వరంగల్, హన్మకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో చెరువులు, కుంటలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. భారీ వర్షాలతో పెద్దపల్లి జిల్లా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. రామగుండం రీజియన్ లో నాలుగు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో రోజుకు 80 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. మంచిర్యాలలోని ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులలో ఉత్పత్తి నిలిచిపోయింది. శ్రీరాంపూర్, ఇందారం, ఆర్కేపీ, మందమర్రి, ఖైరీగూడ గనుల్లోకి వర్షపు నీరు చేరడంతో 60వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కి విఘాతం ఏర్పడింది. సంస్థకు 10 కోట్ల మేర నష్టం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

**క్రమంగా పెరుగుతున్న గోదావరి**

భద్రాద్రి కొత్తగూడెం రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు.భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుపోతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 31.5 గా ఉంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేశారు. మరోవైపు తాళిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన తాళి పేరు ప్రాజెక్టు, పెరూరు వైపు నుంచి వరద నీరు రావడంతో నది నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు.

## అంగన్‌వాడీల్లో 3వ తరగతి వరకు
# సమంజసం కాదు

**టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర స్టడీ సర్కిల్ సభ్యుడు మంగు జయప్రకాశ్**



**స్టేషన్ ఘన్‌పూర్, జులై 20 (జనంసాక్షి) :** అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి 3 వ తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైనది కాదని, ఆ ప్రతిపాదన విరమించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర స్టడీ సర్కిల్ సభ్యుడు,జిల్లా ఉపాధ్య క్షుడు మంగు జయప్రకాశ్ డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్ వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు అస్సలు గుర్తించటం లేదని కనుక 1,2,3 తరగతులను అంగన్ వాడీలకు అప్పగించటం అంటే అది ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లల మూసివేతకే దోహదపడుతుందని ఆయన ఆవేద న వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వప్రాథమిక తరగతులను ప్రారంభించాలని ఆయ న కోరారు. సెమి రెసిడెన్షియల్ పాఠశాలలను ఆహ్వాని స్తున్నామని అన్నారు.ప్రాథమిక,ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వా నించతగినదని, ఎంపికచేసిన పాఠశాలల్లో తరగతి కొక టీచరు, సబ్జక్టుకొక టీచరు, ప్రధానోపాధ్యాయులు, తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడాలని కోరారు.

# పెద్దవాగుకు గండి.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- సకాలంలో ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంటే ప్రమాదం తప్పేది
- వంద కోట్ల రూపాయల నష్టం జరిగి ఉండేది కాదు
- నష్టపోయిన రైతన్నను తక్షణం ఆదుకోవాలి.. ప్రతి రైతుకూ రూ.25వేలు చెల్లించాలి
- ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్

**హైదరాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టు గండిపడి, కట్టకొట్టుకు పోయిన ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిందని మండిపడ్డారు. రైతులు హెచ్చరించినప్పుడే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయి గేట్లు తెరిచి ఉంటే వంద కోట్ల రూపాయల నష్టం జరిగేది కాదన్నారు. కట్టమీద నుంచి నాలుగైదు గంటల పాటు నీళ్లు పొంగిపొర్లుతుంటే గేట్లు ఎత్తకుండా అధికారులు ఎందుకు ఆలస్యం చేశారన్నారు. మూడు గేట్లుంటే, రెండు గేట్లే ఎత్తడంలో ఆంతర్యం ఏమిటన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు బద్దలై.. గుమ్మడివల్లి గ్రామాన్ని ముంచేసి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం ప్రదర్శించి వందల మంది గిరిజన బిడ్డల ప్రాణాలు ఫణంగా పెట్టారని హరీశ్ రావు అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు తెలంగాణ భూ భాగంలోనే ఉన్నదని, పర్యవేక్షణ చేస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులేనని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు గండి పడటం వల్ల గుమ్మడివల్లి, రంగాపురం, కోయరంగాపురం, బుచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



పంటలతోపాటు, పశుసంపదకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు ఘటన ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని హరీశ్ రావు విమర్శించారు. రక్షించండని అధికారులకు ఫోన్ చేసినా కనీస స్పందన లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హెలికాప్టర్లు సరైన కాలంలో రాకంటే ఆ రోజు వరదలో చిక్కుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీరు దారుణమన్న హరీశ్ రావు, ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు రోజులైనా మంత్రులకు తీరిక దొరకలేదా అన్నారు. ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటని నిలదీశారు. ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు 25 వేల రూపాయలు చెల్లించి రైతులను ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం కింద ఎకరాకు 10 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చెయ్యాలని, పశువులు కోల్పోయిన రైతులకు ప్రకృతి వైపరిత్య నిధి నుండి ప్రభుత్వం వెంటనే సహాయం హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కారణాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# కేంద్ర బడ్జెట్‌లో కరీంనగర్‌కి ఐఐటీ మంజూరు చేయాలి

**విభజన హామీల అమలుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలి**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం 23న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ కి రావాల్సిన విభజన హామీలు అమలు జరిగేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్రం పై ఒత్తిడి తేవాలని, విభజన హామీ చట్టం ప్రకారం కరీంనగర్ లో ఐఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్న పది సంవత్సరాలు అయిన ఇప్పటికీ కరీంనగర్ లో ఐఐటీ ఏర్పాటు కాలేదని, కరీంనగర్ జిల్లాకి రావాల్సిన ట్రిపుల్ ఐటీ గతంలో కర్ణాటక రాయచూరుకి మంజూరు చేశారని, ఈ బడ్జెట్ లో కరీంనగర్ లో ఐఐటీ మంజూరు చేయాలని, గతంలో కరీంనగర్ జిల్లాకు సైన్స్ సెంటర్, స్థలం కూడా మంజూరు అయిన నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, శాతవాహన యూనివర్సిటీ కి న్యాక్ గుర్తింపు లేదని, శాతవాహన యూనివర్సిటీ కి 200కోట్ల నిధులు తీసుకురావాలని, పార్లమెంట్ పరిధిలో స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటు చేయాలని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని విద్యార్థి, నిరుద్యోగ యువతకు విద్య ,ఉపాధి అవకాశాలు స్థానికంగా దక్కేలా కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, చిన్న, పెద్ద తరహా కంపెనీలు, పరిశ్రమలు కరీంనగర్ లో పార్లమెంటు పరిధిలో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ కేటాయింపుల్లో మంజూరు అయ్యేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని , తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణలో ప్రతి జిల్లాకో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, ఐఐటీ, ఐఐఎం లాంటి అనేక ఉన్నత విద్యాసంస్థల కేటాయింపులు చేయాలని విభజన హామీ చట్టం చెప్పిన ఇప్పటికీ అమలు కాలేదని విభజన హామీల అమలు జరిగేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని,కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యకు 10% నిధులు కేటాయించాలని,కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ విద్యార్థి,యువతకు న్యాయం చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు

# దేశ భక్తిని పెంపొందించడమే ఐవీవో లక్ష్యం



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి) :** కోదాడలో ఇండియన్స్ వెటరన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 100 అడుగుల భారత త్రివర్ణ పతాక నిర్మాణం ఆగస్టు 15న జాతికి అంకితం చేస్తున్నట్లు ఐవీవో జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి మధుసూధన్ చౌదరి తెలిపారు.శనివారం జిల్లా కేంద్రంలో యూత్ వింగ్ కోఆర్డినేటర్ గొట్టిపర్తి శ్రీకాంత్, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు, సిబ్బంది, టీటీడబ్ల్యూఆర్డీసీ ఉమెన్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రవళికలు ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే మాజీ సైనికులతో 100 అడుగుల జాతీయ జెండాను నిర్మాణం చేపట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు.ప్రజల్లో జాతీయ భావం, సమైక్యత, దేశ భక్తిని పెంపొందించాలనే ఉన్నత ఆశయంతో చేస్తున్న ఈ యజ్ఞంలో ప్రతి ఒక్క భారతీయుని ప్రేమ, ప్రమేయం ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.ఈ నిర్మాణానికి 324 రూపాయల పైన ఎంతైనా ఆర్థిక సాయం అందించవచ్చన్నారు. ఫోన్ పే నెంబరు 7893813768కు పంపాలని కోరారు. జిల్లా పీఆర్ఓ ఎస్.రమేష్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో కూడా జనవరి 26 నాటికి 100అడుగుల జాతీయ జెండా నిర్మాణం చేయుటకు ఐవీఓ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వెటరన్ జంపాల వెంకన్న, ఈసీ మెంబర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌ను కలిసిన గ్రూప్ 2 అభ్యర్థులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రూప్ 2 పరీక్షలను ఆగస్ట్ నుండి డిసెంబర్‌కి వాయిదా వేసినందుకు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌ను కలిసి నిరుద్యోగులు స్వీట్స్ తినిపించారు. డీఎస్సీ - గ్రూప్-2 పరీక్షల మధ్య సమయం తక్కువ ఉందని అభ్యర్థులు గ్రూప్ 2 డిసెంబర్‌లో నిర్వహించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభ్యర్థుల విజ్ఞిప్తి మేరకు గ్రూప్ 2ని డిసెంబర్‌కు వాయిదా వేశారు. దీనికి సంబంధించి టీజీపీఎస్సీ కూడా మొన్న అధికారికంగా వెబ్ నోట్ విడుదల చేసింది. ఈ మేరకు యువకుల ప్రతినిధిగా ఎమ్మెల్సీగా సీఎం, డిప్యూటీ సీఎంకు ధన్యావాదాలు తెలుపుతున్నట్టు బల్మూరి వెంకట్ అన్నారు. యువకుల, నిరుద్యోగులకు ఎలాంటి సమస్యలున్నా ఈ సర్కారు స్పందిస్తుందని చెప్పారు. గ్రూప్ 2 అభ్యర్థులు కోరుకున్నట్లు వాయిదా పడ్డాయి కాబట్టి అందరూ మంచిగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలు రాసే ప్రతి అభ్యర్థికీ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

# ముఖ్యమంత్రి కృషితోనే ఆర్యవైశ్య కార్పొరేషన్

**ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ • ఘనంగా ఐవిఎఫ్ 11వ వార్షికోత్సవ వేడుకలు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ముషీరాబాద్‌లోని వైశ్య వసతి గృహంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు జయ సింహ హాజరై కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్య వైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. అనంతరం



ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వున్న వైశ్యులను ఏకం చేయడమే ఐవిఎఫ్ ప్రధాన లక్ష్యం అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీలను పేద ఆర్య వైశ్యుల అందేలా కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు మాట తప్పడం జరగదని అన్నారు. గంజి రాజమౌళి గుప్త మాట్లాడుతూ రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం ఇంటర్నేనల్ వైశ్య ఫెడరేషన్ 11 సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాస్ సరస్వతి టెంపుల్ వర్గల్ చైర్మెన్ చంద్ర శేఖర్ సిద్ధాంతి, ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్, కొడిపాక నారాయణ, ముత్యాల సత్య, కటా రవి, మహిళ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మంజుల, శ్రీకాంత్ సంధ్య యుట్యూబార్స్, మనిమల, ముషీరాబాద్ ప్రెసిడెంట్ కాల్వ వీరేందర్ గుప్త, మహిళ విభాగ్ కాల్వ సితార, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి కసనగొట్టు సతీష్, నాయకులు చంద్రశేఖర్, అజయ్, శ్రీధర్, గుండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి కోవిడ్ సమయములో తలసేమియా వ్యాధిగస్తులకు రక్తదానం చేసిన వివిధ జిల్లాల నుండి వచ్చిన 100 మందిని ఘనంగా డాక్టర్ ఎన్ బాలు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



# అధికార పార్టీ ఎత్తులను చిత్తుచేసిన బిఆర్ఎస్

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**మహేశ్వరం జులై 20 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసిన అధికార పక్షాలకు ఇది చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నెగ్గారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ప్రస్తుత శాసనసభ్యులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వక కలిసి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన అధికార పార్టీ పన్నిన కుట్రలను చేధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారిని కేటీఆర్, సబితా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొక్క రాజేందర్రెడ్డి, సిద్ధాల లావణ్య, బీరప్ప, సిద్ధలపద్మా అంజయ్య, రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తాండూరులో నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

**7.95 లక్షల 500 నోట్లు స్వాధీనం..నలుగురు నిందితుల అరెస్టు రిమాండ్ : వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి**



**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 20 (జనంసాక్షి):** గుట్టు చప్పుడు కాకుండా నకిలీ నోట్లు తయారుచేసి మార్కెట్లో చలామణి చేస్తున్న నకిలీ నోట్ల తయారీ ముఠా గుట్టు రట్టు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి విలేకరులకు తెలియజేశారు. ఎందుకు సంబంధించి మండికి చంద్రయ్య(51) ఇచ్చాపురం జగదీష్(42) బొడుగంటి వీర వెంకట నారాయణ(27) ప్రగల్ల పాటి శివకుమార్(43) నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్ల ఎస్పీ నారాయణరెడ్డి తెలియజేశారు

శుక్రవారం నాడు ఉదయం తాండూర్ పట్టణంలోనీ రైల్వే స్టేషన్ సమీపంలో నమ్మదగిన సమాచారం మేరకు మండిగి చంద్రయ్య ఇంటిపై పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు, వృత్తిరీత్యా బండల వ్యాపారం చేస్తున్న నిందితుడు, వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని అయ్యప్పనగర్ నివాసం ఉంటున్నాడు, నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద 500 రూపాయల నకిలీ నోట్లు 90 స్వాధీనం చేసుకొని క్రైమ్ నెంబర్. 243/2024, అండర్ సెక్షన్ 178,179,180 మరియు 318(4) ఆఫ్ బి ఎన్ ఎస్ పైన కేసు నమోదు చేసుకొని తాండూరు పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మిగతా నిందితులు అయిన ఇచ్చాపురం జగదీష్, బడుగంటి వీర వెంకట రమణ, ప్రగల్లపాటి శివకుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఇచ్చాపురం జగదీష్ నివాసం ఉండే మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని మల్లంపేట లోని ఎస్ఆర్ఎస్ వృషభాద్రి అపార్ట్మెంట్లో ఉండగా అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి నకిలీ 500 రుపాయల నోట్లు 1500 విలువ మొత్తం 7,50,000 రూపాయలు, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన కంప్యూటర్ మానిటర్, సిపియు, ప్రింటర్, పేపర్లు, రిబ్బన్, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసినట్లు ఎస్పి నారాయణరెడ్డి తెలియజేశారు. నిందితులకు గతంలో నేరచరిత్ర ఉన్నట్లు తెలియజేశారు. మండిగి చంద్రయ్య, ఇచ్చాపురం జగదీష్ మాజీ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, మూడో నిందితుడు బడుగంటి వీర వెంకటరమణ. నాలుగో నిందితుడు ప్రగల్లపాటి శివకుమార్. వీరంతా నిరక్షరాస్యులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, రద్దీగా ఉండే వ్యాపార సముదాయాలను, లక్ష్యంగా చేసుకొని నేరస్తులు దొంగ నోట్లను చలామణి చేస్తుంటారు. ఈ నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరచడం జరుగుతుంది. తాండూర్ డి.ఎస్.పి బాలకృష్ణ రెడ్డిఅధ్వర్యంలో సీఐ.సంతోష్ కుమార్, ఎస్సై. శ్రీ రాములు, హెచ్ సి అంజద్ పోలీస్ కానిస్టేబుళ్లు శివ కుమార్ సాయప్ప షబీల్ ప్రభులింగం నిందితులను నకిలీ కరెన్సీ పెట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. వారికి తగిన ప్రోత్సాహకాలు అందజేస్తామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలియజేశారు.

# మాదకద్రవ్య నిషేధంపై బాధ్యతతో వ్యవహరించండి

**విద్యార్థులు ర్యాగింగ్ లకు పాల్పడితే కఠిన చట్టాలు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు**




**భువనగిరి ప్రతినిధి, జూలై 20 (జనంసాక్షి) :** మాదకద్రవ్య నిషేధంపై పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ సర్కులర్ ఆదేశాల మేరకు పట్టణంలోని రాయగిరి యూనిటీ ఫార్మసీ, పీజీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్ నివారణ చట్టాలు ,ర్యాగింగ్ నివారణపై కళాశాల యాజమాన్యం తీసుకోవాల్సిన చర్యలు ర్యాగింగ్ చేస్తే వాటిపై గల క్రిమినల్ చర్యలు శిక్షలు అంశాలపై ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ డి నాగేశ్వరరావు వివరించారు. ప్రతి కళాశాల యాజమాన్యం తప్పనిసరి కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రతి విద్యార్థి నుంచి ర్యాగింగ్‌లకు పాల్పడమని ఆఫిడవిట్ సమర్పించాలని తెలిపారు. చట్టాలు ఎన్ని రూపొందించిన వాటి అమలుకు అన్ని వ్యవస్థలు కృషిచేస్తున్నా అమలులో అందరూ రాజ్యాంగ బద్దులై తమ బాధ్యతలు నిర్వర్తించక పోవడమే కారణమన్నారు. భువనగిరి ఏసిపి రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై శ్రద్ధ వహించి చట్టాలపై అవగాహన కల్పించుకుని వారి భవిష్యత్తులో ఉత్తమ స్థానం పొందాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భువనగిరి న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు బి హరినాథ్ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక అనాగరికమైన చర్య అని అనవసరంగా చట్ట వ్యతిరేకమైన ర్యాగింగ్ చర్యలకు పాల్పడి దోషులుగా మారవద్దని తెలిపి ఏదేని న్యాయ సహాయం సలహా కావాల్సి వస్తే న్యాయ సేవ సంస్థలు ప్యానల్ లయర్స్ గా ఉన్న వారి నుండి సేవలు పొందవచ్చును అని తెలిపారు .కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్ జైపాల్, డిప్యూటీ లీగ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి శంకర్, లెక్చరర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు కిడ్నాప్!

**తండ్రి పక్కనుంచి ఎత్తుకెళ్లిన దుండగులు**
**మెట్‌పల్లిలో లభ్యమైనట్టు సమాచారం?**

**నిజామాబాద్ (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడి అపహరణ సంచలనం సృష్టించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో మూడేళ్ల బాలుడిని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాలుడిని ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నగర శివారులోని మాణిక్ బండార్‌కు చెందిన నాగుల సాయినాథ్, ఛాయా దంపతుల కుమారుడు అరుణ్ (3). ఛాయా ప్రసవం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. భార్య, కుమారుడితో కలిసి వచ్చిన సాయినాథ్ ఆసుపత్రి ఆవరణంలో నిద్రించాడు. రాత్రి మూడు గంటల నుంచి బాలుడు కనిపించకపోవడంతో సాయినాథ్ పోలీసులను ఆశ్రయించాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా విచారణ చేపట్టారు. నిందితుల కోసం



గాలింపు చర్యలు చేపట్టారు. తమ కుమారుణ్ణి అప్పగించాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. 'ఆసుపత్రి వరండాలో అందరం నిద్రిస్తున్నాం. ఆ సమయంలో ఇద్దరు యువకులు ఇక్కడికి వచ్చారు. కొంత సేపటివరకూ అక్కడే పడుకున్నట్లు నటించారు. ఆ తరువాత అదును చూసి నా వద్ద నిద్రిస్తున్న మా అబ్బాయిని అక్కడి నుంచి అపహరించి తీసుకెళ్లారు' అని బాలుడి తండ్రి సాయినాథ్ తెలిపాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెట్‌పల్లిలో వారిని గుర్తించినట్టు తెలిసింది. ఇతరులకు బాబును విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్టు సమాచారం. నిందితులిద్దరూ ఆర్మూర్‌కు చెందినట్టుగా తెలిసింది.

## జూకంటి జగన్నాథంకు శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ప్రతిఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక "శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు" 2024 సంవత్సరానికిగాను జూకంటి జగన్నాథంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవార్డుతో పాటు 1 లక్షా 1,116 రూపాయల నగదు, జ్ఞాపికను అవార్డు గ్రహీతకు అందజేస్తారు. ఈ సందర్భంగా జగన్నాథంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జూలై 2024

# రుచికరమైన ఆహారం ఆరోగ్యానికి హానికరం

*జంక్ ఫుడ్ బర్గర్స్ పిజ్జా ఫ్రైలు, మన నోళ్లకు రుచికరమైన వంటకాలు. కోకో కోలా, స్ప్రైట్, థమ్సప్, దాహం తీర్చే శీతల పానీయాలు. ఒక్కసారి తిన్న త్రాగిన, అవి తినకుండా త్రాగకుండా ఆగలేము. కానీ జాగ్రత్త అధికంగా తింటే అనారోగ్యం వస్తుంది. చివరికి ఆరోగ్యకరమైన ఆహారం కూడా తీసుకోలేని పరిస్థితికి చేరుకుంటాం. ఒక్క క్షణం ఆనందం కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సి వస్తుంది. ఈ రకమైన ఆహారాల వల్ల అధిక బరువు పెరగటం తో పాటు అనేక రకాలైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్ అప్పుడప్పుడు మాత్రమే రోజు తినకూడదు.*

జూలై 21న జాతీయ జంక్ ఫుడ్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజు మనం ఇష్టపడే రుచికరమైన, రుచికరమైన ఆహారాలను ఆనందించడానికి ఒక సందర్భం. కానీ జంక్ ఫుడ్ మన ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపుతుందో ఆలోచించడం కూడా ముఖ్యం.జంక్ ఫుడ్ అనేది సాధారణంగా ఎక్కువ కేలరీలు, కొవ్వు, చక్కెర మరియు సోడియం కలిగి ఉండే ప్రాసెస్ చేసిన ఆహారాలు. ఇందులో ఫాస్ట్ ఫుడ్, బర్గర్లు, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్, చాక్లెట్, క్యాండీ, సోడా మరియు ఇతర స్వీట్ డ్రింక్స్ వంటివి ఉంటాయి.

రుచికరమైనది మరియు సౌకర్యవంతమైనది జంక్ ఫుడ్ తరచుగా చాలా రుచికరంగా ఉంటుంది మరియు తయారు చేయడానికి లేదా కొనుగోలు చేయడానికి చాలా సులభం. ఇది బిజీ షెడ్యూళ్లను కలిగి ఉన్న వ్యక్తులకు ఒక ఆకర్షణీయమైన ఎంపికగా మారుతుంది.తక్కువ ఖర్చుతో కూడుకున్నది జంక్ ఫుడ్ తరచుగా తాజా ఆహారాల కంటే చౌకగా ఉంటుంది. అందుబాటులో ఉంది జంక్ ఫుడ్ చాలా రెస్టారెంట్లు, దుకాణాలు మరియు వెండింగ్ మెషీన్లలో విస్తృతంగా అందుబాటులో ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల గుండె జబ్బులు, స్థూలకాయం, మధుమేహం మరియు కొన్ని రకాల క్యాన్సర్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.పోషక విలువ తక్కువగా ఉంటుంది. జంక్ ఫుడ్ లో శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు మరియు ఖనిజాలు తక్కువగా ఉంటాయి.ఆకలిని పెంచుతుంది. జంక్ ఫుడ్ లో ఎక్కువగా ఉండే చక్కెర మరియు ప్రాసెస్ చేసిన పదార్థాలు ఆకలిని పెంచుతాయి, దీని వలన ఎక్కువ తినడానికి దారితీస్తుంది.జంక్ ఫుడ్ తినడం మంచిదా?జంక్ ఫుడ్ అప్పుడప్పుడు తినడం సరే, కానీ దానిని మీ ఆహారంలో క్రమం తప్పకుండా చేర్చకూడదు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడానికి, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు మరియు లీన్ ప్రోటీన్ వంటి పోషకమైన ఆహారాలను ఎక్కువగా తినడం చాలా ముఖ్యం. జంక్ ఫుడ్ పూర్తిగా చెడ్డ దానికి చెప్పలేము. కొన్నిసార్లు మితంగా తీసుకోవడం వల్ల వద్దులేని తగ్గించడానికి మరియు మన మానసిక స్థితిని మెరుగుపరచడానికి ఒక మార్గంగా ఉంటుంది. ఒకేసారి ఎక్కువ



జనంసాక్షి

మొత్తంలో జంక్ ఫుడ్ తీసుకోకుండా మితంగా తినవచ్చు. ఫైబర్ మరియు ప్రోటీన్స్ పుష్కలంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల ఎక్కువ సేపు ఆకలి నుంచి దూరంగా ఉంచుతుంది, ఆరోగ్యా న్ని కాపాడుతుంది. కూల్ డ్రింక్ సోడాలు ప్లేస్ లో చక్కెర పానీయాలకు బదులుగా, నీరు తాగటం కొబ్బరి నీరు తాగడం వల్ల ఎక్కువ ఆరోగ్యంగా ఉండవచ్చు. తీసుకొనే ఆహారానికి తగిన విధంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు వారి అధ్యయనంలో తెలియజేశారు. జులై 21 జాతీయ జంక్ ఫుడ్ దినోత్సవాన్ని ఆనందించండి కానీ మీ ఆరోగ్యాన్ని గుర్తుంచుకోండి."ఆరోగ్యంగా ఉండాలి, దీర్ఘకాలం జీవించాలి.

**(జులై 21న జాతీయ జంక్ ఫుడ్ దినోత్సవం సందర్భంగా)**



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# 100డేస్ యాక్షన్ ప్లాన్ ఎక్కడ? మోదీజీ!

*పార్లమెంట్ ఎన్నికలకు ముందు నుంచే పీఎం నరేంద్ర మోడీ తన మూడో టర్మ్ లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ గురించి చెబుతున్నారు. తన పది ఏండ్ల పాలన ట్రైలర్ మాత్రమే నని మూడో సారి అసలు పిక్చర్ ఉంటుందని, ఓటర్లు మనస్సులో నిర్ణయం తీసుకున్నారని, ఈ సారి 400 సీట్లు ఖాయమని చెప్పుకొచ్చారు. 400 సీట్లు రాలేదు, బీజేపీ కి 240 దాటలేదు. ఎన్డీఏ కూటమి మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఊహించని విధంగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమికి 230 సీట్లు, కాంగ్రెస్ కు 99 రావడం, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ లో ప్రతిపక్ష నేతగా రావడం జరిగింది. ఇక అసలు విషయానికి వస్తే పీఎం మోడీ మూడోసారి పీఎం అయి 45 రోజులు దాటాయి. ఇంకా వంద రోజుల ప్లాన్ రెడీ అయ్యిందా? కాలేదా?అందులో ఉన్న అసలు పథకాలు ఏంటి? అన్నీ కొత్తవే నా? లేక పాతవే రిపీట్ చేస్తున్నారా? ఇంకా తెలియదు, ఏ, బి, సి క్యాగిరి లు గా ఈ వందరోజుల ప్లాన్ అమలు, రానున్న అయిదేండ్లు ఉంటుంది. అలాగే విక్సిత్ భారత్ పేరిట ఇది 2047 దాకా విస్తరణ అన్నారు. మరో వైపు ఇటీవలనే అన్నీ కేంద్ర మంత్రిత్వ శాఖలకు వంద రోజుల ప్లాన్ కు సంబంధించి రిపోర్ట్, సూచనలు, సలహాలు అడిగారట! ఒకవైపు ఆరు నెలలుగా మొదటి వందరోజుల ప్లాన్ రెడీ అని పీఎం మోడీ అంటారు.*





**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

జనంసాక్షి

మే 10 నాడు, కాస్త అటు, ఇటుగా పత్రికల్లో ఈ వంద రోజుల ప్లాన్ రెడీ ముచ్చట హెడ్ లైన్ లలో కనిపించింది. ఈ వంద రోజుల ప్లాన్ కోసం 20 లక్షల మంది యువత అభిప్రాయం, వారి నుంచి ఇన్పుట్స్ తీసుకున్నారట,మొత్తం 2700 సిట్టింగ్స్ దీని కోసం జరిపారని, అంటున్నారు. ఆ సమావేశాలు ఎక్కడ? ఎప్పుడో తెలియదు!వర్షం లా కలలు కనే పరిస్థితి మాత్రమే నా? నిజంగా యాక్షన్ ప్లాన్ ఏదైనా, ఉన్నదా! లేదా? పార్లమెంట్ బడ్జెట్ కు ముందు ప్రకటిస్తారా? లేక ముందే ప్రకటిస్తారా? రెండు ఏండ్ల నుంచి యాక్షన్ ప్లాన్ మీద కసరత్తు చేస్తున్నాము, అంటారు. రోడ్ మ్యాప్ ఏది? నిరుద్యోగం, అధిక ధరలు, అసమానతల తో, పేపర్ లీక్ లతో, దేశం ఆగం అవుతున్నది.

### ఆదాయం అంతా వారికే!

ఆదాయం లేక, ఆదాయం అంతా ఒక్క పర్సెంట్ కూడ లేని అంబానీ, అదాని లాంటి వద్దకు పోతున్నది. వారికే టాక్స్ లలో వెసలు బాటు ఇస్తున్నారు. కనీసం చెమట ఓడ్చి పని చేస్తున్న బొగ్గు గని కార్మికులకు టాక్స్ లో వెసలు బాటు లేదు.పిఎస్యు ల అమ్మకం వల్ల మూడు లక్షల మంది పర్మనెంట్ ఉద్యోగాలు కోల్పోయారు.నాలుగు జూన్ కు పీఎం మోడీ మూడోసారి పీఎం గా ప్రమాణం చేసారు. సెప్టెంబర్ 16 కు ప్రభుత్వం కు వంద రోజులు అవుతుంది. మోడీ కూడ అదే రోజు 74 వ జన్మదినం వస్తుంది. మరి ఈ వంద రోజుల అసలు సినిమా, మన జాతీయ మీడియా అంతా, బిజినెస్ స్టాండెడ్,ఎకనామిక్ టైమ్స్, నవభారత్ టైమ్స్ లాంటి పత్రికల్లో హెడ్ లైన్ లుగా ప్రచారం చేసిన వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలు మొదలు అవుతుందా? వేచి చూడాలి.

### జీఎస్టీ లో 64 శాతం సామాన్యులదే!

ముఖ్యంగా ఈ దేశం పిడిత, తాడిత, ప్రజలు, సామాన్యులు జిఎస్టీ లాంటి టాక్స్ లు ప్రభుత్వం కు చేరే వందలో 64 శాతం కడుతున్నారు. ఇది వాస్తవం!కాని అందులో వారికి అభివృద్ధి, సంక్షేమం పేరిట చేరేది ఎంత? ఈ మూడో టర్మ్ లోని బడ్జెట్ లో వీరికి అందేది ఎంత,కార్పొరేట్ ల కు ఇచ్చే వెసలు బాట్లు ఎంత? వేచి చూడాల్సిందే!నెలకు కనీసం ఆరు వేల రూపాయల ఆదాయం లేని 50 శాతం మంది కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ లో ఏముంది? చూడాలి! ముందు చాలా కాలంగా గొప్పలు చెప్పుకుంటున్న పీఎం మోడీ నోట పలికిన ఆ వందరోజుల యాక్షన్ ప్లాన్ ఏమిటో జరా ఓపెన్ చేస్తే మంచిది!

# విశ్వ క్రీడల్లో మన త్రివర్ణ పతాకపు 'స్ఫూర్తి' సగర్వంగా నింగి అంచును తాకాలి!

జనంసాక్షి

75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో అణు పరీక్షలు, చంద్రయాన్,మంగళయాన్ వంటి ప్రయోగాల ఫలితాలతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు దీటుగా మనమంతా ఎదిగాం.త్వరలోనే గగనయాన్ ప్రయోగంతో నూతన చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నాం.క్రికెట్ ఆటతో, విన్నూతనమైన సినిమాలతో విశ్వ వేదికలపై మన సత్తాను చాటాం.కానీ మనమంతా ఆందోళన చెందుతూ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే 145 కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో మనం సాధించిన నోబెల్ బహుమతులు, ఒలింపిక్ పతకాల సంఖ్య గురించి.దీనికై విద్యావేత్తలు, మేధావులు, ప్రభుత్వాలు, నేటి యువతరం, తదితరులు లోతుగా అధ్యయనం చేస్తూ సమగ్రమైన చర్చలతో మన సమస్యలకు పరిష్కారం వెతకాల్సిందే.ఆచరణకై అడుగులు వేయాల్సిందే.

జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు త్వరలో పారిస్ లో జరగనున్న విశ్వ క్రీడా సంగ్రామం ఒలింపిక్స్ పోటీలకు ఈ సారి మన దేశం నుంచి 117 మంది అథ్లెట్లు మనదేశ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించడానికి మనందరి ఆశలు, బాధ్యతను మోస్తున్నారు.టోక్యో ఒలింపిక్స్ లో ఏడు పతకాలు సాధించిన మనం ఈసారి డబుల్ డిజిట్ పతకాలపైనే ఆశలు పెట్టుకున్నాం.ఈ ఒలింపిక్స్ పతాక దారులుగా పి.వి సింధు మరియు శరత్ కమల్,చెఫ్ ది మిషన్ గా గగన్ నారంగ్ ముందు నడవనున్నారు.మన దేశ ప్రభుత్వం కూడా ఈ సారి ఈ ఒలింపిక్స్ కోసం "టార్గెట్ ఒలింపిక్ పోడియం" పేరుతో ప్రత్యేక పథకం ప్రారంభించి నైపుణ్యం ,ప్రతిభ గల యువక్రీడాకారులను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మన ఆటగాళ్ళకు శిక్షణ ఇప్పించారు.విశ్వసమరానికి సిద్ధం చేశారు.

ఒకసారి మన ఒలింపిక్స్ పోటీలకు సంబంధించిన చరిత్రను గమనిస్తే అరకొర వసతులతో,ఆకలి బాధలతో వున్న బ్రిటిష్ వారి పరిపాలన కాలంలోనే మన జాతీయ క్రీడ హాకీ లో స్వర్ణయుగం చూశాం.ప్రముఖ దిగ్గజ ఆటగాడు ధ్యాన్ చంద్ హయాంలో వరుసగా 1928,1932,1936 ఒలింపిక్స్ లో మన హాకీ టీం మూడు స్వర్ణాలు గెలిచింది.తర్వాత రాను రాను హాకీ లో మనస్థాయి తగ్గింది. చివరి సారి మళ్ళీ టోక్యో ఒలింపిక్స్ లో హాకీలో కాంస్య పతకం సాధించాం.2008 బీజింగ్ ఒలింపిక్స్ లో షూటింగ్ విభాగంలో అభినవ్ బింద్రా స్వర్ణ పతకపు మెరుపులతో స్ఫూర్తిగా నిలిచాడు.టోక్యో ఒలింపిక్స్ లో జావెలిన్ త్రో విభాగంలో నీరజ్ చోప్రా అథ్లెటిక్స్ చరిత్రలో తొలి పసిడి పతకాన్ని సాధించి నేటి ఆధునిక భారతయువతరానికి ఆదర్శమయ్యాడు.మన తెలుగు అమ్మాయి పి.వి.సింధు బ్యాడ్మింటన్ లో రెండు పతకాలు గెలిచి నేడు స్వర్ణ పతకమే లక్ష్యంగా పారిస్ లో అడుగుపెట్టనుంది.

కేవలం లక్షల సంఖ్యలో జనాభా కలిగి,సరైన వసతులు లేకున్నా,ఆకలి,నిరుద్యోగం, నిరక్షరాస్యత వంటి మహామ్మారులతో పోరాడుతున్న ప్రపంచ పటంలో చిన్న చిన్న దేశాల ఆటగాళ్ళు స్వర్ణాలు గెలుస్తున్నారు.జమైకా దేశం తరపున ఉస్సేన్ బోల్ట్ పరుగుపందెంలో పసిడి కాంతులతో చూపిన ప్రతిభ యావత్ ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది.మన విద్యా వ్యవస్థలో ఆటలు అంతర్భాగం అయినప్పటికీ సరైన మైదానాలు,వసతులు లేక ,సరైన ప్రోత్సాహం అందక కాగితాలకే పరిమితం అయ్యాయి.యువతరం కూడా "ఆటలు మనకు అన్నం పెట్టవు కదా..!"అనే ధోరణిలో బ్రతుకాటలో ఉద్యోగవేటలో జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఇక ప్రతిభ, నైపుణ్యాలను కలిగి వున్న యువతను ప్రోత్సాహించాల్సిన ప్రభుత్వాలు రాజకీయంతో ఆటలు ఆడిస్తున్నారు.రెజ్లింగ్ సంఘంలో తలెత్తిన వివాదాలు మనం చూశాం.ఏదేమైనా ఆటల్లో మనదేశం రాణించాలంటే మన ఆలోచనలు,విద్యా సంస్థల దృక్పథాలు,ప్రభుత్వాల విధానాలు ఇలాంటివి చాలా మారాల్సిందే.మనమంతా మార్చుకోవాల్సిందే.ప్రతిభానైపుణ్యాలు కలిగిన ఆటగాళ్ళకు అవార్డులతో పాటు, ఆర్థికసాయం అందించి జీవన భరోసా కలుగజేస్తే అప్పుడే మళ్ళీ మనం ఒలింపిక్స్ లాంటి పోటీల్లో అగ్రదేశాలకు దీటుగా ఎదగగలం.

ఎన్ని సమస్యలు, సవాళ్లు మన ముందు వున్న ఇప్పుడు మన దేశం నుంచి పారిస్ కు వెళ్తున్న క్రీడాకారులకు మనమంతా నైతిక మద్దతు, ప్రోత్సాహం అందిద్దాం.రెజ్లింగ్,హాకీ, షూటింగ్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, గుర్రపుస్వారీ,గోల్ఫ్ విభాగాల్లో ఈసారి మనం పతకాల రేసులో వున్నాం.పి.వి.సింధు, మీరాబాయి చాను,నీరజ్ చోప్రా తదితరులు మళ్ళీ మన ఆశలకు సజీవ ప్రాణం పోస్తారు.ఈ ఒలింపిక్స్ లో మన తెలుగు రాష్ట్రాల నుంచి 8 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.నిఖిత్ జరీన్,ఆకుల శ్రీజ,ఇషా సింగ్ , పి.వి సింధు,సాత్విక్,జ్యోతియర్రాజు,దండిజ్యోతికశ్రీ, బొమ్మ దేవర ధీరజ్ లు ఒత్తిడి అధిగమిస్తూ చివరివరకు పోరాడి తమ పతకాల వెలుగుతో మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాలని మనమంతా ఆశిద్దాం.విఖ్యాత భారతీయ తత్వవేత్త స్వామి వివేకానంద అన్నట్లు ,"శారీరక మానసిక ధృడత్వం గల భారతాన్ని విద్యాలయాల్లో,మైదానాల్లో నిర్మించగలం"పుట్ బాల్ వంటి ఆటల్లో త్వరలోనే మనం పురోగతి సాదిద్దాం.రంగం ఏదైనా ఈ ప్రపంచానికి భారతదేశం దిక్సూచి కావాలి. ఆల్ ది బెస్ట్ ఇండియా.



**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
నాగర్ కర్నూల్, 9394749536

# ఫిరాయింపులు.. తెలంగాణ రాజకీయం!

*సూర్యుడి చుట్టూ భూమి భ్రమణం చేస్తుందని చెప్పడం ఎంత నిజమో... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఫిరాయింపుల చుట్టూ భ్రమణం... ప్రరిభ్రమణం చేస్తున్నాయి అంటే కూడా అంతే నిజం. ఎందుకంటే, ప్రతి రోజూ అన్ని వార్తాపత్రికలు ఈ అంశం లేకుండా ప్రచురితం కావడం లేదు. ఇక తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఒక తెలుగు టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "తాను వ్యక్తిగతంగా ఫిరాయింపులకు వ్యతిరేకం" అని వ్యాఖ్యానించిన అంశం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశం అవుతుంది. వాస్తవానికి సభాపతి ప్రసాద్ కుమార్ మృధుస్వభావిగా అగుపిస్తారు. ఆయన హార్యం, ఆహార్యంలో గంభీరత్వం ఉన్నా.. నిర్ణయాల్లో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తారన్న పేరు ఉన్నది. ఎందుకంటే, ఆయన వికారాబాద్ ప్రాంతానికి చెందిన కొంశెట్‌పల్లి అనే మారుమూల గ్రామం నుంచి ఎంపీటీసీగా విజయం సాధించి... ఎంపీపీగా.. ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఎన్నికై అంచలంచలుగా ఎదిగి ఈరోజు స్పీకర్ అనే రాజ్యాంగ పదవి స్థాయికి దాకా వచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన దళిత నేతగా స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు పేరు ఉన్నది. ఇదే ప్రసాద్ కుమార్‌ను పట్టుకొని వికారాబాద్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కేటీఆర్ ఒకసారి మాట్లాడుతూ.. "ఆ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ గెలిస్తే బీఆర్ఎస్‌లోకి వస్తా అని అంటుండట. వాడు వచ్చుడు వద్దు మాకు. ఏమి వద్దు." అంటూ జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రసాద్ ఏనాడూ బహిరంగంగా తాను బీఆర్ఎస్ లోకి వెళతానని అని చెప్పలేదు. అలా ఆయన అనని.. మాటలను ఉటంకించుకుని కేటీఆర్ ఆనాడు మాట్లాడి.. ఈ రోజు అదే వ్యక్తి స్పీకర్ అవడం.. ఆయన ముందుకి కేటీఆర్ రిక్వెస్టులు పట్టుకపోవడం చూస్తుంటే విధి ఎంత విచిత్రమైనది అని అనిపిస్తుంది. అందుకే అంటాం. కాలం ఎవ్వరినీ వదిలిపెట్టదు. అందరి సంగతి తెలుతుస్తుంది అని.*

కాగా, ప్రస్తుతం మాత్రం స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను ఆసరా చేసుకొన్న బీఆర్ఎస్ పార్టీ పెద్దలు, ఫిరాయింపులపై పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఇప్పటికే పది మంది వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. అయితే, వారు ఎందుకు కప్పుకుంటున్నారన్న అంశంపై ఆ పార్టీ దృష్టి సారించకపోవడం శోచనీయం. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒక సభలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానని స్వయంగా కేటీఆరే అందరికి చెబుతూ దుష్ప్రచారం చేస్తున్నారని వేదిక మీదనే ఆవేదనకి గురయ్యారు. ఒక దళిత ఎమ్మెల్యేను పట్టుకొని.. పార్టీ మారుతున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటే అంటే ఆయనకు ఆ పార్టీలో గానీ... నియోజకవర్గంలోని గానీ విలువ ఏం ఉంటుంది? బహుశా, దానికి మనస్థాపానికి గురయ్యే కాలే యాదయ్య సడెన్‌గా పార్టీ మారినట్టు ఉన్నారని స్థానికంగా వస్తున్న వ్యాఖ్యానాలు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న ఫిరాయింపులపై బీఆర్ఎస్ విమర్శలు చూస్తుంటే.. ఇదెప్పుడూ జరగని విషయంగా... అసలు ఎవరికి తెలియని



జనంసాక్షి

సబ్జెక్టుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. కానీ, గత పది సంవత్సరాల కాలంలో వారి హయాంలో జరిగిన ఫిరాయింపుల అంశం చెప్పమంటే.. నీళ్ళు నములుతున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అప్పుడు ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం 15 మంది సభ్యులున్న టీడీపీ శాసనసభా పక్షం మొత్తాన్ని విలీనం చేసుకుంది. మొదట ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ వైపు వెళ్లగా, ఆ తర్వాత 10 మంది ఎమ్మెల్యేలు టీడీపీ శాసన సభా పక్షాన్ని టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయాల్సిందిగా అప్పటి స్పీకర్ మధుసూదనా చారిని కోరడం, ఆయన దాన్ని ఆమోదించడం చకచకా జరిపోయాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ నుంచి చివరకు రేవంత్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్య మాత్రమే టీడీపీ ఎమ్మెల్యేలుగా మిగిలారు. ఇక తెలంగాణలో 2018 ఎన్నికల తర్వాత ఎన్నికైన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు (సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు) కూడా తమను పార్టీలో విలీనం చేసుకోవాల్సిందిగా టీఆర్ఎస్‌ను కోరగా ఆ విలీనం కూడా జరిగిపోయింది. అదే విధంగా కాంగ్రెస్ పక్షం నుంచి 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరిపోయారు. 2018 ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది ఎమ్మెల్యేలు ఎన్నిక కాగా, ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య కేవలం ముగ్గురే (శ్రీధర్ బాబు, పోడెం వీరయ్య, మల్లు భట్టి విక్రమార్క) మిగిలిన సంగతి తెలిసిందే. మరి ఆనాడు ఫిరాయింపులను ఇష్టారీతిన ప్రోత్సహించిన టీఆర్ఎస్ పార్టీ.. ఈ రోజు అదే ఫిరాయింపులు జరుగుతుంటే.. గగ్గోలు పెట్టడంలో బీఆర్ఎస్‌కు ఏమైనా నైతికత ఉందా? అని ప్రశ్నించుకోక తప్పదు. ప్రెస్‌మీట్‌లో విలేకర్లు ప్రశ్నలు అడుగుతుంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇస్తున్న సమాధానం నిజంగా హాస్యాస్పదంగా ఉంటుంది. తాము శాసనసభ పక్షాన్ని విలీనం చేసుకున్నామని, అది రాజ్యాంగబద్ధమని చెబుతున్నారు. మరి విలీనం చేసుకోవడానికి ఎమ్మెల్యేలు ఒకటేసారి వచ్చారా? పలుదఫాలుగా వచ్చినవారా? అన్న విషయం కేటీఆర్‌కి తెల్వదా? దానిపై ఎందుకు మాట్లాడటం లేదు? ఒకరిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరతామని చెప్పి, మరికొందరు కూడా వస్తారని బహిరంగంగా చెప్పినప్పుడే వారు ఫిరాయించినట్టు కాదా? అది చీలిక కాదు, విలీనమూ కాదు. విడివిడిగా వచ్చిన ఆ ఎమ్మెల్యేల సంఖ్య 12 అయ్యే దాకా ఆగి, తరువాత తీరిగ్గా టీఆర్ఎస్‌లో చేర్చుకోవడం అంటాం. విలీనం చాటున ఇవి 12 ఫిరాయింపులు అనక తప్పదు. విలీనానికి కావలసిన సంఖ్య కన్నా తక్కువ మంది ఫిరాయించినట్టు ప్రకటించి అనర్హులుగా గుర్తించాలని అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తే చేశారు సభాపతిని అడ్డం పెట్టుకొని నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అటువంటి ప్రభుత్వం నడిపిన కేటీఆర్, ఈ రోజు ప్రస్తుతం స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు తన బాధ్యతలు గుర్తు చేయడం సహేతుకం అంటారా? వారే ఆత్మసమీక్ష చేసుకోవాలి. ఆనాడు తమ ప్రభుత్వ హయాంలో స్పీకర్ సాయంతో ఫిరాయింపులను విలీనంలాగా ఆమోదించడం అంటే 10 షెడ్యూలును పరిహసించడం కాదా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. అందుకే, తెలంగాణ ప్రజలు ఈ ప్రక్రియను నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి అంటున్నారు. ఈ మాటలను కేటీఆర్, కేసీఆర్‌లకు ప్రెస్‌మీట్‌లో పలువురు విలేకర్లు గుర్తు చేస్తే.. అసలు ఫిరాయింపులను ప్రోత్సహించిందే కాంగ్రెస్ అంటూ బుకాయిస్తున్నారు. 2004, 2009 నుంచి కూడా రాష్ట్రంలో అసమ్మతి ఎమ్మెల్యేలను చూశాం కానీ.. నేరుగా ఫిరాయింపుల ప్రక్రియ చూడలేదు. ఒక ఫిరాయింపు ఎమ్మెల్యేకు నేరుగా మంత్రి పదవి ఇచ్చిన సంస్కృతికి టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే తెరదించిందన్న విషయాన్ని ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.

జనంసాక్షి

### ఈ దుర్నీతిని అన్ని పార్టీలు నిలువరించాలి

అయితే, ఫిరాయింపు అనేదే ఒక దుర్మార్గపు ప్రక్రియ. దీని నుండి రాజకీయ పార్టీలు బయటకు రాలేకపోతున్నాయి. దేశంలోని ప్రతి రాజకీయ పార్టీ ఫిరాయింపు అనే బురదలోనే కొట్టుకుపోతున్నది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్ష గొంతు లేకుండా చేయాలంటూ వీటికి ఒడిగడుతున్నాయి. చరిత్రలో పార్టీ ఫిరాయించడమంటే ఒకరిద్దరు ఎమ్మెల్యేలో, ఎంపీలో వేరే పార్టీలోకి మారిపోవడం లేదంటే, మద్ధతుపలకడం ఉండేది. పార్టీ ఫిరాయింపుల చట్టం వచ్చే వరకు అలాంటి వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది కాదు. 1960ల నాటికి ఈ ధోరణి బాగా పెరిగిపోయి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల అస్థిరత అనే సమస్య తీవ్రమైంది. 1969 నాటి వైబీ చవాన్ నేతృత్వంలోని కమిటీ నివేదిక, నాలుగో సార్వత్రిక ఎన్నికల తరువాత, మార్చి 1967, ఫిబ్రవరి 1968 మధ్య ఉన్న ఏడాదిలోపు కాలంలో అనేక రాష్ట్రాలలో శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో పార్టీని ధిక్కరించినట్లు పేర్కొంది. మొదటి సార్వత్రిక ఎన్నిల నాటి నుంచి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటికి సుమారు రెండు దశాబ్దాల కాలంలో 542 ఫిరాయింపు సంఘటనలు జరిగితే, కేవలం 1967-68 మధ్య కాలంలోనే కనీసం 438 ఫిరాయింపులు జరిగినట్లు చవాన్ కమిటీ గుర్తించింది. ఈ రెండు దశాబ్దాలలో 376 మంది ఇండిపెండెంట్ సభ్యుల్లో 157 మంది వేరే పార్టీలకు మారారు. పదవులను ఆశించి ఎక్కువమంది ఫిరాయింపులకు పాల్పడ్డారని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఈ కాలంలో వివిధ రాష్ట్రాలలో ఫిరాయించిన 210 మంది శాసనసభ్యులలో 116 మందికి మంత్రి పదవులు దక్కాయి. అప్పటి నుంచే 'ఆయా రామ్, గయా రామ్' అనే నానుడి దేశ రాజకీయాల్లో బాగా ప్రసిద్ధి పొందింది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కేంద్రం ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకువచ్చింది. కానీ, విలీనం విషయంలో ఆయా పార్టీ నిర్ణయాత్మక కమిటీలో చీలిక వచ్చినప్పుడు విలీనం చేసుకోవాలా? లేక శాసనసభాపక్షంలో చీలిక వచ్చినప్పుడు విలీనం చేసుకోవాలా అన్న అంశంలో అప్పటి శాసనకర్తలు స్పష్టతనివ్వడం లేదు. దీనిపై సుప్రీంకోర్టు కూడా ఒక మౌలిక ఆదేశాన్ని కేంద్రానికి ఇవ్వడం లేదు. అందుచేత, ఈ విషయం ఇటు దేశ రాజకీయ వ్యవస్థను, అటు ప్రజాస్వామికంగా ఎన్నికవుతున్న శాసనవ్యవస్థను పట్టిపీడిస్తున్నది. ఇప్పటికైనా, ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకేదాటికి పోరాడితేనే ప్రస్తుత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయలేమన్న విషయాన్ని గుర్తరెగాలి. లేదంటే, ఆయారాం గయారాంలతో అడుగులు వేస్తూ.. నడవాల్సిందేనన్న చేదు నిజాన్ని ఒప్పుకోక తప్పదు.



**సాగర్ వనపర్తి**
సీనియర్ జర్నలిస్టు
9494041258

## మూలం

సృష్టిలో పంచభూతాలు
నాలుగు వేదాలు
అష్ట దిక్కులు
అన్నిటిని నడిపేది గురువు
సృష్టి కారుడు బ్రహ్మ
లయకారుడు శివుడు
స్థితికారుడు కృష్ణుడు
ఈ మూడింటి కలబోతగురువు
ఒక డాక్టర్ ఒక యాక్టర్
దేవుణ్ణి గురించి బోధ
చేసిన గురువు నిజమైన దేవుడు
అందర్నీ సృష్టించే విధాత
ప్రదాతజి
చర చర సృష్టి నిర్మాత
అజ్ఞానపు చీకట్లను చీల్చి
వెలుతురును ప్రసరించే
ఉషస్సు గురువు
వందనం ,పధాభివందనం



**ఉమాశేషారావు వైద్య**
లింగాపూర్, కామారెడ్డి

## అభి హమ్ జిందా హై!

ఎస్ అభి హమ్ జిందా హై!కబ్ తక్ జీవోగే తుం.. కబ్ తక్ జియేంగే హమ్!కభీ తో బాత్ కియాకరో! కభీతో దిల్సే ఫోన్ మిలాయాకరో! ఫుర్సత్ మిలితో ఆకే గలే మిలాయాకరో!దిల్ కో మన్ కో సుకూన్ మిల్తా హై! తుమ్హే మిల్నేసే!తుమ్సే బాత్ కర్నెసే!తుంహే దేఖ్నేసే!కుచ్ యాదే తాజా హెూజాతిహై! మేరీ ఔర్ తేరి సాన్స్ కే పల్ మే కుచ్ ఇజాఫా హెూజాత!అభి తో హమ్ ఔర్ తుం జిందాహై!కల్ తుం, యా హమ్ కిస్కా పెహ్లే నంబర్ లగ్ జాత! పతా నహీ!గిలే శిక్వే చోడో!జబ్ దిల్ చాహే ఎక్బార్ కంసేకం బాత్ కర్లో! అభితో హమ్ జిందాహై తో ఏక్ బార్ బాత్ కర్లో జాని!దోస్తీ కా నామ్ హి హై జిందగీ!జిందాహెూతో జిందగీ కా ఫర్జ్ నిభాతే ఛలో!వక్త్ నహీ హై! వక్త్ కో పెహ్ చానో! ఏ షోహరత్! ఏ పైసా! ఔర్ కిత్నే దిన్? కభీ సోచా హై! కభీ సమ్జా హై! ఔర్ భి కుచ్ హై! జమానే మే, పైసెకే సివా!చల్ ఓ కుచ్ తుంహే బులా రహాహై! యాద్ కర్ రహ హై!( అయిసి కుచ్ దోస్తో కే లియే)

-ఎండి. మునీర్, 9951865223

# సంక్షేమానికై కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఐటీ శాఖ భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి



**మహేశ్వరం జులై 20 (జనం సాక్షి)**

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నామని ఐటీ శాఖ భారీ పరిశ్రమల శాఖ మంత్రి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం నాడు బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 38 కోట్ల రూపాయలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలుకు ఐటి శాఖ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ దుద్దిల్ల శ్రీధర్ బాబు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చివరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ ముందుగా బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలుకు శంకుస్థాపనకు విచ్చేస్తున్న ఐటి శాఖ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ దుద్దిల్ల శ్రీధర్ బాబుకి స్వాగతం పలికారు, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం 500 కి గ్యాస్ సిలిండర్ ఆరోగ్యశ్రీ ఉచిత 200 యూనిట్లు కరెంటు రైతుల రుణమాఫీ అమ్మలోకి తీసుకొచ్చాము, ఏదైతే రుణమాఫీ చేస్తాము అన్నము అది నిలబెట్టుకున్నాం తొలి విడతలను లక్ష వరకు ఉన్న రుణమాఫీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లోని రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం రైతుల అకౌంట్లో లక్ష రుణమాఫీ రాజకీయ చరిత్రలోనే గొప్ప విషయమని అన్నారు. 11 లక్షల రైతుల అకౌంట్లో 6098 కోట్లు రుణమాఫీ నిధులను విడుదల చేశారు. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీతో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థను కల్పించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి ఇక్కడికి విచ్చేసిన, ఐటి శాఖ భారీ పరిశ్రమల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ దుద్దిల్ల శ్రీధర్ బాబుకి రైతుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వృత్తిలో రాణించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలి

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆర్సీ జూలై 20(జనంసాక్షి):**

నాగర్ కర్నూల్‌లో ఫోటో, వీడియోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు వస్తున్న మార్పులను అధిగమించేందుకు తెలంగాణ ఫోటో మరియు వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫోటో చిత్రీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని వాటిని అధ్యయనం చేసేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

## కలెక్టరేట్‌లో ప్రజా పాలన కేంద్రం ఏర్పాటు

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 20 (జనం సాక్షి):**

కలెక్టరేట్ లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే మున్సిపల్ పట్టణాలతో పాటు, అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీఓ కార్యాలయాలలో ప్రజా పాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం ఐ.డీ.ఓ.సీ (కలెక్టరేట్)కు వచ్చే వారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు, ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని సూచించారు. కలెక్టరేట్లోని సేవా కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్లో అందుబాటులోకి తెచ్చిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డేటా సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడి, మొబైల్ నెంబర్ తీసుకురావాలని కోరారు

# కలెక్టర్ ఆదేశాలు బే ఖాతర్

- మున్సిపల్ కార్మికుల పని భారాన్ని తగ్గించని కమిషనర్
- శృతి మించిన హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ వేధింపులు
- కలెక్టర్‌కు కార్మికులు ఫిర్యాదు చేయడంతో వేధింపు తీవ్రతరం
- ధర్నాకు దిగిన మున్సిపల్ కార్మికులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 20 (జనం సాక్షి):**

వికారాబాద్ మున్సిపల్ హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ మున్సిపల్ కార్మికులను వేధించడం. వారితో ఇంట్లో పెట్టి చాకిరీ చేయించుకోవడం. జీతంలో కోత విధించడం. రెండు పూటలు కార్మికులచే పని చేయించడం వంటి ఫిర్యాదు పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించిన కలెక్టర్ ఉత్తర్వులను కమిషనర్ బెకాతర్ చేశారు. కార్మికులకు రెండు పూటల పని కాకుండా ఒక పూట పని మాత్రమే పని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ మున్సిపల్ కమిషనర్ ఇప్పటివరకు కార్మికుల పని భారం విషయమై చర్యలు తీసుకోలేదు దీంతో కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించారు. అలాగే మున్సిపల్ హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ కార్మికులపై మరింత వేధింపులకు గురి చేస్తున్నాడు. హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ వేధింపులపై మున్సిపల్ కార్మికులు జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణ ఆదేశించారు. దీంతో హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాస్ మున్సిపల్ కార్మికులకు పై మరింత వేధింపులకు పాల్పడుతున్నాడు. దిక్కున చోట చెప్పుకోండి.. నా మాటే శాసనమంటూ మహిళ కార్మికులని చూడకుండా బూతులు తిడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. హెల్త్ ఇన్స్పెక్టర్ ఇంట్లో మున్సిపల్ కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని పని చేస్తూ ప్రమాదవశాత్తు ఒక కార్మికురాలు ప్రమాదానికి గురి అయ్యాడని వారు ఆరోపించారు మున్సిపల్ కార్మికులకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్ మైపాల్ డిమాండ్ చేశారు అంతేకాకుండా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ కార్మికులను వేధింపులకు పాల్పడిన హెల్త్ ఇన్స్పెక్టర్ ఏసుదాసు వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు

## చినుకు పడితే చిత్తడే

- మా గ్రామానికి బిటి రోడ్డు నిర్మించండి
- మట్టి రోడ్డుతో వర్షాకాలంలో నరకయాతన
- గ్రామ ప్రజలు రోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి విన్నపం



**తలకొండపల్లి జూలై 20 (జనంసాక్షి):**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గడ్డమీద తండా గ్రామపంచాయతీకి రోడ్డు సౌకర్యం సరిగ్గాలేని మూలంగా బడి పిల్లలు ప్రయాణించేటువంటి ఆమనగల్ బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ బస్సు రోడ్డుపై ఉన్న గుంతలలో కూరుకుపోయింది. ఇకనైనా ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మా గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు. వర్షాకాలంలో అనేకమార్లు గ్రామ ప్రజలు ప్రయాణిస్తూ ఈ రోడ్డుపై యాక్సిడెంట్లు,జారిపడడం మూలాన అనేకమందికి కాళ్లు చేతులు హాస్పిటల్ పాలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ హెడ్ క్వార్టర్‌గా ఏర్పడి 6 సంవత్సరాలు కావస్తున్న నేటికీ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యము లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంకట్రావుపేట్ నుండి గడ్డమీద తండా గ్రామపంచాయతీకి బిటి రోడ్డుకు సహకరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కృష్ణ నాయక్, బలరాజ్, విజేందర్ పవార్, రమేష్, కిషోర్, రాంసింగ్, అమర్ సింగ్, భాస్కర్, నరేష్, మోత్య, దేవ్ల, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతికి అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తించేలా చర్యలు

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**కొడంగల్ జూలై 20 (జనం సాక్షి):**

గృహజ్యోతి ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కొడంగల్ మున్సిపాలిటీలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయ సమీపంలోని వడ్డెరగల్లిలోని ఒక కుటుంబానికి సంబంధించిన వ్యక్తులను గృహ జ్యోతిలో భాగంగా విద్యుత్తు జీరో బిల్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై అడిగి తెలుసుకున్నారు. దీనికి లబ్ధిదారులు విద్యుత్తు జీరో బిల్లు వస్తుందని తెలిపారు. గ్యాస్ సబ్సిడీకి సంబంధించి బ్యాంక్ ఖాతాల్లో చూసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో నిర్మించిన రోడ్లు,మురుగు కాలువలను పరిశీలించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న మున్సిపాలిటీ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేసి వాడుకలోకి వచ్చే విధంగా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల వివరాలను సంబంధిత ఇంజనీర్ల ద్వారా క్షుణ్ణంగా అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యటనలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయ్ కుమార్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులున్నారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**కుత్బుల్లాపూర్ జూలై 20 (జనం సాక్షి)**

దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగదిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వేణు యాదవ్, ఈవో కృష్ణమాచార్యులతో కలిసి బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాల అలంకరణ కోసం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని 106 దేవాలయాల కమిటీ నిర్వాహకులకు 29 లక్షల 48 వేల రూపాయల చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. కుల మతాలకతీతంగా అమ్మవారి వేడుకలను జరుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా అమ్మవార్ల ఆలయ పరిసర ప్రాంతాల భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా, గుజ్జుల పాపిరెడ్డి, సమ్మయ్య యాదవ్, వెంకటేష్, బండ అనిత మహేందర్, డివిజన్ టిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరాగౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, గణేష్, బండా మహేందర్, కరుణాకర్ రాజు, కృష్ణమూర్తి, ఆలయ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలి
- మేడ్చల్‌లో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ
- మేడ్చల్ జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శన



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 20 (జనంసాక్షి)**

ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన, ప్రజాపాలన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదైన దరఖాస్తులను పరిశీలించి, ప్రజా పాలన లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో డేటా విభాగంలో ఎప్పుడు కప్పుడు ఎంట్రీ చేయాల న్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందించిన గృహజ్యోతి, మహాలక్ష్మి (గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. తదనంతరం మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల (బాలికల) సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ దిలీప్ కుమార్, మేడ్చల్ ఎమ్మార్వో శైలజ, జిల్లా విద్యాధికారి ఐ.విజయ కుమారి, ఎంపీడీవో వసంత లక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**





కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని చిన్న వెల్లి, గాజులపేటలో ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన బాధితులను జిల్లా ఎస్పీ డి. జానకి సహకారంతో శనివారం స్థానిక పోలీసులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో ఇల్లు కూలిపోయిన వారి కుటుంబాలకు నిత్యవసర వస్తువులు బియ్యం, పప్పులు ఇతర కిరాణా సామాన్లు, రగ్గులను ఎస్పీ తన సొంత డబ్బులతో సంబంధిత పోలీసు అధికారుల ద్వారా బాధితులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎదుటివారు ఆపదలో ఉంటే మానవతా దృక్పథంతో సాటి మనుషులు వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలని ఎస్పీ సూచించారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత ఇళ్లలో నివాసముంటున్న వారు తక్షణమే ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు పిల్లలని, లేనిచో కురుస్తున్న వర్షాలకు ఆ పాత ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అత్యవసరమైతే తప్ప అనవసరంగా బయటికి రాకూడదని ఆమె ప్రజలను కోరారు.

# సాంకేతిక కోర్సును సద్వినియోగించుకోవాలి

### ప్రభుత్వ ఐటీఐని సందర్శించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 20 (జనంసాక్షి)**

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను అవకాశం కల్పించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఉంది, దీనికి అనుగుణంగా సాంకేతిక కోర్సులను పూర్తి చేసిన, వెంటనే ఉపాధి అవకాశాలు, స్వంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన సాంకేతిక కోర్సులను సద్వియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐని మేడ్చల్‌ను మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ శనివారం సందర్శించారు. ఐటిఐ కళాశాలలోని ట్రేడ్స్ కోపా, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్, టర్నర్ మ వెల్డర్ ట్రేడ్‌ల్లో ట్రైనింగ్ ఐటిఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ వివరించారు. వివిధ ట్రేడ్‌లలోని ట్రైనీలకు గల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉపాధి అవకాశాల గురించి కలెక్టర్ కు వివరించారు. మేడ్చల్ జిల్లాలో అప్రెంటిస్ షిప్ కన్వీనర్ గా మేడ్చల్ ఐటిఐ వ్యవహరిస్తుందని ప్రతి సంవత్సరం 1800 మందికి పైగా ట్రైనీలు అప్రెంటిస్ షిప్ పూర్తి చేసుకుంటున్నారని కలెక్టర్ కు ప్రిన్సిపల్ తెలియజేశారు. ప్రావీణ్య స్కిల్ డెవలప్ మెంట్ వారు నిర్వహించిన స్కిల్స్ కాంపిటేషన్ లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన ఐటిఐ విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు. ఐటిఐలో నూతనంగా ప్రారంభిస్తున్న సేవింగ్ టెక్నాలజీ (టైలరింగ్), ఫుడ్ టెక్నాలజీ ట్రేడ్ పట్ల కలెక్టర్ ఆసక్తి వ్యక్తం చేశారు. వాటి గురించి ప్రిన్సిపల్ వివరించారు. మహిళ సాధికారతకు మేడ్చల్ ఐటిఐ కృషిని కలెక్టర్ అభినందించారు. ఐటిఐ లోని ఫ్రూట్, వెజిటేబుల్ ప్రాసెసింగ్ యూనిట్ల గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఔత్సాహిక మహిళలకు ఈ ఇంకుబేటర్ సమర్థత ఇస్తుందని ప్రిన్సిపల్ కలెక్టర్ కువివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రస్తుత ప్రిన్సిపాల్ హనుమా నాయక్, పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ, మేడ్చల్ ఎమ్మార్వో శైలజ, ఎంప్లాయిమెంట్ అధికారి నిర్మల, ఐటిఐవిద్యార్థులు, కళాశాల సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఇరిగేషన్ మెయింటెనెన్స్ ఫోరమ్ ఎన్నిక ఏకగ్రీవం

**ఖమ్మం జూలై 20 (జనం సాక్షి):**

ఇరిగేషన్ డిపార్ట్మెంట్ మెయింటినెన్స్ ఫోరం జిల్లా యూనిట్ ఎన్నిక కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు ఎస్ కే. అఫ్జల్ హసన్, కార్యదర్శి ఆర్‌విఎస్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి. జి.ఎస్. ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అఫ్జల్ హాసన్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ మైంటెన్స్ పోరం అధ్యక్షునిగా బాధ్యత నిర్వహించిన వెంకటి ఉద్యోగ విరమణ చేసినారన్నారు. అందువలన మైంటైన్ పోరం జిల్లా అధ్యక్షునిగా రమణారెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు చుంచు వీరనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెయింటినెన్స్ ఫోరం మాజీ అధ్యక్షులు వెంకటి, టీఎన్జీవోస్ టౌన్ అధ్యక్షులు ఎస్కే నాగుల్ మీరా, కార్యదర్శి కట్ట నవీన్, టీఎన్జీవోస్ కల్లూరు యూనిట్ అధ్యక్షులు సవర్జెన్ పాల్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి కే సైదులు, ఐటిఐ ఫోరం నాయకులు వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఫోరం నాయకులు వాసు, వెంకటేశ్వర్లు, రాణి, శ్రీనివాసు, బి .నగేష్ ,టౌన్ నాయకులు ఆర్. ఎన్ .ప్రసాద్ తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ వారిని టీఎన్జీఎస్ ఖమ్మం జిల్లా కమిటీ తరఫున ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఇరిగేషన్ ఫోరం ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):** నారాయణపేట జిల్లాలోని కోస్గి పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో టీయుఎఫ్ఐడిసి నిధులతో పలు నిర్మాణ పనులను చేపడుతున్నారు. రూ. 50 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్టును నిర్మిస్తున్నారు. శనివారం కలెక్టర్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అలాగే రూ.180 లక్షలతో కోస్గి మున్సిపాలిటిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టే స్థలాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇక గుండ్లపల్లి చౌరస్తా నుంచి జిన్నారం గ్రామం వరకు రూ. 2 కోట్లతో నిర్మించాల్సిన బీటీ రోడ్ పనులను రద్దు చేసి, ఆ నిధులతో ఇతర అభివృద్ధి నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, కోస్గి మున్సిపల్ కమిషనర్ శశిధర్, మున్సిపల్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- శిథిలావస్థలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తించాలి
- చెరువు కట్టలు తెగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,జులై 20(జనంసాక్షి):** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా నాగర్ కర్నూల్ జిల్లాలో వర్షాలు నిర్విరామంగా కురుస్తున్నాయని, రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రెవిన్యూ మరియు అత్యవసర శాఖల అధికారులు అవసరమైన ముందస్తూ జాగ్రత్త చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులకు శనివారం స్పష్టమైన ఆదేశాలు ఆదేశించారు. వాతావరణ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో రానున్న మరో రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున, నిరంతర వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణ మరియు ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని చెరువు కట్టలు తెగిపోకుంట అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్డీవోలు, తాహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు దూరంగా ఉండాలని, కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా పశువులకు, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు, వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో తాగునీరు వర్షాల కారణంగా కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైప్ లైన్ లీకేజీలు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ముఖ్యంగా ప్రజలు శిథిలావస్థలో ఉండి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లలో ఉండేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నేడు ఒక ప్రకటనలో సూచించారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

### హుస్నాబాద్ ఏసీపీ సతీష్



**కోహెడ జూలై 20 (జనంసాక్షి):** కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు , సీసీ కెమెరాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల గురించి, నూతన చట్టాల గురించి హుస్నాబాద్ ఏసిపి వి.సతీష్ అలాగే హుస్నాబాద్ షీటీమ్ బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ చదువుకునే సమయంలో విద్యార్థులు ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని అన్నారు. ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. అప్పుడే తల్లిదండ్రులను, విద్యను నేర్పిన గురువులను జీవితంలో ఎప్పుడూ మర్చిపోవద్దని అన్నారు. అలాగే సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అలాగే ఏదయినా అనుమానం కలిగితే పోలీసులను సంప్రదించి తగిన సహాయం కోరాలని అన్నారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని అన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోని ఉన్నత స్థానాలలో ఉండాలని ఏసీపి అన్నారు. నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని మహిళల పట్ల జాగ్రత్తగా, మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. యువత గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగానికైనా, ప్రైవేట్ ఉద్యోగానికైనా తప్పకుండా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ చాలా ముఖ్యమని అందువల్ల సభ్యత, సంస్కారంతో ఉండాలని అన్నారు. అలాగే చిన్నచిన్న గొడవలకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సదరు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ రవీందర్ రెడ్డి, అధ్యాపకులు, హుస్నాబాద్ షీ టీం బృందం, హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ, శివ కుమార్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ఐ పంపులను వెంటనే ప్రారంభించాలి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జూలై 20 (జనంసాక్షి):** మహాత్మా గాంధీ కల్వకుర్తి ఇరిగేషన్ స్కీం మోటారు పంపులను వెంటనే ప్రారంభించి ఆయకట్టు పొలాలకు నీటిని వదలాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను కోరారు .శనివారం మాజీ మంత్రి ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్ కుమార్‌కి ఫోన్ చేసి మాట్లాడారు. పంపులను వెంటనే ప్రారంభించి ఆయకట్టుకు నీళ్ళు వదలక పోతే రోజుకు ఒక టీఎంసీ వరద నీటిని కోల్పోతామని ఈఎన్ సీ అనిల్ కుమార్‌కి చెప్పారు. జూరాల ఎగువ ప్రాంతం నుంచి కృష్ణాకు ఎప్పుడు నీళ్ళు వచ్చినా గతంలో తాను ముందుగానే అధికారులను, ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేసి, ఉమ్మడి జిల్లాలోని అన్ని పంపులు ప్రారంభించేలా చర్యలు చేపట్టే వాడినని గుర్తు చేశారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పంపులను కూడా ప్రారంభించి, నార్లాపూర్ రిజర్వాయరును కూడా నింపాలని సూచించారు. ఖరీఫ్ ప్రారంభమై సుమారు రెండు నెలలు అవుతున్నదని, వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఇప్పటికే ఆందోళనలో ఉన్నారని అన్నారు. కృష్ణా జలాలను వెంటనే కాలువలకు వదిలితే వరి నాట్ల ప్రక్రియ చేపడుతారని అన్నారు అందుకు స్పందించిన ఈఎన్ సీ పంపులను ప్రారంభించి కేఎల్ఐ రిజర్వాయర్లను నింపుతామని కాలువలకు కూడా నీళ్ళు వదలుతమని హామీ ఇచ్చారు.

## దోమల నివారణకు ముందస్తు చర్యలు

### ఎడతెరిపిలేని వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో జూలై20 (జనంసాక్షి)** ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన ఫోన్లో మాట్లాడుతూ వర్షాలపై తగు సూచనలు, చేశారు. మరో మూడు, నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని ఎక్కడ కూడా ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పాత ఇండ్లల్లో, మట్టి మిద్దెలలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అంటు రోగాల బారినపడకుండా గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఎలాంటి సమస్యలు తలెత్తిన తనతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి




### మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్పూర్ జూలై 20, (జనంసాక్షి)** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ స్టాఫ్ మరియు హెల్త్ సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అపార్ట్మెంట్ల సెల్లార్లలో నీరు నిల్వ ఉండకుండా సంపులు ఏర్పాటు చేసుకుని నీటిని వెంట వెంటనే బయటికి పంపించే విధంగా విద్యుత్ పానెల్ బోర్డులను వర్షాలకు తడవకుండా ఫస్ట్ ఫ్లోర్లో ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ షార్ట్ సర్క్యూట్స్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థితిలో ఉన్నటువంటి పాత ఇళ్ళను వెంటనే గుర్తించాలని, అట్టి గుర్తించిన వాటికి నోటీసులు జారీ చేసి వెంటనే కూల్చివేయాలని, లో లైన్ ఏరియాలను గుర్తించి వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు వెంటనే చేపట్టాలని, మ్యాన్ హెూల్స్ ఓపెన్ లో లేకుండా, మరియు ఏమైనా రిపేర్లు ఉన్నచో వెంటనే సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేసి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ రాధిక మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమల వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమని తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అమీన్పూర్ సిఐ సదా నాగరాజు మాట్లాడుతూ వర్షాల కారణంగా వాటర్ ఫ్లో వలన ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే మా సిబ్బందిని పంపించడం, మేము పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పవన్, వెంకటరామయ్య,సానిటరీ ఇన్స్పెక్టర్ అంజన్ కుమార్, మున్సిపల్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



## పెబ్బేరు సంత స్థలాన్ని వదిలే ప్రసక్తి లేదు

### ఎమ్మెల్యే మెగా రెడ్డి

### ఎమ్మెల్యేను కలిసిన-వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ బృందం

**పెబ్బేరు జూలై 20 (జనం సాక్షి)** పెబ్బేరు సంత స్థలాన్ని వదిలే ప్రసక్తే లేదని వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెబ్బేరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు వనపర్తి ఎమ్మెల్యే కలిసి సమస్యను వివరించారు. ఇటీవల సంత స్థలంపై వెలువడిన కోర్టు తీర్పులో గతంలో పూజారులు ఇచ్చిన 12.28 గుంటల భూమికి బదులు గత ప్రభుత్వం మరో దగ్గర స్థలం కేటాయించినట్లు తెలిపారు. అట్టి భూమి ఇవ్వకపోవడంతో మా భూమి మాకే చెందాలని హైకోర్టు కు అప్పీల్ చేయడం జరిగిందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం తిరిగి వారి భూమి వారికే వచ్చే విదంగా ఉత్తర్వులు పొందారు. వాస్తావానికి మొత్తం 30.19 గుంటల భూమి శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందినదని ఎమ్మెల్యేకు వివరించారు. గత ప్రభుత్వం లో ఆ భూమిపై పూజరులకు ఓఆర్సీ ఇప్పించి హక్కులు కల్పించారు, ఇదే విషయం పై కమిటి సభ్యులు స్థానిక ఎమ్మెల్యేను కలువగా సంత స్థలాన్ని వదిలే ప్రసక్తే లేదు..మొత్తం భూమిని తిరిగి యదా స్థితికి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. శ్రీ వేణుగోపాలస్వామి భూమి పరిరక్షణ సమితి సభ్యులు,,సంత సభ్యులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్యం అందించాలి

**నాగర్ కర్నూల్ ఆర్సీ జూలై 20(జనంసాక్షి):** ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి నియోజకవర్గంలోని సల్కర్ పేట మాజీ ఎంపీటీసీ అంజి మూత్రపిండాలలో రాళ్లు రావడంతో పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆహారం సరిపడినంత నీరు తీసుకోకపోవడం వల్లే మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. చికిత్సతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎలాంటి ఆందోళన చెంత వద్దని ధైర్యం కల్పించారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
- ఎంపి డికె. అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా 2లక్షల రుణ మాఫీ ఏకకాలంలో చేస్తామని ఇప్పుడు షరతులతో లక్ష రూపాయలు మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని పాలమూరు ఎంపి డికె. అరుణ మండిపడ్డారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా బిజెపి కార్యవర్గ సమావేశం లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షరతులు లేకుండా రుణమాఫి చేస్తామన్నారు అని ఇప్పుడు మార్గదర్శకాలు అంటున్నారనీ విమర్శించారు. రైతు భరోసా పేరుతో గొప్పలు కొట్టి నేటికీ రైతు భరోసా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఇప్పటి వరకు వర్షాకాలం ఇరిగేష ప్రత్తిపాదనలు లేవు, రివ్యూ లేదనీ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. మహిళ్లలకు 2500 అన్నారు ఇవ్వలేదు, యువతులకు స్కూటీ లు అన్నారు అది లేదు, ఫ్రీ బస్ స్కీమ్ అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందనీ విమర్శించారు. ఈ సమస్యలపై ప్రజల పక్షాన ఉండడి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వైఫల్యాలని ఎండగడుతూ పోరాటాలకు కార్యకర్తలు సిద్ద పడాలన్నారు. బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలపర్చుకోవాల్సిన అవసరం ఉందనీ సంస్థాగతంగా బలపడి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మూడోసారి మోడీ గెలుపులో మహబూబ్ నగర్ స్థానం ఉండటం శుభపరిణామం అన్నారు. పాలమూరు పార్లమెంట్ లో బిజెపి గెలుపు ఆశామాశి వ్యవహారం కాదనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా రంజక పనులు, కేంద్రం నుంచి వస్తున్న నిధులను ప్రజలకు వివరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ అన్ని రకాల కుట్రలు చేసిందనీ దానిని కార్యకర్తలు తిప్పికొట్టారు అని అన్నారు. నాకు 20 వేలమెజారిటీ ఇచ్చిన నారాయణ పేట ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. నారాయణపేటలో ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలనీ కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మి నారాయణ, బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కే. రతంగ్ పాండు రెడ్డి, కొండయ్య,జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జిల్లా వివిధ మోర్చాల అధ్యక్ష కార్యదర్శులు, పదాధికారులు పాల్గొన్నారు.



## బోధనలో వినూత్న విధానాలు అవలంబించాలి

- శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలాల విద్యాధికారి జయరాములు
- విద్యార్థుల అభ్యసనలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకం
- జిల్లా సెక్టోరల్ అధికారి యుగంధర్

**శ్రీరంగాపూర్ జూలై 20 (జనం సాక్షి)** శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి అధ్యక్షతన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా శ్రీరంగాపూర్ మండల విద్యాధికారి జయారాములు, వనపర్తి జిల్లా సెక్టోరల్ అధికారి యుగంధర్ పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా ప్రగతి గురించి వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, పాఠశాల నిధుల గురించి సమీక్షించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి జయరాములు ప్రసంగిస్తూ బోధనలో వినూత్న పద్ధతులు, బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా బోధనలో ఆసక్తిని రేకెత్తించి విద్యాప్రమాణాలను పెంచవచ్చున్నారు. జిల్లా సెక్టోరల్ అధికారి యుగంధర్ ప్రసంగిస్తూ పిల్లల అభ్యసనలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సమావేశంలో ఉపాధ్యాయులు మోహన్ రాజు, వసంతపురం రాజు, చిన్న స్వామి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, తస్లీమా బేగం, అంగన్వాడీ టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం



### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్

**వనపర్తి బ్యూరో జులై 20 (జనంసాక్షి)** ఎడతెరపి లేని వర్షాల వల్ల ఇబ్బందులు, రైతు రుణమాఫీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కొరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నేడొక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్ మెంబర్లు 08545 - 220351, 08545-233525. జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. కాబట్టి ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సమస్యలు ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సూచించారు. అదేవిధంగా రైతు రుణ మాఫీ లో రైతులకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడం జరిగిందని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్గాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాతబడి, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అదేసమయంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 20(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బోర్రా ప్రవీణ్ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీజేపీవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సంగారెడ్డి నుంచి భారీ బీజేవైఎం నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రామ్ బాబు, అధికార ప్రతినిధి పవన్ ముదిరాజ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు నరేన్ దేశ్‌పాండే, ఉపాధ్యక్షుడు రాకేష్ గౌడ్, ప్రశాంత్, అరవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందీప్, ప్రసాద్, సాయితేజ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రమోద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మోహన్, శివశంకర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మణికంత, శివ, కార్తీక్, మండల అధ్యక్షులు ప్రవీణ్, గిరిధర్, వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శులు నవీన్, చంద్రారెడ్డి, ప్రశాంత్, కార్యకర్తలు వీర, ప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగున తిరుగుబాటు ?

• గీతా రామస్వామి



నేనీ పుస్తకాన్ని ఎందుకు రాయాల్సి వచ్చింది?నన్ను నేను పరామర్శించుకుంటూ.. పరిసర ప్రపంచంతో నాకున్న సంబంధాలేమిటి, అందులో నా స్థానం ఎక్కడని ప్రశ్నించుకుంటూ చేసిన అన్వేషణ ఫలితమే ఈ పుస్తకం. నేను కేరళ మూలాలున్న ఒక తమిళ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాను.అయితే యాభై ఏళ్లకు పైగా నా కార్యక్షేత్రమంతా హైదరాబాద్ నగరమూ, కొండలూ గుట్టలతో నిండిన ఆ చుట్టుపక్కల ప్రాంతాలే. పాశ్చాత్య దేశాల్లో 'బ్రా'లను తగలబెట్టడాన్ని ఓ ర్యాడికల్ చర్యగా పరిగణిస్తుంటే ' పద్నాలుగేళ్ల వయసులో బ్రా ధరించినందుకు మా కుటుంబమే నన్నో నీతిమాలినదానిగా చూసింది. నా యవ్వనపు రోజులన్నీ చిన్న చిన్న తిరుగుబాట్లతో, గణితం మీద వ్యామోహంతో గడిచిపోయాయి. 1970లలో నేను నక్సలైట్ ఉద్యమంవైపు మొగ్గాను, ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లాను. ఇదంతా చూసి, నాకెవరో 'బ్రెయిన్ వాష్' చేశారని అనుకున్నారు నా తల్లిదండ్రులు. నన్ను బలవంతంగా మద్రాసుకు తరలించి, ఆ బ్రెయిన్ వాష్‌ను 'రివర్స్' చేయించటం కోసం నాకు కరెంట్ షాక్ ట్రీట్‌మెంట్ ఇప్పించారు. దానివల్ల నా జ్ఞాపకశక్తి చెదిరిపోయింది. ఎంతగా అంటే' స్నేహితులు నానా కష్టాలూ పడి నన్ను మద్రాసు నుంచి తప్పించి, హైదరాబాద్‌కు తీసుకువచ్చిన తర్వాత.. నేను ఎప్పటి నుంచో పెళ్లి చేసుకోవాలనుకుంటున్న వ్యక్తినే గుర్తుపట్టలేకపోయాను. మానసికంగా అంతా అయోమయమైపోయింది. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టులను తప్పించుకోడానికి నేనూ, నా భర్త సిరిల్ రెడ్డీ ఉత్తర భారతదేశానికి వెళ్లిపోయి, ఘజియాబాద్‌లో బాల్మీకీల మధ్య జీవించటం ఆరంభించాం. అక్కడ వాళ్లకి ఇంగ్లిష్ నేర్పించటం వంటి రకరకాల పనులు చేశాం. ఆ కాలంలో నాకు తరచూ ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తుండేది. 1980లో మేం హైదరాబాద్‌కు తిరిగి వచ్చాంగానీ ఇక్కడ మాకోసం ఎదురు చూసే కుటుంబంగానీ, పార్టీ గానీ ఏదీ లేదు. అయినప్పటికీ ఈ నగరమే మా ఇల్లు అయ్యింది. స్నేహితుల సహాయంతో మేం హైదరాబాద్ బుక్ ట్రస్ట్ (హెచ్‌బీటీ)ని నెలకొల్పాం. వామపక్షవాదులు, అంబేద్కరిస్టులతో ఎక్కువగా కలిసి పనిచేస్తూ, తక్కువ ధరలకే పుస్తకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రచురణ సంస్థగా దాన్ని తీర్చిదిద్దాం. నా కుంగుబాటుకు హెచ్‌బీటీ పని ఓ అద్భుతమైన మందులా పనిచేసింది. అనతికాలంలోనే హెచ్‌బీటీ అంటే గీత అనే అభిప్రాయం ఏర్పడిరది, అదిప్పటికీ కొనసాగుతోంది. అయినప్పటికీ నేనీ పాత్రలో పూర్తిగా స్థిరపడలేకపోయాను. ఏ విప్లవం కోసమైతే నేను జీవించానో, కలలు కన్నానో అది దరిదాపుల్లో కూడా కనిపించకపోవటం నన్ను చాలా అశాంతికి గురి చేసింది. ఏదో తెలియని తపన మనసులో అసంతృప్తి రేపుతుండేది. అప్పటికి నా వయసు ముప్ఫై ఏళ్లు.

అప్పుడే, అంటే 1984లో, నేను మొట్టమొదటిసారిగా ఇబ్రహీంపట్నంలో అడుగుపెట్టాను. హైదరాబాద్‌కు నైరుతిగా, ఓ గంట ప్రయాణ దూరంలో, రంగారెడ్డి జిల్లాలో ఉంటుంది ఇబ్రహీంపట్నం. అక్కడంతా రెడ్లదే పెత్తనం. కొండలూ, గుట్టలతో రాళ్లమయంగా ఉండే ఆ ప్రాంతంలో జనం.. రెడ్డి భూస్వాముల దోపిడీ, దాష్టీకాల మధ్య నలిగిపోతుండే వారు. దళితులు, ముఖ్యంగా మాదిగల చేత ఆ రెడ్లు వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వాళ్లను సేవకులుగా చూస్తుండేవాళ్లు. అలాంటి ప్రదేశంలో నేను దాదాపు పది సంవత్సరాల పాటు భూ పోరాటాల్లో పాల్గొన్నాను. ఆ పోరాటాలకు దళితులే ఎక్కువగా నాయకత్వం వహించేవారు. ఏ రకంగా చూసుకున్నా కూడా, అక్కడ నేనో బయటి వ్యక్తిని. నాకేమాత్రం అనుభవంలేని వ్యవహారాల్లో తలదూర్చాను. మార్క్సిస్టు'లెనినిస్టు ఉద్యమంలో పాల్గొంటూ విప్లవం గురించి కలలు కనడం వేరు' నాలాంటి స్త్రీ నిరుపేద ప్రజలతో కలిసి పనిచేయడం వేరు. అయినా కూడా వారు నాకు తమ ఇళ్లలోనే కాదు, తమ హృదయాల్లో సైతం చోటిచ్చారు.

అక్కడి రెడ్లు అత్యంత క్రూరులైన భూస్వాములు. జనాలకు భయంకరమైన శిక్షలు వేసేవాళ్లు. జనం వీపుల మీద పెద్ద పెద్ద బండరాళ్లను పెట్టి గంటల తరబడి నొక్కేవాళ్లు. కొన్ని గ్రామాల్లో అయితే కొత్తగా పెళ్లైన మాదిగ వధువులను శోభనం కాకముందే దొర గడీకి లాక్కుపోయేవారు. కూలికి వచ్చిన తల్లులు బిడ్డకు పాలివ్వాలని వెళ్తుంటే.. వాళ్లు నిజంగా బాలింతలా కాదా అని పరీక్షిస్తూ.. వాళ్ల రొమ్ములను నొక్కి చూసేవాళ్లు. ఏ ఊరు వెళ్లినా పేదలు, దళితులపై జరుగుతున్న ఇలాంటి దుర్మార్గాల గురించి ఎన్నో వ్యథలు వినపడుతుండేవి. నేనీ ప్రాంతానికి ఓ విఫల ఆదర్శవాదిగా వచ్చాను. యవ్వనంలో ఎన్నో ఏళ్లు రకరకాల నిష్ప్రయోజనకర సాహసాలతో గడచిపోయిన తర్వాత.. కనీసం ఎవరికో ఒకరికి, ఎంతో కొంత ఉపయోగపడాలన్న తపనతో ఇక్కడికి వచ్చాను. ఎక్కువగా మాదిగలతోనే కలసి బతికాను. వాళ్లు నన్ను అక్కున చేర్చుకున్నారు, ఒక రకంగా తమ జీవితాల్లో భాగం చేసుకున్నారు. తమ పాటలు పాడి వినిపించేవాళ్లు, నేను ఎలాంటి దుస్తులు ధరిస్తే ఇందిరమ్మలా కనిపిస్తానో చెప్పేవాళ్లు. తమ శక్తియుక్తుల గురించీ, తాము చేయాలనుకుంటున్న పోరాటం గురించీ వాళ్లకు చాలా స్పష్టమైన అవగాహన వుండేది. వారితో పాటు నేను కూడా వాళ్ల కూలీల సంఘంలో అంతర్భాగమయ్యాను. దాని పేరు 'ఇబ్రహీంపట్నం తాలూకా వ్యవసాయ కూలీ సంఘం (ఐటీవీసీఎస్)', మేం క్లుప్తంగా 'సంఘం' అనేవాళ్లం. యూనివర్సిటీలో చదువుకున్న ఒక బ్రాహ్మణ స్త్రీ' ఎందరో రెడ్డి, రావు పేర్లుగల స్నేహితులున్నామె' మాదిగలతో కలసి జీవించడానికి ఇబ్రహీంపట్నం ఎలా వచ్చింది? అంతేకాదు, అలా వచ్చిన నేను ఆ తర్వాత ఆ పోరాటాన్ని ఎప్పుడు, ఎందుకు, ఎలా వదిలేశాను? వీటి గురించే మీరిప్పుడు చదవబోతున్నారు.

నేనా గ్రామాల్లో పనిచేస్తున్నప్పుడు నా భర్త సిరిల్ రెడ్డి నాకు కొండంత అండగా నిలబడ్డాడు. అప్పుడాయన హైదరాబాద్‌లో పేదలకు న్యాయ సహాయం అందించే 'సలహా' అనే సంస్థలో వున్నాడు. మేమిద్దరం కలిసే మా వ్యూహాలను రూపొందించే వాళ్లం. తను హెపటైటిస్ వ్యాధి బారినపడి ఏడాదిన్నరకు పైగా మంచం మీద వున్నప్పుడు కూడా తన బాగోగులు చూసుకునేందుకు వేరే ఏర్పాట్లు చేసుకుని, నా పనిని మాత్రం ఆపొద్దంటూ ప్రోత్సహించాడు. నా బ్రాహ్మణత్వాన్ని సిరిల్ ఎప్పుడూ విమర్శిస్తూనే ఉండటం నాకు చాలా ఉపయోగపడిరది. ముఖ్యంగా తిండి విషయంలో నాకున్న దురభిప్రాయాలను వదిలించుకుని, నేను మారడానికి ఆ విమర్శలే దోహదం చేశాయి. కొత్తరకం మాంసాహారం తినడానికి నేను సంకోచించిన ప్రతిసారీ సిరిల్ నాలోని బ్రాహ్మణత్వమే అందుకు కారణమని ఎత్తి చూపేవాడు. అలాగే నేను డబ్బు ఖర్చు చేయడానికి వెనుకాడినప్పుడూ, చిన్నచిన్న వ్యాపారస్తుల వద్ద బేరాలాడినప్పుడూ విమర్శించేవాడు. బ్రాహ్మణ స్నేహితులతో అనుబంధం పెంచుకోవడం, బ్రాహ్మణులు చేసే పొరపాట్లను సానుభూతితో అర్థం చేసుకోవడం, ఇతర కులాలవారి పట్ల మాత్రం భిన్నంగా వ్యవహరించడం వంటి పద్ధతులను తప్పుపట్టి, నా ప్రవర్తనకు కారణమైన మూలాలను ఎత్తిచూపేవాడు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పెళ్లిచేసుకుని, రకరకాల కష్టనష్టాలను ఎదుర్కొన్న కుటుంబంలో పుట్టిపెరిగినందు వల్ల సిరిల్‌కు కుల దౌష్ట్యం, అణచివేతల గురించి నాకంటే ఎక్కువ అవగాహన వుండేది. భారతదేశంలో దు:ఖదాయకమైన చాలా అంశాలకు హిందూ బ్రాహ్మణిజమే కారణమని అతనూ, అతని తోబుట్టువులూ సరిగ్గానే గుర్తించారు. నాకు ప్రజల్లో ఎక్కువ గుర్తింపు రావటం సిరిల్‌ను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు, పైగా తనే నాకు అనేక విధాలుగా మద్దతిచ్చాడు. తనే గనక లేకపోయి ఉంటే నేనిక్కడ చెప్పబోతున్న కథకు అసలు ఆస్కారమే వుండేది కాదు.

ఈ ప్రయాణంలో మాకు ఎంతోమంది నిస్వార్థంగా, అండగా నిలబడ్డారు. వాళ్లలో న్యాయవాదులు' బొజ్జా తారకం, గొర్రెపాటి మనోహర్, సి.వి.మోహన్ రెడ్డి, సి.పద్మనాభ రెడ్డిలను ముందుగా చెప్పుకోవాలి. అలాగే మా పోరాటంలో ప్రతి దశలోనూ ఎంతోమంది పౌర సమాజ కార్యకర్తలు మాకు చేయూతనిచ్చారు, పాత్రికేయులు మా కథనాలకు విశేష ప్రాధాన్యతనిచ్చారు, స్నేహితులు అనేక విధాలుగా తోడుగా నిలబడ్డారు. ఆ రోజుల్లో నేను ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు వచ్చివెళ్లిన ప్రతిసారీ భూస్వాముల కిరాయి హంతకులు నా మీద దాడిచేసే ప్రమాదం పొంచి వుండేది. మా ఇల్లు ఓ దిగువ మధ్యతరగతి ప్రాంతంలో వుండేది. చుట్టుపక్కల కొన్ని పక్కా ఇళ్లు, ఎక్కువభాగం రకరకాల రేకుల ఇండ్లు ఉండేవి. వాటిలో చిన్న చిన్న వర్తకులు, తోపుడు బళ్లవాళ్లు, ఇళ్లల్లో పనిచేసేవాళ్లు నివసిస్తుండేవారు. మమ్మల్ని కలవడానికి గ్రామాల నుంచి ప్రతిరోజూ వందల మంది రావడం, ఒక్కోసారి జనం లారీల్లో దిగడం, మా ఇంట్లో చోటులేక చాలామంది బయటే నిలుచుండిపోవటం.. ఇదంతా మా చుట్టుపక్కల వాళ్లు రోజూ చూస్తుండే వాళ్లు. మొదట్లో మా ఇంటికి అంతమంది ఎందుకొస్తున్నారో ఆరాలు తీశారు. ఒకసారి కారణం తెలిశాక.. ఇరుగుపొరుగు అంతా మాకు ఎంతో అండగా నిలబడ్డారు. దూరం నుంచి వచ్చినవాళ్లకు నీళ్లివ్వటం, తరచూ మాకు ఆహారం పంపించటం వంటివే కాదు.. ఎవరైనా కొత్తవాళ్లు, అనుమానితులు మా వీధిలో అడుగుపెడుతున్నారా? అన్నదీ గమనిస్తుండేవాళ్లు. 1970లలో పెరిగి పెద్దయిన తరం మాది. కొన్ని విధాలుగా మేం చాలా అదృష్టవంతులమని చెప్పాలి. స్త్రీ విముక్తి ఉద్యమం మాకు జీవితంలో నిర్భయంగా ఉండాలని నూరిపోసింది. ఇక మాతో పాటు చదువుకున్న మగపిల్లలు, పురుషులంతా కూడా మమ్మల్ని వాళ్ల ప్రత్యర్థులుగానో, శత్రువులుగానో, లేకపోతే వాళ్ల మీద పెత్తనం చెలాయించే ఆడమనుషులుగానో చూడలేదు. పైగా మాకు ఎదురు ఎన్నో రకాలుగా సాయంగా నిలబడ్డారు. ఇక 1980ల నుంచీ ఐదుగురు పెద్దలు నాకు మార్గదర్శకులుగా వుండటం మరింత అదృష్టమనే చెప్పాలి. వాళ్లు' సీకే నారాయణ రెడ్డి, ఎస్.ఆర్.శంకరన్, ఎన్.వి. రాజా రెడ్డి, సి. పద్మనాభ రెడ్డి, బొజ్జా తారకం.. ఈ ఐదుగురూ కూడా తమతమ రంగాల్లో అసాధారణమైన వ్యక్తులు. సీకే నారాయణ రెడ్డి జీవిత పర్యంతం కమ్యూనిస్టు, నేను చూసిన అత్యంత సున్నిత హృదయులు! మేమిద్దరం లాభాపేక్ష లేని పుస్తక ప్రచురణ సంస్థ హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌లో కలిసి పనిచేశాం. అక్కడ ఆయనే నా ఆంతరంగికుడు. ఇక ఐఏఎస్ అధికారి, దళితులకు ప్రత్యక్షంగా మేలు చేసే అనేక ప్రభుత్వ పథకాల రూపకల్పనకు బాధ్యులైన ఎస్.ఆర్. శంకరన్ నాకు సన్నిహితులే కాదు, అడుగడుగునా నన్ను మెలకువగా ఉంచిన మార్గదర్శి కూడా. అలాగే ఎన్.వి. రాజా రెడ్డి సోషలిస్టు, జమీందారు, గొప్ప పుస్తక ప్రియులు, దేనినైనా ఆసక్తిగా తెలుసుకునేవాళ్లు. తెలంగాణ ప్రాంతం గురించీ, ఇక్కడి సమాజం గురించీ అపారమైన పరిజ్ఞానం వుందాయనకు. ఈ ప్రాంత సంస్కృతిని అర్థం చేసుకుని, ఇక్కడి ప్రజలతో మమేకమవటంలో ఆయన నాకు ఎంతో సాయం చేశారు. సి. పద్మనాభ రెడ్డి సీనియర్ న్యాయవాది, ఎంతో అప్యాయంగా ఉండేవాళ్లు, నా కేసులను ఎన్నింటినో ఆయనే వాదించారు. బొజ్జా తారకం కూడా సీనియర్ న్యాయవాదే, గొప్ప దళిత కార్యకర్త, నేను చాలా సన్నిహితంగా కలిసి పనిచేసిన వారిలో ఆయన ఒకరు. వీళ్లు ఐదుగురూ నా కోసం తమ సమయం, శక్తియుక్తులన్నింటినీ వెచ్చించారు.

ఇక మా కుటుంబానికి వస్తే' భావోద్వేగాలు రేగినప్పుడు వాళ్లు నాకు సంబంధించిన జ్ఞాపకాలను కూడా దూరం పెట్టాలని అనుకోవచ్చు. ఇప్పుడు వాళ్లకు నేనొక సమస్యాత్మక బంధువుగానో, సమస్యాత్మక స్నేహితురాలిగానో మిగలొచ్చు. మా అక్కచెల్లెళ్లకు, వాళ్ల కుటుంబాలకు, ఇంకా అనేకమంది నా బ్రాహ్మణ మిత్రులకు.. నేను మా వాళ్ల గురించి చెడుగా రాయడం, వాళ్లను అసమానతా భావాలుగల ఛాందసులుగా, అసహనశీలురుగా చిత్రించడం నచ్చకపోవచ్చు. పైగా, ఇలా రాయడం ద్వారా నేను పాత గాయాలను కెలుకుతుండవచ్చు కూడా. వాళ్ల దృష్టిలో ఇంట్లో విషయాలు బయటపెట్టుకోవటం పెద్ద తప్పు. అయితే నేనిక్కడ మా కుటుంబానికి సంబంధించిన చెప్పుకోకూడని రహస్యాలుగానీ, సిగ్గుపడాల్సిన విషయాలుగానీ ఏమీ రాయడం లేదు. నిజానికి నా కుటుంబం ఏమంత అసాధారణమైనదీ, దుర్మార్గమైనది కూడా కాదు. ఆ మాటకొస్తే మా తల్లిదండ్రులు ఎన్నడూ మా మీద గానీ, మరెవరిమీదైనా గానీ చెయ్యెత్తి కూడా ఎరగరు. కాకపోతే మన సమాజంలో పితృస్వామిక భావాలను, కుల కట్టుబాట్లను.. సూర్యోదయ సూర్యాస్తమయాల్లా అవెంతో సర్వసాధారణమైనవన్నట్లు, శాశ్వతమైనవన్నట్లు నమ్మేలా చేయటం, వాటిని అత్యంత 'సహజీకరించటం' వల్ల తలెత్తిన సమస్య ఇదంతా! ఒకసారి రాయడం మొదలుపెట్టిన తర్వాత ఇక వాటిని తడమటం అనివార్యమైంది.'సంఘం'తో కలసి ఓ దశాబ్దకాలం పాటు వేతన, భూ పోరాటాల్లో పాల్గొన్న తర్వాత, 1998లో నేను మళ్లీ హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌కి తిరిగి వచ్చాను. అప్పట్నించీ మాకు ఎప్పుడు కొత్త ఉద్యోగులు అవసరమైనా వెంటనే నేను' మీ పిల్లలు ఎవరైనా ఉంటే పంపండంటూ ఇబ్రహీంపట్నంలోని మా మిత్రులకు కబురు పంపేదాన్ని. వాళ్ల పిల్లలు సిటీలో ఉండి మా దగ్గర పని చేస్తూనే, చదువుకుని జీవితంలో మెరుగ్గా స్థిరపడతారన్నది మా ఉద్దేశం. .

..(మిగతా రేపటి సంచికలో..)

# రైతురుణమాఫీ చారిత్రాత్మకం

• బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి
• పెంటాకుర్దు క్యాంపులో రుణమాఫీ సంబురాలు



**బోధన్ (జనంసాక్షి):** ఏ సర్కారు చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి దేశ చరిత్రలోనే రికార్డు సాధించిందని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం బోధన్ మండలం పెంటాకుర్దు క్యాంపు గ్రామంలో రుణమాఫీపై బోధన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాలలో రూ. 31 వేల కోట్లు జమ చేస్తున్నామని తెలిపారు. మొదటగా లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయడం ద్వారా ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6098 కోట్ల రూపాయల నిధులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశామని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో రూ. 226 కోట్లు రుణమాఫీ కింద రైతుల అకౌంట్లలో పడ్డాయని ఎమ్మెల్యే తెలిపారు. గత పాలకుల కారణంగా రాష్ట్రం 7లక్షల కోట్ల రూపాయల అప్పులలో కూరుకుపోయి, ప్రతీ నెల రూ. 7 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని అన్నారు. అయినప్పటికీ, రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ హామీని అమలు చేస్తున్నామని అన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రం యావత్తు దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, జిల్లా నాయకులు బిల్ల రామ్మోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ, రాంచందర్, కాంగ్రెస్ నాయకులు రాజా, లాలు, చింటు, రామకృష్ణారెడ్డి, భద్ర రావు, సాయి పటేల్, గౌసుద్దిన్, అంకు దాముతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

• ప్రజలు చెరువులు, వాగుల వద్దకు వెళ్ళద్దు
• జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**రాయికల్ జులై 20(జనంసాక్షి):** ప్రస్తుతం కూరుస్తున వర్షాలు దృష్ట్యా వాతావరణ శాఖ వారు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. టెలికాన్ఫెరెన్స్ ద్వారా జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ అప్రమత్తం చేశారు. వర్ష సూచన ఉన్న దృష్ట్యా వాగులు పొంగిపొర్లి చెరువులు కుంటలు నిండుకుండ లాగా ఉన్నాయి కావున ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు వద్దకు పిల్లలు,యువత ఎవరూ చెరువుల వైపు వెళ్ళొద్దు అని అన్నారు. చెరువుల వద్ద, వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. వర్షానికి ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టి ఇండ్లు కూలిపోయే అవ కాశం ఉంటుందని అందులో నివసించే వారు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం కు డయల్ 100 సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు,కుంటల నీటి ప్రవాహం గురించి అన్ని జాగ్రత్తలు తీసుకుని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. వర్షాల దృష్ట్యా కరెంటు స్తంభాల దగ్గర కు ఎవరు వెళ్లకూడదని అన్నారు.

# చెరువులు, మురికి కాలువల ఆధునికరణకు నిధులు మంజూరు చేయండి

• సీఎంకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ



**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):** జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు నాల పరిసరాల్లో మురికి కాలువ ఆధునీకరణ కోసం రూ. 117.80కోట్ల నిధులు మంజూరు చేయాలని కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. చెరువు ఉప్పొంగి ప్రవహించే సందర్భం లో ప్రత్యేకించి వర్షాకాలంలో నాల పరిసరాలు ఉప్పొం గటముతో జనావాసాలు నీటిమయమవుతుండటం, వల్ల ప్రత్యేకించి పరిసరాల నివాసితులు అందరు కూడా, దళి తులు, బలహీన వర్గాలు కావటంతో తీవ్ర ఆందోళనకు గురి గురి అవుతున్నట్లు వెల్లడించారు. ఈ పరిస్థితులలో నాల కాలువ ఆధునీకరణకు అంచనాలు రూపొందిం చగా రూ.117. 80 లక్షలు కావల్సిన అవసరం ఉంది. జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు నాల పరిసరాలు చెరువు వరద నీటితో వల్ల చింతకుంట, కండ్లపల్లి ఆధునీకరణ కొరకు నిధులు మంజూరి ఇప్పించాలని ఎమ్మెల్సీ సీఎం కు లేఖ రాశారు.



## పెండింగ్ బకాయిలు విడుదల


**హర్షం ప్రకటించిన జిపి కార్మికుల సంఘం.**

సిరిసిల్ల టౌన్ జూలై 20(జనంసాక్షి) :గ్రామపంచాయతీ కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం పట్ల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్మికులందరి పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. సిరిసిల్లాలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు మల్యాల నరసయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ కార్మికులకు నెలల తరబడి రావల్సిన పెండింగ్ వేతనాల కోసం అనేక ఆందోళన పోరాటాలు సిఐటియు ఆధ్వర్యంలో చేయడం జరిగిందని, ఫలితంగా ప్రభుత్వం స్పందించి 150 కోట్ల రూపాయలు విడుదల చేసిందని, అందులో సిరిసిల్ల జిల్లాలో 736 మంది కార్మికులకు గాను నాలుగు కోట్ల 19 లక్షల రూపాయలు రావడం జరిగిందని తెలిపారు. విడుదల చేసిన డబ్బులను దారి మళ్లించకుండా కార్మికుల పెండింగ్ వేతనాల కోసం ఉపయోగించి కార్మికుల అకౌంట్స్ లో జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్కోలు మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, అంజయ్య, గంగరాజు, మహేష్ శేఖర్ పాల్గొన్నారు,

## ఎస్సైకి సన్మానం

**ముస్తాబాద్ (జనంసాక్షి):**ముస్తాబాద్ మండలానికి నూతన ఎస్సై గణేష్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న సీనియర్ నాయకులు వుచ్చుడి బాల్రెడ్డి, ఆరుట్ల మహేష్, తాడేపు కొమురయ్య, మిరుదొడ్డి భాను,శీల ప్రశాంత్, ఎదునూరి భాను, తాళ్ల విజయ్,ఎద్దండి మహేందర్, తుపాకుల శ్రీనివాస్,బదనకల్ రంజిత్, కుంభాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు





## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేత

జగిత్యాల బ్యూరో, జులై 20 ,(జనం సాక్షి) : జగిత్యాల పట్టణంలోని 24వ వార్డు కి చెందిన రాపర్తి శిరీష కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 15 వేల 200 రూపాయల విలువ గల చెక్కును శనివారం నాడు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ క్వార్టర్స్ లో అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చందా పృత్విధర్, కొలగాని సత్యం,కౌన్సిలర్ కోరే గంగమల్లు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## 'వెల్నెస్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆస్పత్రిని వినయ్‌రెడ్డి ప్రారంభించిన దంపతులు**



ఆర్మూర్(జనంసాక్షి):హైదరాబాదులోని కొంపల్లి వద్ద నూతనంగా ఏర్పాటైన వెల్నెస్ హాస్పిటల్ ప్రారం భోత్సవంలో ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి, అనన్య రెడ్డి దంపతులు పాల్గొని హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.క్యాథల్యాబ్‌సెంటర్ ను ప్రారంభించారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లైనా సుమన్ గౌడ్, ఎండి అసద్ ఖాన్, వివేకానంద రెడ్డి,మెడికల్ డైరెక్టర్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జె.ఎన్. వెంకట్ కి, వైస్ ప్రెసిడెంట్ జి ఎస్ రెడ్డిలు ఉన్నారు.

**ముదిరాజులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి.**

ఇబ్రహీంపట్నం(జనసాక్షి):ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజు మహాసభ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకి వినతి పత్రం అందించారు.స్థానికసంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో సింహభాగం కేటాయించాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు పింఛన్ కల్పించాలని కోరారు.తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్, రాంబాబు జగిత్యాల జిల్లా అధ్యక్షులు పెద్దులు నాయకులు సత్యనారాయణ శ్రీనివాస్ వంశీ నరేష్ యాజరాజ్ చిన్న సాయన్న రాజేందర్ వెంకటి నరసయ్య శేఖర్ అశోక్, సురేష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారమే మారింది

**పాలన అంతా పాతదే: కిషన్‌రెడ్డి**

హామీలన్నీ విస్మరించా రన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుంటోందని.. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. 'కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా అవినీతి కొనసాగుతోంది. అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో మాత్రమే రాష్ట్రంలో మార్పు వచ్చింది. హామీలన్నీ వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భారాసలో చేర్చుకున్నారు. రాష్ట్రంలో కేవలం జెండా మాత్రమే మారింది. ప్రజావాణి వినిపించడంలో భాజపా కృషి చేస్తుంది. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలి. 1365 గ్రూప్ 3 పోస్టులను 3000కు పెంచాలి. హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పక్రియను వెంటనే చేపట్టాలి. మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు వెంటనే రూ.4 వేల భృతిని విడుదల చేయాలి' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ముద్దసాని సేవలు మరువలేనివి

**రైతు సంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు**

**హుజురాబాద్(జనంసాక్షి):**మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి సేవలు మరువలేనివని సీనియర్ సిటిజన్, రైతు ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు అన్నారు. శనివారం దామోదర్ రెడ్డి 68వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నాయకుల తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు, కమలాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి విశేష సేవలందించిన గొప్ప నాయకుడు దామోదర్ రెడ్డి అని అన్నారు. జిల్లా ప్రజలందరికీ అర్ధ రాత్రి వరకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించి, కార్య కర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఆపదలో అండగా నిలిచిన కీ. శే. దామోదర్ రెడ్డి లాంటి నాయకులు నేడు చాలా అరుదని అన్నారు. స్వర్గీయ దామోదర్ రెడ్డిని సామాన్య ప్రజలు, కార్యకర్తలు జిల్లా టైగర్ గా పిలుచుకునేవారని అన్నారు. రాష్ట్రంలోనే అప్పటి కమలాపూర్ , ఇప్పటి హుజురాబాద్ నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందన్నారు.బడుగు బలహీవర్గాల ఆశాజ్యోతిగా భూస్వాములు, పెత్తందార్ల పాలిట సింహస్వప్నం గా, కమలాపూర్ కుర్రోడు అని అందరూ ముద్దుగా పిలిచే పేద, బడుగు బలహీనర్గాల నాయకులను తయారు చేసిన నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని కొనియాడారు. దామోదర్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని, ఆయన ఆశయాలను నేటి యువత , ఆదర్శంగా తీసుకోవాలని పోలాడి రామారావు కోరారు. చంద్రబాబు మీద నాకు అన్న అభిమానం తో నా ప్రత్యేక విన్నపం మేరకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, నేటి విభజిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని 2000సం. మే నెల 12వ తేదీన కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలంలోని మా స్వగ్రామం వన్నారం గ్రామానికి దామోదర్ రెడ్డి రప్పించి కరీంనగర్ . వరంగల్ ప్రధాన హైవే గట్టుదుద్దెన పల్లి గ్రామం నుండి మా వన్నారం గ్రామం మీదుగా ఏరడపల్లి, అర్కండ్ల, గంగారం, ఎల్బాక, చల్లూర్ గ్రామం వరకు 14 కి. మీ. బీటీ రోడ్ నిర్మాణం పనిని చంద్రబాబు తో మంజూరి చేయించి దామోదర్ రెడ్డి పూర్తి చేయించారని , మానకొండూరు, శంకరపట్నం, వీణవంక మండలాల రైతులకు ఇట్టి రోడ్ నిర్మాణం తో ఎంతో మేలు చేకూరుతుందని రామారావు గుర్తు చేశారు. డాషింగ్, డేరింగ్, డైనమిక్, మాస్ లీడర్ గా స్వర్గీయ ముద్దసాని దామోదర్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జులై 2024
తెలంగాణ

# ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం జూలై20 (జనంసాక్షి):**
భారీ వర్షాల నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ, మునిసిపల్, పంచాయతీ రాజ్, ఇర్రిగేషన్ అధికారులకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రెయిన్స్ లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు కలగకుండా ప్రతి డ్రెయిన్ నుండి వర్షపు నీరు ఆటంకం లేకుండా ప్రవహించేలా చూడాలన్నారు. జిల్లాలోని నీటి వనరుల నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రిజర్వాయర్, చెరువుల నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన తెలిపారు. పొంగుతున్న వాగులు, నిండివున్న చెరువుల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకువాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్టుల వద్ద రాకపోకలు నిలిపి, బారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని, బాధ్యత గల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కూలిపోయే ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పాఠశాల, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ భవనాలను గుర్తించి పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాల ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోతే వెంటనే మరమ్మత్తులు చేయాలని, వ్రేలాడే విద్యుత్ తీగలు, ఇండ్ల పై నుండి వెళ్లే తీగలు, రక్షణ లేని ట్రాన్స్ఫార్మర్ల పట్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ షాక్ లతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వలు ఉండకుండా, చెత్త నిల్వలు లేకుండా చూడాలన్నారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, విద్యుత్, మునిసిపల్, ఇర్రిగేషన్ తదితర శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, విద్యుత్ ఎస్ఇ సురేందర్, ఆర్డీవోలు, ఎంపిడిఓ లు, తహాశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పాఠశాల, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ భవనాలను గుర్తించి పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాల ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోతే వెంటనే మరమ్మత్తులు చేయాలని, వ్రేలాడే విద్యుత్ తీగలు, ఇండ్ల పై నుండి వెళ్లే తీగలు, రక్షణ లేని ట్రాన్స్ఫార్మర్ల పట్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ షాక్ లతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వలు ఉండకుండా, చెత్త నిల్వలు లేకుండా చూడాలన్నారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, విద్యుత్, మునిసిపల్, ఇర్రిగేషన్ తదితర శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, విద్యుత్ ఎస్ఇ సురేందర్, ఆర్డీవోలు, ఎంపిడిఓ లు, తహాశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఎస్ఐ సంధ్య..

## రోడ్డుమీద ఉన్న గుంటలను స్వయంగా కంకరతో పూడ్చుతున్న టౌన్ ఎస్ ఐ సంధ్య..

## శభాష్ పోలీస్ అంటున్న ప్రజలు..



**మధిర ఆర్.సి జులై20. (జనంసాక్షి)**
గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న కారణంగా మధిర మార్కెటు యార్డ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు మెయిన్ రోడ్ లో గుంటలుగా ఏర్పడి టూ వీలర్ వాహనదారులు ఆ గుంటల్లో వాటర్ ఉండటం వల్ల వాహనదారులుంఆ గుంతలను గుర్తించక పడిపోవటం జరుగుతుంది. ఇలా పడిపోయి దెబ్బలు తగలటం వలన ఆసుపత్రుల పాలు కావడం జరిగింది. అంతేకాక ఇటీవల కాలంలో గుంతలలో పడి చాలామంది దెబ్బలు తగిలి విషమ పరిస్థితులు కూడా నెలకొన్నాయి వీటన్నిటిని దృష్టిలో పెట్టుక మధిర టౌన్ ఎస్ఐ సంధ్య పోలీసు సిబ్బందితో కలిసి స్వయంగా కంకర తెప్పించి ఆ గుంటలను పూడ్చి వేయడం జరిగింది. మధిర ప్రజలు శభాష్ పోలీస్ అని ప్రజలు హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మధిర టౌన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వేళలా అండగా ఉంటా..

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి..
- లోతట్టు ప్రాంత ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి..
- ఎమ్మెల్యే పాయం. .



**బూర్గంపహాడ్ జూలై 20 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో గోదావరికి వరద పోటెత్తే అవకాశం ఉన్నదని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ వారికి సహాకరించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉపయోగించే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా పశువుల కాపరులు ఉధృతంగా ప్రవహించే కాలువలు, వాగులు దాటేందుకు ప్రయత్నించకూడదని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపిన పాయం ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని అన్నారు.

# ఏం.. సదివేటట్టు లేదు..!

## - భారీ వర్షాలకు తిప్పనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలోకి చేరిన వరద నీరు



**చంద్రుగొండ జులై 21(జనంసాక్షి ):**
వానకాలం చదువులు వంట వంటపట్టవంటారు ఇందుకేనేమో... గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అనేక గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు దుర్భర పాఠాలు బోధి స్తున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పక్కనే ఆనుకుని ఉన్న ప్రాథమిక పాఠశాలల దౌర్భాగ్యస్థితులు చూస్తుండ´గానే తిప్పనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలోకి శనివారం వరద నీరు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిప్పనపల్లి ముస్లిం కాలనీ లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శు క్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తరగతి గదిలోకి వరద నీరు చేరింది. పిల్లలు కూర్చొని చదివే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్దకు చేరుకొని పాఠశాల దుస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు చూపు లేకుండా గతేడాది మట్టి తోలకాలు జరిపారని అప్పుడు ఇదే పరిస్థితి జరిగితే అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థులతో కలిసి వరద చేరిన క్లాస్ రూమ్ లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలియ పరుస్తామన్నారు.



# నాణ్యమైన విద్యాబోధన అందించాలి

## పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలి

## మూసి ప్రాజెక్టు నీటి నిల్వల పరిశీలన

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
విద్యార్థులకు మంచి ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సూర్యాపేట మండలం లోని మూసి ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వల, సామర్థ్యతను పరిశీలించారు. గేట్ల పనితీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పై ప్రాంతాలలో వరదలు పడుచున్నందున ఇరిగేషన్, రెవెన్యూ, పిఆర్,పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం టేకుమట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి ఆహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించాలని అన్నారు. ఉపాధ్యా యులు విధుల పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. వర్షాలు పడుచున్నందున ఎప్పడికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అన్నా రు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలని సూ చించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, ఇరిగేషన్ డిఈ వేణు గోపాల్, ఏఈ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి సహాయ కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం జూలై 20 (జనంసాక్షి):**
జిల్లాలోని రైతులకు ఇబ్బంది లేకుండా ధరణి సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ధరణి సహాయ కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ధరణి సహాయ కేంద్రమును శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదు దరఖాస్తు నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించి, ధరణి సంబంధిత సమస్యల పైనే ఎక్కువ మంది బాధితులు వస్తుండడంతో వాటిని పరిష్కారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ధరణిలో తమ సమస్యలకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సహాయ కేంద్రం లో సమాచారం అందిస్తామని తెలిపారు. రైతు సమస్య ను తెలుసుకొని, దానికి ఏఏ పద్ధతిలో అప్లై చేయాలి, ఏయే ఆధారాలను అందించాలనే విషయాన్ని సిబ్బంది వివరిస్తారు. అలాగే అప్లికేషన్ రిజెక్ట్ కాకుండా రైతులు ప్రతి చిన్న పనికి పదే పదే అధికారుల చుట్టూ తిరగకుండా ఈ విధానాన్ని అమలుచేస్తున్నామని చెప్పారు. మీ సేవా కేంద్రాల ద్వారా రైతులు సరైన నమూనా లో దరఖాస్తు చేసుకోకపోవడం, దరఖాస్తుకు సంబంధించి సరైన ఆధారాలను చూపించక పోవడం వలన అధికారులు పరిశీలన సమయంలో వాటిని తిర్కరిస్తున్నారని దీంతో రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోందని, అందుకోసం దరఖాస్తు చేసే సమయం లోనే రైతులను సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ లు ఉపయోగ పడుతాయని వివరించారు. ధరణి సహాయ కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉండేలా కంప్యూటర్ ఆపరేటర్ ను నియమించామని, అప్లై చేసుకునే విధానంతో పాటు, దరఖాస్తు చేసుకున్న తర్వాత అప్లికేషన్ల స్థితిగతులను ను కూడా తెలుసుకోవచ్చుని అన్నారు ఒకవేళ అప్లికేషన్ రిజెక్ట్ అయితే, ఎందుకు రిజెక్ట్ అయిందనే కారణం కూడా సిబ్బంది చెప్పుతారని కలెక్టర్ తెలిపారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లకూడదు

## కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
భారీ వర్షాలకుఅధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శు క్రవారం వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం ఉన్నందు వల్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అధికారి తమ విధులు నిర్వహించే కార్య స్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో పురాతన ఇళ్లను గుర్తించి ఆ ఇళ్లలో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా రోడ్లపై ప్రవాహాలు ప్రవహిస్తున్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామపంచాయతీ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రవాహాలు జరిగే చోట సిబ్బందిని పెట్టాలన్నారు. ప్రజలు గుర్తించేలా ఎర్రజెండాలు, డేంజర్ బోర్డు, ఫ్లెక్సీలను వాగులు, కల్వర్టుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను పెట్టాలని సూచించారు. చేపల వేటకు వెళ్లరాదని, అత్యవసర పరిస్థితుల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్యశాఖ ఏడిని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు పాత పాఠశాలలు, శిథిలమైన భవనాలు గుర్తించి తాళం వేయాలని డీఈఓ అశోక్ ను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు వర్షాల వల్ల పడిపోయి నట్లయితే వెంటనే తొలగించే విధంగా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్యశాఖ అధికారులు గ్రామాలలో వేలాడు తున్న కరెంటు వైర్లను సరి చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదే శించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులను నిరంతరం పరివేక్షిస్తూ పట్టణాలను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులు గ్రామంలో అందుబాటులో ఉండాలని కమిషనర్లకు, పంచాయతీ సెక్రెటరీ ఆదేశించారు. ఏఎన్ఎం స్థాయి నుండి మెడికల్ ఆఫీసర్ వరకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగు చర్యలు తీసు కోవాలని అన్నారు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 6281492368 కు కాల్ చేయాలని తెలిపారు. వర్షాల కారణంగా జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా అందుబాటు లో ఉండాలని అన్నారు.

# హడలెత్తిస్తున్న జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## రోజుకో అధికారిసస్పెండ్ - వ్యవసాయ శాఖ ఏవో సస్పెండ్



**నలగొండ బ్యూరో,జులై 20,(జనం సాక్షి)**
ఔత్సాహిక కలెక్టర్లు కొందరు విధి నిర్వాహణలో తమదైన ముద్ర వేస్తూ ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిసున్నారు. ఈ వరుసలో కామారెడ్డి, నల్లగొండ కలెక్టర్లు ముందున్నారు. మొన్నటి వరకు తరుచు జిల్లా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలు సాగించిన నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, నిన్న హాలియా ప్రభుత్వాసుపత్రి తనిఖీ చేశారు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతుల నిర్వాహణను, బోధన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలడిగారు. శనివారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో తనిఖీ నిర్వహించి మూడు రోజులుగా విధులకు హాజరుకాని పరిపాలన అధికారి అబ్దుల్ మన్నన్ సస్పెండ్ చేశారు. లాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, కనీసం సెలవు సైతం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎవరిని వదిలిపెట్టమని, ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, సమయపాలన పాటించాలని, లేదంటే సస్పెన్షన్లు తప్పవని హెచ్చరించారు. రైతు రుణమాఫీపై కార్యాలయానికి వచ్చే రైతులకు సహాయం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో తక్షణమే రెండు కంప్యూటర్లు, రెండు ఫోన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇద్దరు ఆపరేటర్లు, ఇద్దరు సహాయకులు, ఫోన్లు స్వీకరించేందుకు ఇద్దరు, మరో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు ప్రత్యేకించి కాల్స్ నమోదు చేసేందుకు మరో ఇద్దరు మొత్తం ఎనిమిదిని తక్షణమే ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. పంట రుణమాఫీకి సంబంధించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కార్యాలయానికి వచ్చిన రైతులను వ్యవసాయ అధికారి దగ్గరికి వెళ్లాలని సాకులు చెప్పి పంపించవద్దని హెచ్చరించారు. వెంటనే కంప్యూటర్‌లో లాగిన్ అయ్యి రైతుకు డబ్బు ఎందుకు జమ కాలేదో చెప్పాలని సూచించారు. రైతు రుణమాఫీ పై జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. రుణమాఫీ డబ్బులు జమకాలేదని కార్యాలయానికి వచ్చిన చింతమల్ల సందీప్ కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే రైతు సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ ఏడీ హుస్సేన్ బాబును ఆదేశించారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి వస్తానని చప్పారు. తన ఆకస్మిక పర్యటనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నల్గొండ జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

## అక్రమ గంజాయిని విక్రయిస్తున్న అయిదుగురు నిందితులని అరెస్ట్ చేసిన నల్లగొండ జిల్లా పోలీసులు : జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

## మునుగోడు పోలీసు స్టేషన్లో పెట్టిన ప్రెస్ మీట్ లో వివరాలను తెలిపిన ఎస్పి




**నల్గొండ, జులై 20 (జనంసాక్షి):**
తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తు తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో బాగంగా నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడంలో బాగంగా వారి ఆదేశాల ప్రకారం నల్లగొండ డి.ఎస్.పి పర్యవేక్షణలో లక్ష్మి దేవిగూడెం రోడ్ ప్రక్కన గల పశువుల సంతలోని షెడ్ వద్ద ఐదుగురు వ్యక్తులు గంజాయి అమ్ముచున్నారన్న అని నమ్మదగిన సమాచారం మేరకు, మునుగోడు యస్.ఐ సిహెచ్. వెంకటేశ్వర్లు మరియు వారి సిబ్బంది తో యుక్తముగా ఉదయం దాదాపు 8.30 గంటల లక్ష్మీదేవి గూడెం వద్ద ఐదుగురు వ్యక్తులు రెండు మోటార్ సైకిల్ లతో పశువుల సంత లోని షెడ్ అనుమానాస్పద స్థితిలో ఉండగా యస్.ఐ తన సిబ్బందితో యుక్తంగా పట్టుబడి చేసి, విచారణ చేయగా హైదరాబాద్ లోని ధూల్ పేట్ చెందిన గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర ఐదు ప్యాకెట్లు లలో 200 గ్రాములు రూ. 2,000/- ల చొపున మొత్తం రూ.10,000/- గంజాయిని కొనుగోలు చేసి, మోటార్ సైకిల్ పై లక్ష్మి దేవిగూడెం రోడ్ ప్రక్కన గల పశువుల సంత లోని షెడ్ వద్దకు తీసుకవచ్చి, వారి స్నేహితులకు తెలియపరిచగా, వారు అక్కడికి రాగా, వారు అట్టి గంజాయిని 200 గ్రాములు, చొప్పున తీసుకొని, గంజాయి త్రాగే వ్యక్తులకు అమ్ముదామని తీసుకపోవడానికి సిద్దంగా ఉండగా, పోలీస్ వారు పట్టు బడి చేసి, వారి వద్ద నుండి అందాజ 1000 గ్రాములు గంజాయిని, గంజాయి రవాణా చేయుటకు ఉపయోగించిన 4 సెల్ ఫోన్ లను స్వాదిన పరుచుకున్నారు. ఇట్టి వ్యక్తులు తక్కువ ధరకు గంజాయిని దూల్పెట్, హైదరాబాద్ నందు గుర్తు తెలియని వ్యక్తుల నుండి కొనుగోలు చేసి, మునుగోడు చుట్టు ప్రక్కల వారకి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇందులో బాగముగా 35 మంది భాదితులను గుర్తించి, వారిలో కొంత మందికి పరీక్షలు చేయగా గంజాయి సేవించినట్లుగా వచ్చినది మరియు అందరికి కౌన్సిలింగ్ చేయనయినది. ఇట్టి గంజాయిని కేసును ఛేదించిన నల్లగొండ డియస్పి కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో చండూర్ సి.ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో, మునుగోడు యస్.ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది రమేశ్, నర్సింహా, వెంకన్న, నాగేశ్వర రావు, ఆంజనేయులు, జానీ, మోహన్ లను జిల్లా యస్.పి అభినందించారు.

# విపణి

## కర్ణాటకలో టెకీల పని గంటల పెంపు ప్రతిపాదన..

### వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బెంగళూరు: ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగుల పని గంటలు పెంచే ప్రతిపాదనపై కర్ణాటక ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందుకోసం కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1961లో కొన్ని మార్పులు చేయాల్సిఉంటుంది.

ఈ ప్రతిపాదనపై ట్రేడ్ యూనియన్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈమేరకు కర్ణాటక స్టేట్ ఐటీ/ ఐటీ ఆధారిత సేవలు అందించే ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) ప్రతినిధులు కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్‌ను కలిసి తమ వ్యతిరేకతను తెలియజేశారు.


ప్రతిపాదనల ప్రకారం ఐటీ/ఐటీఈఎస్/ బీపీఓ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు రోజులో 12 గంటలకు మించి పని చేసేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుంది. రోజులో గరిష్ఠంగా 14 గంటల చొప్పున పని చేయడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఓవర్‌టైమ్‌తో కలిపి గరిష్ఠంగా 10 గంటలు మాత్రమే పని చేయించేందుకు అనుమతి ఉంది. అయితే, వరుసగా మూడు నెలల్లో ఉద్యోగి చేత 125 గంటలకు మించి అదనపు గంటలు పని చేయించుకోకూడదన్నది ఇందులోని మరో కీలక అంశం. పని గంటల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని, దీనిపై చర్చలు ఇంకా నడుస్తున్నాయని కార్మిక శాఖ మంత్రి 'ది హిందూ'తో పేర్కొన్నారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

ఈ ప్రతిపాదనను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉద్యోగి రోజులో గరిష్ఠంగా ఎన్ని గంటలు పని చేయాలనే దానిపై కటాఫ్ అంటూ ఏదీ లేదని కేఐటీయూ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. 125 గంటల గరిష్ఠ పరిమితి వల్ల కంపెనీలు ఉద్యోగులతో తమకు కావాల్సిన రోజులు/ వారాల్లో నిర్దిష్ట పరిమితికి లోబడి పని చేయించుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం వారంలో 48 గంటలకు మించి పని చేయించకూడదని కార్మిక చట్టాలు చెబుతున్నాయన్నారు. పని గంటల పెంపు వల్ల ఉద్యోగులు మరింత మానసిక, శారీరక ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తంచేశారు. అయితే, విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేస్తామని కార్మిక శాఖ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.



# కార్పొరేట్లకు బ్యాంక్ లైసెన్సులు ఇవ్వం

## ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబయి: బ్యాంకులను ఏర్పాటు చేసేందుకు కార్పొరేట్ సంస్థలను అనుమతించే ఆలోచనేదీ ప్రస్తుతానికి లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. బ్యాంకులు ఇతర వ్యాపారాల కంటే భిన్నమైనవని, వీటి ఏర్పాటుకు కార్పొరేట్ సంస్థలను అనుమతిస్తే.. వాటి ఆసక్తి, లావాదేవీల మధ్య వైరుధ్యాలు ఏర్పడతాయని, ఇది బ్యాంకింగ్ వ్యవస్థకు మంచిది కాదని శుక్రవారం ఒక సమావేశంలో దాస్ పేర్కొన్నారు. 'భారత్‌కు కావాల్సింది బ్యాంకుల సంఖ్య పెరగడం కాదు. మంచి ఆరోగ్యకర, సుపరిపాలన ఉన్న బ్యాంకులు కావాలి. సాంకేతికత ద్వారా దేశ వ్యాప్తంగా పొదుపు మొత్తాలను సమీకరించడం, రుణాల అవసరాలను ఇప్పుడున్న బ్యాంకులు తీర్చగలవు' అని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధిని సాధించేందుకు అవసరమైన వనరులున్నాయని, మరిన్ని బ్యాంకుల అవసరం అంతగా లేదని పేర్కొన్నారు. ప్రైవేటు రుణాలు వేగంగా పెరుగుతున్నాయని, వీటిని ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. డిపాజిట్లు, రుణాల మధ్య సమన్వయం సాధించాల్సిన అవసరం బ్యాంకులకు ఉందని వివరించారు. గృహ పొదుపు మొత్తాలు, బ్యాంకుల్లో డిపాజిట్లుగా వచ్చే బదులు మ్యూచువల్ ఫండ్లలోకి అధికంగా వెళ్తున్నాయని దాస్ తెలిపారు. డిపాజిట్ల వృద్ధికి మించి, రుణాల వృద్ధి పెరిగితే ఇబ్బందులు ఏర్పడొచ్చన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర: కొవిడ్ పరిణామాల తర్వాత ఆర్థిక వృద్ధి కోసం ప్రభుత్వంతో కలిక ఆర్‌బీఐ ఎంతో సమన్వయంతో సమర్థంగా పనిచేసిందని దాస్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.2% వృద్ధిరేటు సాధిస్తామనే అంచనాలపై సానుకూలంగా ఉన్నట్లు వివరించారు. లక్షిత ద్రవ్యోల్బణం 4 శాతానికి చేరుకునేందుకు అవసరమైన మార్గంలోనే కదులుతున్నట్లు పేర్కొన్నారు.

# ఐటీఆర్‌ను ఇలా ఈ-వెరిఫై చేయండి..

ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలును కచ్చితంగా వెరిఫై చేయాల్సి ఉంటుంది. లేదంటే ఐటీఆర్ చెల్లదు. వెరిఫికేషన్ పూర్తి చేయడానికి ఈ-వెరిఫై ఆప్షన్ సులభమైన ప్రక్రియ.

దీన్ని వివిధ మార్గాల్లో పూర్తి చేయొచ్చు. అవేంటో చూద్దాం..

రిటర్నులు దాఖలు చేసే సమయంలో..

ఆధార్ ఓటీపీ ద్వారా..

ఈ-ఫైలింగ్ పోర్టల్‌కు లాగిన్ అవ్వాలి.

'ఈ-ఫైల్' ట్యాబ్‌పై క్లిక్ చేసి డ్రాప్ డౌన్ నుంచి 'ఆదాయ పన్ను రిటర్న్'ను ఎంచుకోవాలి.

'అసెస్‌మెంట్ ఇయర్', 'ఐటీఆర్ ఫారమ్ పేరు' 'సబ్మిషన్ మోడ్'ను ఎంచుకోవాలి. 'కంటిన్యూ'పై క్లిక్ చేయాలి.

ధృవీకరణ మాధ్యమాన్ని 'ఆధార్ ఓటీపీ'గా ఎంచుకోవాలి.

డాక్యుమెంట్‌ని అప్‌లోడ్ చేసి రిటర్నులు సమర్పించాలి.

'జనరేట్ ఆధార్ 'ఆధార్ ఓటీపీ' పై క్లిక్ చేయాలి. రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ' వస్తుంది. అది 30 నిమిషాల వరకు మాత్రమే పనిచేస్తుంది.

'ఆధార్ ఓటీపీ' ని నమోదు చేసి, సబ్మిట్‌పై క్లిక్ చేస్తే వెరిఫికేషన్ పూర్తయినట్లే.

**నెట్ బ్యాంకింగ్ ద్వారా..**

నెట్‌బ్యాంకింగ్‌లోకి లాగిన్ అవ్వాలి

ఈ-ఫైలింగ్ లింక్‌పై క్లిక్ చేయాలి.

ఐటీ ఈ-ఫైలింగ్ సైట్‌లోకి వెళ్తారు.

డాక్యుమెంట్‌ని అప్‌లోడ్ చేసి రిటర్నులను సమర్పిస్తే ఈ-వెరిఫికేషన్ పూర్తయినట్లే.

**బ్యాంకు ఖాతా ద్వారా..**

ఈ-ఫైలింగ్ పోర్టల్‌కు లాగిన్ అవ్వాలి.

'ప్రొఫైల్ సెట్టింగ్స్', & 'ప్రీ-వ్యాలిడేట్ యువర్ బ్యాంక్ అకౌంట్'ను ఎంచుకోవాలి.

ధృవీకరణ మాధ్యమాన్ని 'ఈవీసీ యూజింగ్ ప్రీ-వ్యాలిడేటెడ్ బ్యాంక్ అకౌంట్'ను ఎంచుకోవాలి.

బ్యాంకు ఖాతాతో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు %యీూ% వస్తుంది. అది 72 గంటల వరకు చెల్లుబాటవుతుంది.



ఐటీఆర్ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.

ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ఈవీసీ ఎంటర్ చేస్తే ఈ-వెరిఫికేషన్ పూర్తయినట్లే.

వీటితో పాటు దాదాపు ఇదేతరహాలో డీమ్యాట్ ఖాతా, బ్యాంక్ ఏటీఎం ద్వారా కూడా ఈ-వెరిఫై చేయొచ్చు.

**రిటర్నులు దాఖలు చేసిన తర్వాత..**

ఇ-ఫైలింగ్ పోర్టల్‌కి లాగిన్ అవ్వాలి.

'మై అకౌంట్'పై క్లిక్ చేసి డ్రాప్ డౌన్‌లో 'ఇ-వెరిఫై రిటర్న్' ఎంచుకోవాలి.

దాఖలు చేసిన ఐటీఆర్‌లలో వెరిఫికేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నవన్నీ కనిపిస్తాయి. వెరిఫై చేయాల్సిన ITR వద్ద ఉన్న ఈ-వెరిఫై లింక్‌పై క్లిక్ చేయాలి.

అందుబాటులో ఉన్న ఆప్షన్ల నుంచి ఈ-వెరిఫికేషన్ మాధ్యమాన్ని ఎంచుకోవాలి.

ఎంచుకున్న మాధ్యమం ద్వారా ఈవీసీ జనరేట్ చేయాలి.

ఈవీసీని ఎంటర్ చేసి సబ్మిట్‌పై క్లిక్ చేయాలి.

ఐటీఆర్ వెరిఫికేషన్ పూర్తవుతుంది.

రిటర్నులు దాఖలు చేసిన తర్వాత 30 రోజుల్లోగా ఈ-వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే అది చెల్లుబాటు కాదు. ఫలితంగా ఐటీఆర్‌ను పరిగణనలోకి తీసుకోవడం కుదరదు. దీంతో మీరు ఐటీఆర్ సమర్పించనట్లే అవుతుంది. సరైన కారణం ఉంటే 'కండోనేషన్ రిక్వెస్ట్' ద్వారా అభ్యర్థించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను విభాగం దాన్ని అంగీకరిస్తే మీ రిటర్నులను వెరిఫై చేసినట్లుగా భావించి తనిఖీకి పరిగణనలోకి తీసుకుంటారు. లేదంటే ఐటీఆర్ సమర్పించనట్లుగా భావించి తగిన చర్యలు తీసుకుంటారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.2 | ₹ 5.22 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

| | 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹67,800 | ₹73,970 |
| చెన్నై | ₹68,350 | ₹74,570 |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్ ₹ 96,000

## అనకాపల్లి- రాజమండ్రి రహదారి విస్తరణ

### ఎన్నికల హామీల అమలుకు కృషి: సిఎం రమేశ్

**అనకాపల్లి,జూలై20 (జనంసాక్షి):** అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు జాతీయ రహదారి అరులైన్లు విస్తరించేలా త్వరలో చర్యలు తీసుకుంటామని ఎంపీ సీఎం రమేష్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చోడవరం - మాడుగుల నియోజక వర్గాల మధ్య 5000 ఎకరాలతో సెజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే నక్కపల్లిలో సెజ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో మంత్రులను కలుస్తామని చెప్పారు. ఎంపీ ల్యాండ్ నిధులతో అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని 1000 గ్రామాలకు పైగా ఆర్వో ఎలాంట్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ సీఎం రమేష్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో దాడులు ఆపాలి

### హత్యలపై పార్లమెంటులో లేవనెత్తుతాం

### రాజ్యసభ వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

**అమరావతి, జూలై 20 (జనంసాక్షి):** నెల రోజుల టీడీపీ పాలనలో జరిగిన హత్యలు, దాడులపై పార్లమెంట్‌లో గళమెత్తుతామని రాజ్యసభ వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. ఏపీలో వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినుకొండలో వైసీపీ నేత రషీద్ హత్యను ఎంపీ ప్రస్తావించారు. బాధితుణ్ని కత్తితో చేతులు నరికి, తీవ్రంగా గాయపరిచి చంపడం దారుణం అని ఎంపీ అన్నారు. వైసీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేయకుండా సీఎం చంద్రబాబే వారి పార్టీ కేడర్‌ను ఆపాలన్నారు. ఈనెల 22నుంచి జరిగే ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో పరిస్థితులపై వైసీపీ ఎమ్మెల్యేలు నిరసన తెలపనున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఏపీలో జరిగే దాడులను దేశ ప్రజలకు సైతం తెలియజేస్తామని అయోధ్య రామిరెడ్డి అన్నారు. అందు కోసం ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేస్తామని ఎంపీ వెల్లడించారు. ఏపీ పరిస్థితులు వివరించేందుకు ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అపాయింట్మెంట్ కోరినట్లు తెలిపారు. ఈనెల 24న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేసే ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామని అయోధ్య రామిరెడ్డి చెప్పుకొచ్చారు. అయితే ఏపీలో శాంతిభద్రతలు అదుపుతప్పాయంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తామంటూ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి పరామర్శించారని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులపై ఢీల్లీలో ధర్నా చేసి అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి రాష్ట్ర పరిస్థితులపై వివరిస్తామని చెప్పారు. రాష్ట్రపతి పాలనకు సైతం డిమాండ్ చేయనున్నట్లు ఎంపీ అయోధ్య రామిరెడ్డి వెల్లడించారు.

## వర్షాలతో పునరావాస గ్రామాల్లో ఆందోళన

### వరద ఉధృతి వస్తుందన్న భయంతో జీవనం

**జంగారెడ్డిగూడెం, జూలై 20 (జనంసాక్షి):** గోదావరి, శబరి నదుల ప్రవాహ ఉధృతికి పోలవరం నిర్వాసిత మండలాలైన విఆర్.పురం, చింతూరు, ఎటపాక, కూనవరంలో గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. వరద పెరిగితే గతేడాది లాగే మళ్లీ జలదిగ్బంధం తప్పదన్న ఆందోళనలో ఉన్నారు. వరదలకు పోలవరం నిర్మాణంలో లోపాలే కారణమని అంటున్నారు. గతేడాది ఎగువున కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగిన గోదావరి పోలవరం నిర్వాసిత మండలాలను నిలువునా ముంచేసింది. గతంలో ఎంత వరద వచ్చినా త్వరగానే తగ్గిపోయేదని ప్రస్తుతం తెలియని పరిస్థితి ఉందని ఎటపాక వాసులు వాపోయారు. వరద ప్రభావం ఇంతలా పెరగడానికి ప్రణాళిక లేని పోలవరం నిర్మాణమే కారణమని బాధితులు అంటున్నారు. ప్రభుత్వం నుంచి అందే సహకారం అంతంత మాత్రంగానే ఉందని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి వరద ప్రాంతాల్లోని ముంపుకు గురైన లంక గ్రామాలు, పునరావాస కేంద్రాల్లో సహాయక చర్యలు తీసుకోవాల్సి ఉంది. వరదల కారణంగా అల్లాడుతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రత

### ప్రజల్లో ఆగ్రహానికి దారితీసేలా అరాచక పాలన

### పార్లమెంటులో అరచాకాలపై గళమెత్తండి

### రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేయండి

### ఎంపిల సమావేశంలో వైఎస్ జగన్ సూచన

**అమరావతి, జూలై 20 (జనంసాక్షి):** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో తీవ్ర వైఫల్యం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీని అణగదొక్కడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్యం కాదని, పైగా ఈ అరాచక పాలన ప్రజల్లో ఆగ్రహానికి దారి తీస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో హత్యలు, దాడులు, ఇతర హింసాత్మక ఘటనలపై పార్లమెంటులో గళమెత్తాలని పార్టీ ఎంపీలకు సూచించారు. రాష్ట్రపతి పాలనకు డిమండ్ చేయాలని ఎంపీలకు జగన్ సూచించారు. చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికల పంపాలని తెలిపారు. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదన్నారు. రేపు అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామన్నారు. బుధవారం నాడు ఢిల్లీలో నిరసన తెలుపుతామన్నారు. ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రుల అపాయింట్‌మెంట్లను కోరానని... అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీమీద దాడులు చేయడం అనేది ధర్మమా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దారుణంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన పరాకాష్ట. వీడియో దృశ్యాలు చూస్తే.. ఈ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా జరుగుతున్నాయి. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద కత్తితో జరిగిన దాడి అత్యంత అమానుషం. అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది. రషీద్ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జరిగిన ఘటనను వక్రీకరించడానికి ఎల్లోమీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, జరిగిన దారుణహత్యకు ముడిపెట్టే ప్రయత్నంచేస్తున్నారు. కాలిన బైక్.. వైఎస్సార్‌సీపీ వాళ్లది, దీనికి సంబంధించిన కేసు కూడా నమోదయ్యింది. దాన్ని ట్విస్ట్ చేసి నానా తప్పుడు రాతలు రాస్తున్నారు.' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరగుతున్నాయన్నారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన పరాకాష్ట అన్నారు. వీడియో దృశ్యాలు చూస్తే ఈ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా జరుగుతున్నాయో తెలుస్తుందన్నారు. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద కత్తితో జరిగిన దాడి అత్యంత అమానుషమన్నారు. రాజకీయ ప్రత్యర్థులకు, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది అంటూ మాజీ సీఎం విరుచుకు పడ్డారు. జరిగిన ఘటనను వక్రీకరించడానికి ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటి వరకు 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారన్నారు. వేయికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయన్నారు. తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారన్నారు. టీడీపీ మనుషులను అక్కడ కావాలని ఉంచేలా పోలీసులతో ఎ÷-లాన్‌చేసి దాడులు చేశారని అన్నారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, న్యాయవాది అయిన రెడ్డప్ప ఇంటికి వెళ్తే దాడులు చేశారన్నారు. తప్పులు వారు చేసి తిరిగి వైసీపీ వాళ్లమీద కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుందన్నారు. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీకి, ఒక్కో బాధ్యత అప్పగించాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. గత ఎన్నికల్లో మనం 86శాతం సీట్లను గెలిచామన్నారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు... ఓటు వేయని వారికి కూడా ఇంటింటికీ వెళ్లి పథకాలు ఇచ్చామన్నారు. ప్రజలిచ్చిన వాగ్దానాల అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం బాధ్యత అని చెప్పుకొచ్చారు. కార్యకర్తలందరి తరపున గట్టిగా నిలబడాలన్నారు. రాష్ట్రంలో వైయస్సార్‌సీపీకి లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని... వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 'మన పోరాటం ద్వారా గట్టి ఒత్తిడి తీసుకురావాలి' అని ఎంపీలకు జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశర చేశారు.



# జాతీయం అంతర్జాతీయం



## కులగణనతో సామాజిక విభజన

### ఇందులో అనేక సమస్యలు ఉన్నాయి

### కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ,జూలై20 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని కొంతకాలంగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కులగణనపై స్పందించిన కేంద్రమంత్రి, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాసవాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో కులగణన చేపట్టేందుకు మద్దతు తెలిపారు. కానీ, అది సమాజ విభజనకు దారి తీస్తుందన్నారు. అందుకే వాటి సమాచారాన్ని బహిర్గతం చేయకూడదని హెచ్చరించారు. కమ్యూనిటీ ఆధారిత అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపు కోసం నిర్దిష్ట డేటా తరచూ అవసరమవుతోంది. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడం లోనూ ఈ డేటా ఉపయోగపడుతుంది. కులగణన నిర్వహించడం అవసరమే. కానీ, ఇందులో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. కులగణన ద్వారా సమాజంలో విభజన ఏర్పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ గణాంకాలను బయటకు తీసుకురావడం అంత మంచిది కాదు. ఎన్డీయే ప్రభుత్వంలో దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని విలేకరుల సమావేశంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని భారత్‌లో చూడవచ్చు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో కనుక చూస్తే కొందరు ఆదివాసీలు వీటికి దూరంగా ఉంటున్నారు. అలాంటి వారందరినీ ఒకే గొడుగు కిందకి తీసుకురాగలమా? కులగణనకు ముందు ఒక ముసాయిదా తీసుకురావాల్సి ఉంటుంది. దాన్ని పరిశీలించి కీలక నిర్ణయాలు తీసుకోవాలి. అది వచ్చేంత వరకు నేనేమీ మాట్లాడలేను అని పేర్కొన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## పల్లె దవాఖాన నిర్మాణ పనులు వేగవంతం



**ఎల్లారెడ్డిపేట, జూలై 20, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలో గల కిష్టంపల్లిలో పల్లె దవాఖానా నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఇట్టి నిర్మాణం కోసం 18లక్షల వరకు జాతీయ మిషన్ ఆరోగ్య పథకం కింద (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నిధులు మంజూరు చేయడానికి కృషిచేశారు. పల్లె దవాఖానా కోసం జరుగుతున్న నిర్మాణ పనులను మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ పరిశీలించారు. పల్లె దవాఖానాలో షుగర్, బిపి, గర్భవతులకు, బాలింతలకు సంబంధించిన పరీక్షలు ఇందులో చేయనున్నారు. దీని ద్వారా మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపల్లె, కిషన్‌దాస్‌పేట రెండు గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి. ఇందులో వైద్యుడి గది, ఫార్మసిస్ట్ గది, స్టోర్ రూం. అదేవిధంగా దవాఖానకు వచ్చే వారి కోసం మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు నెలలో ఇట్టి పల్లె దవాఖానా వినియోగంలోకి రానుంది. ఇంకా పల్లె దవాఖానకు చుట్టూ ప్రహరీగోడ, బోర్ మోటార్ అవసరముందని, ఈ విషయాన్ని ప్రభుత్వంవిప్ అది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి గారికి దృష్టికి తీసుకెళతానని మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్ తెలిపారు. పల్లె దావాఖానా స్థానికంగా అవసరముందని గుర్తించి దీనిని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఉపసర్పంచ్ దంపతులు ఒగ్గు బాలరాజు యాదవ్ పనులు శరవేగంగా పూర్తి చేస్తున్న కాంట్రాక్టర్ రాధారపు శంకర్‌కు కిష్టంపల్లె, కిషన్ దాస్‌పేట ప్రజలు అభినందించారు. మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్, వెంట యూత్ కాంగ్రెస్ మండల నాయకులు బుచ్చి లింగు సంతోష్ గౌడ్, మందాటి లక్ష్మణ్, పయ్యావుల రాజు యాదవ్, ఏనుగుల దేవయ్య, గుడి విఠల్‌రెడ్డి, ఇట్టం అంజయ్య యాదవ్, మొగుళ్ళ శ్రీనివాస్‌యాదవ్, అందె శేఖర్‌లు ఉన్నారు.

## రైతుల రుణమాఫీపై బిఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్ధరహితం



**ఎల్లారెడ్డిపేట, జూలై 20, (జనంసాక్షి) :** రైతుల రుణమాఫీపై బిఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్ధరహితమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడిసిసి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు చేసిన విమర్శలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పూర్తిగా అబద్దాలు మాట్లా డుతూ రైతులపై వారికున్న వ్యతిరేకతను వ్యక్తపరచడం జరిగిందన్నారు. ఒకవైపు సంబరాలను హర్షిస్తున్నామంటూ రుణమాఫీలో ఉన్న నిబంధనలను రైతులకు వ్యతిరేకంగా ఉన్నట్లు చిత్రీకరించటం జరిగిందన్నారు. రుణమాఫీ పొందిన రైతు జాబితాలు ఆయా గ్రామ పంచాయతీల గోడలకు వ్యవసాయ అధికారులు పెట్టడం జరిగిందన్నారు. జాబితాలు ప్రదర్శించలేదని తప్పుడు ఆరోపణ చేయడం సరైందికాదన్నారు. రుణమాఫీకి పూర్తిస్థాయిలో 42 వేల కోట్లు అవసరం కాగా కేవలం 6098 కోట్లు మాత్రమే విడుదల చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాక్షాత్తు రైతు వేదికల సాక్షిగా ప్రకటించిన మొత్తం ప్రకటించినట్టుగా అబద్ధం ఆడడం జరిగినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ పొందిన రైతులు సంబరాలు చేస్తూ ఉంటే మొత్తం మాఫీ జరిగిన తర్వాతనే సంబరాలు చేసుకోవాలని అనడం సిగుచేటు అన్నారు. ఆగస్టు 15 లోపల పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని యాదగిరి నరసింహాస్వామి మీద ఒట్టెసి చెప్పిన ముఖ్యమంత్రి అంత దైర్యం గల వ్యక్తి చెప్పినప్పటికి, మాఫీ కాదని మీకెందుకు అనుమానమని అన్నారు. రైతులు కాంగ్రెస్ పార్టీ వైపు చేరిపోతున్నారని అంతర్గతంగా బిఆర్ఎస్ నాయకులు మదన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఒక పాలసి తీసుకుందని రైతులకు ఎన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలని, రైతుల నిర్ణయం మేరకే రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగిందన్నారు. రైతులతో సమావేశాలను మంత్రులు ఏర్పాటు చేసి వారి ఆలోచనలను పంచుకోవడం జరుగుతుందన్నారు. రైతుల ఆలోచనకు తగ్గట్టుగా పడావు భూములు కాకుండా సాగులో ఉన్న భూమికి రైతు భరోసాను ఇస్తానని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికి మీరు ఎందుకంత హైరానా పడుతున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సాహేబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి ఏలూరి రాజయ్య, నాయకులు ఎండి ఇమామ్, పందిర్ల సుధాకర్ గౌడ్, సత్యనారాయాణ, గంట కార్తీక్‌గౌడ్, చెన్ని బాబు, పందిర్ల శ్రీనివాస్, గంట బుచ్చగౌడ్‌లు పాల్గొన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జిల్లాకు ఆరెంజ్ అలర్ట్**
**గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు**
**చెరువులు, వాగుల వద్దకు వెళ్ళద్దు**
**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**రాయికల్ జూలై 20 (జనంసాక్షి):** ప్రస్తుతం కూరుస్తున వర్షాలు దృష్ట్యా వాతావరణ శాఖ వారు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ అప్రమత్తం చేశారు. వర్ష సూచన ఉన్న దృష్ట్యా వాగులు పొంగిపొర్లి చెరువులు కుంటలు నిండుకుండ లాగా ఉన్నాయి కావున ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు వద్దకు పిల్లలు,యువత ఎవరూ చెరువుల వైపు వెళ్ళొద్దు అని అన్నారు. చెరువుల వద్ద, వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. వర్షానికి ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టి ఇండ్లు కూలిపోయే అవకాశం ఉంటుందని అందులో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం కు డయల్ 100 సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు,కుంటల నీటి ప్రవాహం గురించి అన్ని జాగ్రత్తలు తీసుకుని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. వర్షాల దృష్ట్యా కరెంటు స్తంభాల దగ్గర కు ఎవరు వెళ్లకూడదని అన్నారు.



## కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 20 (జనంసాక్షి)** వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ జిల్లా సాంస్కృతిక సమాఖ్య కళాకారుల జేఏసీ కమిటీ ముఖ్య కళాకారులు శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల జేఏసీ కమిటీ చైర్మను ఎల్లా పోశెట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ధూమ్ ధాం కళాకారులను అన్ని విధములుగా మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కళాకారుల కుటుంబాలు రోడ్డున పడి నానా ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వృద్ధ కళాకారులకు వృద్ధాప్య పింఛన్లు, రెండు గదుల ఇండ్లను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుల జిల్లా సమాఖ్య గౌరవాధ్యక్షులు బొడ్డు రాములు, జిల్లా అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాస్, వారాల దేవయ్య, బుర్రి శంకరయ్య, మానువాడ లక్ష్మీనారాయణ,గుమ్మడి రాజేశం గౌడ్,చిలుముల రమేష్ , సోమినేని బాలు, నాయని సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## నిరుద్యోగుల ధర్నాలో లీగల్ సెల్ కన్వీనర్ రేగుల రాజకుమార్..




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 20 (జనంసాక్షి):** నిరుద్యోగుల సమస్యలపై హైదరాబాద్ ఇందిరా పార్క్ లో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో రాష్ట్ర బిజెపి లీగల్ సెల్ కన్వీనర్,బీజేవైఎం రాష్ట్ర కోకన్వీనర్ రేగుల రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు జీవనభృతి చెల్లించాలని,గ్రూప్-2 పోస్టులను పెంచాలని, తదితర నిరుద్యోగ డిమాండ్లపై ధర్నా చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు.



## వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్సై శ్రావణ్ కుమార్**

**సుల్తానాబాద్,జూలై 20(జనంసాక్షి) :** వర్షాకాలం నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ సూచించారు. శనివారం మండలం లోని మానేరు పరివాహక ప్రాంతాలైన గర్రెపల్లి ,గొల్లపల్లి ,బొంతకుంటపల్లి ,నీరుకుల,కదంబపూర్ ,గట్టేపల్లి ,తొగర్రాయి గ్రామాల మానేరు పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపల వేట కొరకు గాని ఇతరత్రా పనుల నిమిత్తం మానేరు పరివాహక ప్రాంతాలను సందర్శించరాదని సూచించారు. నీటి ఎద్దడి ఎక్కువ అయితే ప్రాణాలకు ప్రమాదం కలుగుతుందని తగు జాగ్రత్తలు ప్రజలందరూ తప్పకుండా పాటించాలని ఎస్ఐ శ్రావణ్ కుమార్ సూచించారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు**



**సుల్తానాబాద్,జూలై 20(జనంసాక్షి) :** వర్షాకాలం దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని వార్డులను సందర్శించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని నీటి ప్రవాహం గల ప్రాంతాలలో జెసిబి తో సహాయక చర్యలను ప్రారంభించారు. సుల్తానాబాద్ మున్సిపల్ ప్రజలు వరద ప్రవాహంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న తనకు ఫోన్ చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వర్ష భావం దృష్ట్యా ప్రజలందరూ తగు జాగ్రత్తలు ఉండాలని కోరారు.

## రైతు రుణమాఫీ దేశానికే ఆదర్శం

- సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం
- సీఎం రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటాలకు పాలాభిషేకం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ప్రకాష్ రావు అన్నయ్య గౌడ్, శ్రీగిరి శ్రీనివాస్





**సుల్తానాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ రెండు లక్షల రూపాయలను చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మినుపాల ప్రకాష్ రావు ,అంతటి అన్నయ్య గౌడ్ ,సింగిల్ విండో చైర్మన్ కేడీసీసీ జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు అన్నారు. శనివారం ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా లక్ష రూపాయల రుణమాఫీని సీఎం రేవంత్ రెడ్డి నిధులు విడుదల చేయడాన్ని హర్షిస్తూ శనివారం సీఎం రేవంత్ రెడ్డి ,మంత్రి శ్రీధర్ బాబు ,ఎమ్మెల్యే విజయరామనారావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రైతు రుణమాఫీ రెండు లక్షల రూపాయలను చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే మొదటి విడతగా లక్ష రూపాయలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి రాజీనామాకు సిద్ధం కావాలని లేనియెడల రాజీనామా చేసేంతవరకు విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమమే ధ్యేయంగా బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాకముందు 6 గ్యారంటీ పథకాలు ఇచ్చిన హామీ అమలును తప్పకుండా చేసి తీరుతామని ఇప్పటికే చేశామని వారు స్పష్టం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తా రని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వేగోళం అబ్బయ్య గౌడ్ ,కల్వల శ్రీనివాస్, సాయి రీ మహేందర్, కల్లేపల్లి జానీ ,చిలుక సతీష్ ,తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20 (జనంసాక్షి)** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో ముఖ్య మంత్రి సహాయ నిది కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం మొదట దరఖాస్తు చేసుకున్న 35 మందికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 35 మందికి మొదటి విడతగా చెక్కులు వచ్చా యని అన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునే వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుండి, ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఇక పై వచ్చే ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను మండలాల వారీగా వచ్చి మండల కేంద్రాల్లో ఇస్తామని అన్నారు.



## అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన టైప్ రైటింగ్ పరీక్షలు

**ఎల్లారెడ్డిపేట, జూలై 20, (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ బోర్డు ద్వారా నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు శనివారం ఆగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ రాజగోపాల్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ మజీద్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వం టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం ఇంగ్లీష్, తెలుగు లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ రెండు బ్యాచులు నిర్వహించడం జరిగిందన్నారు. ఆదివారం యాథావిధిగా మరో నాలుగు బ్యాచులు జరుగుతాయన్నారు. టైప్ రైటింగ్ ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో ఉపాధి పొందడం సులభతరం అవుతుందన్నారు. కంప్యూటర్‌పై గంట వ్యవధిలో చేసే పనిని, టైపు పాసైన వారు కేవలం 15 నిమిషాల్లో పూర్తి చేయడం జరుతుందన్నారు. నిరుద్యోగులే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ పరీక్షలకు హాజరవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ మజీద్ తెలిపారు.

## ముదిరాజులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి..

**ఇబ్రహీంపట్నం, జులై 20,(జనసాక్షి):** ముదిరాజు మహాసభ ఆధ్వర్యంలో శనివారం నాడు ఎమ్మార్వో కి వినతి పత్రం అందించారు. ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు అన్ని రంగాలలో ఎక్కువ మొత్తంలో అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో , నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు సింహభాగం కేటాయించాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు పింఛన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు తోకల రాజేశ్వర్, రాంబాబు జగిత్యాల జిల్లా అధ్యక్షులు నీలం పెద్దులు నాయకులు నేమూరి సత్యనారాయణ చెగొండ శ్రీనివాస్ పిట్టల వంశీ నేమూరి నరేష్ యాజరాజ్ పెంద్యాల చిన్న సాయన్న బొల్లావేణి రాజేందర్ కొలకాని వెంకటి తోకల నరసయ్య గడ్డం శేఖర్ గుండాల అశోక్, గడ్డం సురేష్ గుండాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి..

**కథలపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికగా తనిఖీ చేసిన ఎస్పీ**



**జగిత్యాల బ్యూరో ,జూలై 20,( జనంసాక్షి)** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ శనివారం ఆకస్మికంగా కథాలాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడుంబా, గాంజా నివారణకు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేసుకొని నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై పై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఎస్పీ వెంట డిఎస్పి ఉమ మహేశ్వర రావు , సీ.ఐ సురేష్ ఎస్ఐ నవీన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు, నాణ్యమైన విద్యను అందించాలి

**విద్యార్థులకు బోధిస్తున్న అంశాల పై ఆరా**
**పాటశాలలోని వంటశాల, స్టోర్ సందర్శన**
**పాఠశాలను,ఆకస్మికంగా తనిఖీ**
**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



**జగిత్యాల బ్యూరో , జులై 20,(జనంసాక్షి):** విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్, బి,సత్య ప్రసాద్ అన్నారు. అనంతరం తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలని తరగతి గదిలోకి స్వయంగా వెళ్లి తెలుసుకున్నారు, అనంతరం పిల్లలతో పాటు కూర్చుని స్వయంగా పాటలు విని, విద్యార్థులకు అర్థమవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా 8,9, 10,తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు , బైలజీ, భౌతిక శాస్త్రం. విద్యార్థులకు గణితం, సబ్జెక్ట్ ల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయురాలని ఆదేశించారు. ఇప్పటినుండి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటినుండి పదవ తరగతి సిలబస్ పై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తయారీ విధానమును స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనము మెనూ ప్రకారం అందించాలని పేర్కోన్నారు. శుభ్రమైన తాగునీరు కూడా అందించాలని తెలిపారు. పాటశాల ఆవరణలోని , పరిసరాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయురాల, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకుని హాజరు పట్టిక మరియు సాధారణ సెలవు రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో, ఆర్డిఓ మధు సుదన్, డి ఈ ఓ, జగన్ మోహన్ రెడ్డి,డిపిఓ, దేవరాజు, సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయు రాలు , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియాకు కొత్త కోచ్‌లు

## గంభీర్ టీమ్ హిట్ అవుతుందా..?

పొట్టి ప్రపంచ కప్ విజేతగా భారత జట్టు ఆసియాలో తొలి పర్యటనకు సమాయత్తమవుతోంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ఆధ్వర్యంలో జూలై 21 సోమవారం భారత బృందం లంక విమానం ఎక్కనుంది. దాంతో, గంభీర్ కోచ్‌గా తొలి పరీక్షలో నూటికి నూరు మార్కులు కొట్టేసేందుకు వ్యూహాలు రచిస్తున్నాడు. ఇప్పటికే వన్డే, టీ20 స్క్వాడ్ ఎంపికలో తన ముద్ర వేసిన గౌతీ.. ఇప్పుడు తనకు నచ్చిన సహాయక కోచ్‌లను నియమించుకున్నాడు. అవును.. టీమిండియా సహాయక కోచ్‌లుగా అభిషేక్ నాయర్, రియాన్ టెన్ డస్చేట్‌లు, ఫీల్డింగ్ కోచ్‌గా టి. దిలీప్ కుమార్‌లు లంక పర్యటనకు వెళ్లనున్నారు. టీమిండియా కోచ్‌గా ఎంపికైన గంభీర్ తనకు నచ్చిన



టీమ్ కోసం పట్టుపట్టిన విషయం తెలిసిందే. ఐపీఎల్ సహచరులైన అభిషేక్ నాయర్, రియాన్ డస్చేట్‌లను అసిస్టెంట్ కోచ్‌లుగా కావాలని గౌతీ కోరాడు.

### రియాన్, గంభీర్, అభిషేక్

అంతేకాదు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా లెజెండ్ మోర్నీ మోర్కెల్ పేరును గంభీర్ సూచించాడు. కానీ, బీసీసీఐ మాత్రం భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్‌కు ఆ పోస్ట్ ఇవ్వాలని భావిస్తోంది. లంక పర్యటనలో తొలి టీ20కి వారం రోజులే ఉండడంతో ఆలోపు బౌలింగ్ కోచ్ పేరు ఖరారయ్యే అవకాశముంది. భారత జట్టు శ్రీలంక గడ్డపై జూలై-ఆగస్టుల మధ్య మూడు వన్డే, టీ20ల సిరీస్ ఆడనుంది. జూలై 27న టీ20 సిరీస్ మొదలవ్వనుండగా.. ఆగస్టు 2వ తేదీన వన్డే సమరం షురూ కానుంది. వన్డేలకు రోహిత్ శర్మ, పొట్టి ఫార్మాట్‌కు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా ఎంపికైన విషయం తెలిసిందే.

# జులియా పోరాటం వృథా..!

### బోణీ కొట్టిన థాయ్‌లాండ్

మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్ జయభేరి మోగించింది. శనివారం మలేషియాపై ఉత్కంఠ పోరులో 20 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత నన్నాపట్ కొంచరొంకాయ్ (40), ఫన్నితా మయా(29)లు బ్యాటుతో బాదేయగా ఆ తర్వాత బౌలర్లు ప్రత్యర్థిని 111 పరుగులకే కట్టడి చేశారు. స్వల్ప ఛేదనలో థాయ్ బౌలర్లను ఉతికేసిన మలేషియా ఓపెనర్ వాన్ జులియా(52) అర్ధ శతకంతో మెరిసింది. అయితే.. మిడిలార్డర్, టెయిలెండర్ల వైఫల్యంతో మలేషియా అనూహ్యంగా ఓటమి పాలైంది. మెగా టోర్నీలో బోణీ కొట్టిన థాయ్‌లాండ్ గ్రూప్ బి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. రెండో రోజు గ్రూప్ బి తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్, మలేషియాలు దంబుల్లా స్టేడియం వేదికగా నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. తొలుత నన్నాపట్ కొంచరొంకాయ్ (40), ఫన్నితా మయా(29)లు



రాణించడంతో థాయ్‌లాండ్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 133 రన్స్ కొట్టింది. అనంతరం ఛేదనలో మలేషియాకు ఓపెనర్లు వినిఫ్రెడ్ దురైసింగమ్(22), వాన్ జులియా(52)లు శుభారంభిచ్చారు. తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. కానీ, థాయ్‌లాండ్ బౌలర్లు వరుసగా వికెట్లు తీసి ఒత్తిడి పెంచగా.. ఆ తర్వాత వచ్చిన వాళ్లంతా చేతులెత్తేయడంతో మలేషియా ఓటమి చవిచూసింది.

# ఈ నెల 26 నుంచి పారిస్ ఒలింపిక్స్

## కేంద్రం ఏ క్రీడకు ఎక్కువ ఖర్చు చేసిందో తెలుసా..?

ఈ నెల 26 నుంచి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో '2024 ఒలింపిక్ క్రీడలు జరగనున్నాయి. ఇంచుమించుగా నెలరోజులపాటు జరగనున్న ఈ క్రీడలు ప్రపంచ క్రీడాభిమానులకు కనువిందు చేయనున్నాయి. ఈ ఒలింపిక్స్ క్రీడల సన్నద్ధత కోసం భారత ప్రభుత్వం భారీగా ఖర్చు చేసింది. ప్రధాన క్రీడల కోసం ఏకంగా కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏ క్రీడల కోసం ఎంత ఖర్చు పెట్టింది..? అన్నింటికంటే ఎక్కువగా ఏ క్రీడల కోసం ఖర్చు చేసింది అనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కాగా కేంద్ర సర్కారు అన్ని క్రీడల కంటే ఎక్కువగా అథ్లెటిక్స్‌కు ఖర్చు చేసింది. అథ్లెటిక్స్ కోసం ఏకంగా రూ.96.08 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత అత్యధికంగా బ్యాడ్మింటన్ కోసం భారత్ ఖర్చు చేసింది. బ్యాడ్మింటన్ కోసం రూ.72.03 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఆ తర్వాత వరుసగా బాక్సింగ్‌కు రూ.60.93 కోట్లు, షూటింగ్‌కు రూ.60.42 కోట్లు, హాకీకి రూ.41.3 కోట్లు, ఆర్చరీకి రూ.39.18 కోట్లు, రెజ్లింగ్‌కు రూ.37.8 కోట్లు, వెయిట్‌లిఫ్టింగ్‌కు రూ.27 కోట్లు, టేబుల్




టెన్నిస్‌కు రూ.12.92 కోట్ల చొప్పున కేంద్రం ప్రభుత్వం ఖర్చు చేసింది. అదేవిధంగా జూడోకు రూ.6.33 కోట్లు, స్విమ్మింగ్‌కు రూ.3.90 కోట్లు, రోయింగ్‌కు రూ.3.89 కోట్లు, సెయిలింగ్‌కు రూ.3.78 కోట్లు ఖర్చు పెట్టింది. ఇక గోల్ఫ్‌కు రూ.1.74 కోట్లు, టెన్నిస్‌కు రూ.1.67 కోట్లు, ఈక్వెస్ట్రియన్‌కు రూ.95.42 కోట్లను కేంద్ర ఖర్చుచేసింది.

# ఢిల్లీకి పంత్ గుడ్ బై

## పసుపు జెర్సీ కోసమేనా..?

ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్. కెప్టెన్ రిషభ్ పంత్ ఆ ఫ్రాంచైజీకి గుడ్ బై చెప్పనున్నాడు. పంత్ త్వరలోనే చెన్నై సూపర్ కింగ్స్‌కు మారుతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది మెగా వేలానికి ముందే ఈ డాషింగ్ బ్యాటర్ పసుపు రంగు జెర్సీ వేసుకొనే చాన్స్ ఉంది. ఇప్పటికే హెడ్‌కోచ్ రికీ పాంటింగ్‌పై వేటు వేసిన ఢిల్లీ యాజమాన్యం పంత్ కెప్టెన్సీ పట్ల కూడా అసంతృప్తిగా ఉందని టాక్. దాంతో, వచ్చే సీజన్ కోసం అతడిని అట్టిపెట్టుకోవాలా? వద్దా? అని జిదాల్ టీమ్ తలలు పట్టుకుంటోందట. ఈ నేపథ్యంలో పంత్ సీఎస్కేకు ఆడడంపై ఆసక్తి చూపిస్తున్నాడని సమాచారం.

### ధోనీ కోసమేనా..?




పంత్ సీఎస్కేకు ఆడాలనకోవడం వెనక భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ హస్తం ఉండొచ్చు. ఎందుకంటే..? పదిహేడో సీజన్‌లో కెప్టెన్సీ వదిలేసిన మహీ భాయ్ మరో సీజన్ ఆడడం సందేహమే. దాంతో, వికెట్ల వెనకాల ధోనీలా చురుకుగా ఉండే, బ్యాటుతోనే విధ్వంసం సృష్టించే పంత్ సీఎస్కే కూర్పులో చక్కగా సరిపోతాడు.

అందుకని చెన్నై సైతం వేలంలో లేదంటే ట్రేడింగ్ పద్ధతిలో పంత్‌ను కొనేందుకు సిద్ధంగా ఉండే అవకాశం ఉంది. రెండేండ్ల క్రితకం కారు యాక్సిడెంట్‌లో పంత్ అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. మోకాలి సర్జరీ, ఆ తర్వాత నేషనల్ క్రికెట్ అకాడమీలో కఠోర వ్యాయామాల తర్వాత ఈ యంగ్‌స్టర్ ఫిట్‌నెస్ సాధించాడు. దాదాపు ఏడాది విరామం అనంతరం పంత్ 17వ సీజన్‌తో ఐపీఎల్‌లో పునరాగమనం చేశాడు. ఆసీస్ స్టార్ డేవిడ్ వార్నర్ నుంచి పగ్గాలు అందుకొని మళ్లీ సారథిగా ఢిల్లీని నడిపించాడు. అయితే.. ఆటగాడిగా మునుపటి ఫామ్ అందుకున్న ఈ డాషింగ్ బ్యాటర్ జట్టను ప్లే ఆఫ్స్ చేర్చలేకపోయాడు. దాంతో, ఐపీఎల్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ మేనేజ్‌మెంట్ కొత్త కెప్టెన్ వేటకు సిద్ధమైంది.



# సానియాతో పెళ్లి పుకారు

**ముంబై జూలై 20 (జనం సాక్షి)**

టెన్నిస్ స్టార్ సానియా మీర్జాను.. క్రికెటర్ మహమ్మద్ షమీ పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆ న్యూస్ షికార్లు చేశాయి. అయితే ఇటీవల యూట్యూబ్‌లో శుభాంకర్ మిశ్రాకు షమీ ఇంటర్వ్యూ ఇచ్చాడు. సానియాతో పెళ్లి రూమర్ గురించి ఆ ఇంటర్వ్యూలో అడిగారు. ఆ ప్రశ్నకు తీవ్రంగా స్పందించిన షమీ.. ఆ వార్తలను కొట్టిపారేశారు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశాన్ని ఆయన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో నకిలీ వార్తలను వ్యాపి చేయడాన్ని ప్రజలు మానుకోవాలని షమీ సూచించాడు. మీమ్స్ వల్ల ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందని, కానీ ఆ మీమ్స్ వల్ల హాని కూడా జరుగుతుందని షమీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాతో బాధ్యతాయుతంగా ఉండాలని, అసత్య ప్రచారానికి దూరంగా ఉండాలని షమీ సూచించాడు. మీకు ధైర్యం ఉంటే వెరిఫైడ్ పేజీ నుంచి ఇలాంటి కామెంట్ చేస్తే, అప్పుడు దానికి సరైన రిప్లై వస్తుందని షమీ అన్నాడు. జీవితంలో ఏదైనా సాధించడానికి ప్రయత్నించాలని, ఇతరులకు సాయం చేయాలని, మీకు మీరు అప్‌గ్రేడ్ కావాలని, అప్పుడు మీరు మంచి వ్యక్తులని భావిస్తామని షమీ పేర్కొన్నాడు. పాక్ క్రికెటర్ షోయెబ్ మాలిక్‌ను పెళ్లాడిన సానియా మీర్జా అతనికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

# 'బ్లూ టైగర్స్'కు కోచ్‌గా స్పెయిన్ దిగ్గజం

ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య సీనియర్ జట్టుకు హెడ్‌కోచ్‌ను నియమిం చింది. అంతర్జాతీయంగా సుదీర్ఘ అనుభవమున్న స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టు మేనేజర్ మనొలో మార్కెజ్‌కు ప్రధాన కోచ్ పగ్గాలు అప్పగించింది. ఈ విష యాన్ని శనివారం ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా వెల్లడించింది. 'ప్రస్తుత సీజన్ 2024 -25లో మనొలో గోవా ఫుట్‌బాల్ క్లబ్‌కు కోచ్‌గా వ్యవ హరించనున్నాడు. అదే సమయంలో




ఆయన టీమిండియా కోచ్‌గానూ సేవ లందించనున్నాడు' అని ఏఐఎఫ్‌ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. 'భారత జట్టు కోచ్‌గా ముఖ్య పాత్రను పోషించనున్న మలొనోను అపూర్వ స్వాగతం పలుకుతున్నాం. జాతీయ జట్టు కోసం తమ కోచ్‌ను వదులుకున్న గోవా క్లబ్‌కు కృతజ్ఞతలు. ఇకపై మలొనోతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంగా ఉన్నాం. మనొలోకు భారత దేశ సంప్రదాయాలు తెలుసు. అందుకని ఆయన జట్టును గెలుపు బాట పట్టిస్తాడని నమ్మకంగా ఉన్నాం' అని ఏఐఎఫ్ ఎఫ్ కల్యాణ్ చౌబె వెల్లడించాడు. మనొలొకు భారత గడ్డపై కోచ్‌గా పని చేసిన అనుభవం ఉంది. అంతేకాదు హైదరాబాద్ క్లబ్ తరఫున 2021-22 ఐఎస్‌ఎల్ టైటిల్ గెలిచాడు.

### స్టిమాక్‌పై వేటు..

ఫిఫా వరల్డ్ కప్ 2026 క్వాలిఫయర్‌లో భారత జట్టు ఓటమిని సీరియస్‌గా తీసుకున్న ఏఐఎఫ్‌ఎఫ్ కోచ్‌గా ఉన్న ఇగొర్ స్టిమాక్ స్టిమాక్‌పై వేటు వేసింది. క్రొయేషియాకు చెందిన స్టిమాక్ ఆధ్వర్యంలో భారత జట్టు 53 మ్యాచ్‌లు ఆడగా కేవలం 19 విజయాలు మాత్రమే సాధించింది. దానికి తోడూ ఈ ఏడాది ఏఎఫ్‌సీ ఆసియా కప్‌లో టీమిండియా మూడింటా పరాజయం పాలైంది. అంతేకాదు ఏకంగా ఆరు గోల్స్ సమర్పించుకొని కనీసం ఒక్కటంటే ఒక్క గోల్ కూడా చేయలేదు. అయినా సరే ఆలిండియా ఫుట్‌బల్ సమాఖ్య స్టిమాక్‌పై నమ్మకం ఉంచింది. కానీ, ఫిఫా క్వాలిఫయర్‌లో బ్లూ టైగర్స్ మళ్లీ చెత్త ప్రదర్శన కనబరచడంతో అతడిని హెడ్‌కోచ్‌గా తొలగించింది.



# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గర్భిణీ స్త్రీల సేవలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా వైద్యాధికారులకు ఆదేశాలు
- కలెక్టర్ హెచ్‌కే జండేగా

**భువనగిరి ప్రతినిధి జూలై 20 (జనం సాక్షి)**

కాలాల మార్పులతో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యాధికారులకు కలెక్టర్ హెచ్‌కె జండేగా ఆదేశించారు. గర్భిణీ స్త్రీల సేవల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శనివారం నాడు బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. కార్యాలయ విధుల కు గైరు హాజరైన సీనియర్ అసిస్టెంట్ పట్ల చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. వైద్య సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని డ్రగ్ స్టోర్‌ను, మందుల వివరాలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని మందులతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జ్వరాలు వచ్చిన వారి పట్ల ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని, ఆశ, ఏఎన్‌ఎం సిబ్బంది తరచూ సందర్శించి వారి వైద్యం అందించాలని, గర్భిణీ స్త్రీల సేవలను పెంచుకోవాలని, వారి హెల్త్ డాటా పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మాతా శిశు ఆరోగ్యం ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు డాక్టర్ మౌనిక ఉన్నారు.

# స్త్రీ అంటే సామాన్య వ్యక్తి కాదు ఒక మహాశక్తి





**జె. శ్రీనివాసరావు**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20 (జనం సాక్షి)**

స్త్రీ అంటే సామాన్యమైన వ్యక్తి కాదని ఒక మహాశక్తి అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కామారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జె. శ్రీనివాసరావు అన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సహకారంతో మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారతపై ఆశ వర్కర్లు, అంగనవాడి టీచర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాశాలల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జే.శ్రీనివాసరావు మహిళలు, విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక మహిళా సంఘ సభ్యులు నిర్వహిస్తున్నది ఉద్యోగ బాధ్యతలు మాత్రమే కాదని వారు చేసేది ఒక సామాజిక సేవ అని అన్నారు. స్త్రీ అంటే ఒక సామాన్య వ్యక్తి కాదని ఒక మహాశక్తి అని చైతన్యవంతమైన మహిళా ఉండే ఇల్లు ఆదర్శవంతంగా ఉంటుందని, ఇల్లు ఆదర్శవంతమైనప్పుడే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం దేశం ప్రపంచానికి ఆదర్శంగా తయారవుతుందన్నారు. భారతదేశం ప్రపంచంలో సముచిత స్థానం పొందాలంటే మహిళల ద్వారా ఇంటి నుండే చైతన్యం రావాలని అన్నారు. భారత రాజ్యాంగంలో లింగం, కులం, మతం, భాష లాంటి ఎలాంటి భేదం లేకుండా పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందని మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. 1987లో న్యాయ సేవ సాధికార సంస్థ చట్టాలను తీసుకువచ్చారని ఎలాంటి ఖర్చు లేకుండా అన్ని రకాల కేసులను మండల మరియు జిల్లాస్థాయి న్యాయ సాధికార సేవల సంస్థకు ఫిర్యాదు చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థి జీవితం చాలా విలువైనదని సెల్ఫోన్లకు బానిస కాకుండా ఐఎస్ఐ, ఐపీఎస్ లాంటి ఉన్నతాధికారాన్ని స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. నా స్వగ్రామం కామారెడ్డి పట్టణానికి సమీపంలో ఉందని నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు కామారెడ్డి పట్టణం విద్యా, వైద్యం, వ్యాపారం రంగాలలో ఉన్నతంగా ఉండడం గమనించానని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు అని అన్నారు. అనంతరం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సిహెచ్. విఆర్ఆర్. వర ప్రసాద్ మాట్లాడుతూ అవసరం ఉన్న పేదలకు ఉచిత న్యాయ సేవలను అందించేందుకు జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ పనిచేస్తుందని అన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సింధు శర్మ మాట్లాడుతూ చట్టం మహిళల పక్షాన ఉందని గృహహింస,వరకట్న వేధింపు, లైంగిక దాడి, ఈవ్ టీజింగ్ లాంటి ఏ సమస్యలను మహిళలు ఎదుర్కొన్న న్యాయ సేవ సంస్థను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ దీక్ష ఇతర న్యాయవాదులు, న్యాయస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర సర్వతోముఖాభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

**శేరిలింగంపల్లి, జూలై 20 (జనంసాక్షి) :**

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాల లాపరంగా తోడ్పాటునందించి రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధి గోపన్ పల్లి తండా చౌరస్తా వద్ద 28 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నిర్మించిన నూతన ఫ్లై ఓవర్ ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చేవెళ్ల పాం ర్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాగా ముఖ్య మంత్రి వెంట ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శాంశక తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి తదితరులు మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ పరిది గోపన్ పల్లి తండా చౌరస్తా వద్ద 28కోట్ల 50లక్షల రూపాయల అంచనావ్యయంతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను శనివారం గౌరవంగా ప్రారంభించు కోవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్లై ఓవర్‌ను ప్రారంభించుకోవడం, ఒక మంచి ప్రారంభోత్స వాన్ని మొదటి కార్యక్రమంగా జరుపుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. గోపనపల్లి తండా ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ... అధికారులకు, అనధికా రులకు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల



పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్ స్టాండ్ నుండి ఔటర్ రింగ్ రోడ్డువరకు వట్టినాగుల పల్లి మీదుగా నిర్మిస్తున్న రేడియల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం, ట్రాఫిక్ రహిత సమాజం కోసం గోపన్ పల్లి తండా వద్ద ఫ్లై ఓవర్ తో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ విషయంలో కీలక పరిణామంగా ఎమ్మెల్యే అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ముఖ్య కార్యనిర్వాహ ణాధికారి మోహన్ నాయక్, ఎస్ఈ వెంకటే శ్వరరావు, ఈఈ మధుసూదన్, డిఈ సీతారా మయ్య, ఏఇ అజయ్ కుమార్, జిహెచ్ఎంసి సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ శంకర్ నాయక్, ఈఈ శ్రీనివాస్, డిఈ రమేష్, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, శ్రేయబిలాషులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మాదాపూర్ కెజిఎఫ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి

శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ ఐటీ కారిడార్ పరిధి హెచ్ఐసిసిలో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కెజిఎఫ్ ) ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తదితరులతో కలిసి శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వెంట ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కొనప్ప, నల్లమోతు భాస్కర్ రావు, తెలంగాణ కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు సివిఆర్ ఛానల్ అధినేత చలసాని వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశ్వనగర నిర్మాణంలో అందరూ భాగం కావాలని, తెలంగాణలో ఎవరి పట్లా వివక్ష ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని తమ ప్రభుత్వం ఆహ్వానిస్తుందని, ఇందులో ఎవరి పట్లా వివక్ష చూపబోదన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు వారి నాయకత్వం లేని లోటు స్పష్టంగా కనబడుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో పీవీ నరసింహారావు, ఎన్టీఆర్, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడులాంటి నాయకుల ప్రభావం ఢిల్లీలో స్పష్టంగా కనిపించేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జెట్టి కుసుమ కుమార్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జూలై 2024

# ఇస్రో అనుబంధ ఎన్‌ఎస్‌ఐఎల్‌తో టీ-సాట్ ఒప్పందం

- జీసాట్-8 నుండి జీసాట్-16 కు మారిన సిగ్నల్స్
- ఒప్పందంపై సంతకాలు చేసిన టి.సాట్-సాఫ్ట్ నెట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ అరుణాచలం




**హైదరాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** ఇస్రో అనుబంద సంస్థ ఎన్‌ఎస్‌ఐఎల్‌తో టి-సాట్ నెట్వర్క్ శాటిలైట్ ప్రసారాలకు సంబంధించి జీసాట్-8 నుండి జీసాట్-16కు మారుతూ ఒప్పందం కదుర్చుకుంది. ఎన్.ఎస్.ఐ.ఎల్ డైరెక్టర్ అరుణాచలం, టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒప్పంద పత్రాలపై బెంగుళూరు వేదికగా శుక్రవారం సంతకాలు చేశారు. ఈ మేరకు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు మార్చి 2012 నుండి 2024 జూలై 18వరకు జీసాట్-8 కేయూ బ్యాండ్‌పై ప్రసారాలు కొనసాగాయని, జూలై 19, 2024 నుండి కేయూ బ్యాండ్ జీసాట్-16లో ప్రసారాలకు మారుతూ ఒప్పందం కుదుర్చుకున్నామని వేణుగోపాల్ రెడ్డి వివరించారు. ఒప్పందం ప్రకారం ఆరు మెగా హెడ్జ్ కేయూ బ్యాండ్ విడ్త్ ద్వార టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు విద్య, నిపుణ ప్రసారాలు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు మరింత మెరుగ్గా అందనున్నాయని సీఈవో స్పష్టం చేశారు. ఫలితంగా భారతదేశంలో టెలి ఎడ్యుకేషన్ ఛానల్ నిర్వహించే రాష్ట్రాల్లో జిశాట్-16కు మైగ్రేట్ అవుతూ ఎన్.ఎస్.ఐ.ఎల్ తో ఒప్పందం కుదుర్చుకున్న మొట్టమొదటి ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. 2000 సంవత్సరంలో మనటీవి తొలి ఒప్పందంతో ప్రారంభమైన నెట్వర్క్ గత 23 సంవత్సరాల కాలంలో అరుదైన ఒప్పందం చేసుకున్న ఘనత ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇస్రో అనుబంధ సంస్థ అయిన ఎన్.ఎస్.ఐ.ఎల్ తో ఒప్పందం కుదుర్చుకునే విధంగా చొరవ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. శుక్రవారం బెంగుళూరు వేదికగా జరిగిన ఒప్పంద కార్యక్రమంలో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఐఎల్ డైరెక్టర్ అరుణాచలంతో పాటు తెలంగాణ ఐటి శాఖ డిప్యూటి సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఎన్‌ఎస్‌ఐఎల్ ఛీఫ్ మేనేజర్ నిలంజన్ రౌత్ పాల్గొన్నారు.

# రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- బస్ భవన్‌లో ఆర్టీసీ పనితీరుపై సమీక్ష



**హైదరాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** మహాలక్ష్మి పథకం వల్ల బస్సుల్లో రవాణా పెరిగిందని, రద్దీకనుగుణంగా కొత్త బస్సులు పెంచాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బస్ భవన్ లో శనివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పనితీరుపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థలోని అన్ని విభాగాల పనితీరు, మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకం అమలు, కొత్త బస్సుల కొనుగోలు, ఆర్థికపరమైన అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తోన్న కండక్టర్లు, డ్రైవర్లతో వర్చ్యువల్‌గా సమావేశమయ్యారు. మహబుబాబాద్, హయత్ నగర్ -2, నిజామాబాద్-2, అసిఫాబాద్, హుస్నాబాద్, నారాయణపేట, మిర్యాలగూడ, మధిర, సిద్ధిపేట, సంగారెడ్డి డిపోలకు చెందిన సిబ్బందితో స్వయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోన్న సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఈ పథకాన్ని శుక్రవారం వరకు 68.60 కోట్ల మంది మహిళలు వినియోగించుకుని, రూ.2350 కోట్లను ఆదా చేసుకున్నారయని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటివరకు 38 డిపోల్లో లాభాల్లో ఉన్నాయని, మిగతా డిపోలు కూడా వృద్ధి సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్గో సేవలను విస్తరించేందుకు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రయాణికులే వల్ల సంస్థ మనగలుగుతోందని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. సంస్థను తమ కుటుంబంలా భావించి ముందుకు తీసుకెళ్లాలని, ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు రూ.2350 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని, జీవో ప్రకారం రీయంబర్స్ కింద ఇప్పటివరకు రూ.1740 కోట్ల నిధులను ప్రభుత్వం సంస్థకు విడుదల చేసిందని తెలిపారు. ప్రతి రోజు సగటున 30 లక్షల మంది మహిళలను సంస్థ క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతోందని వివరించారు. సిబ్బంది కష్టపడి చేయడం వల్ల త్వరలోనే సంస్థ బిలియన్ డాలర్ (రూ.8500 కోట్లు) టర్నోవర్ కార్పొరేషన్ గా అవతరించబోతుందని తెలిపారు. ప్రస్తుతం దేశానికి రోల్ మోడల్ గా సంస్థ నిలిచిందని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణ కాంత్, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, వినోద్ కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్పతో పాటు హెచ్‌ఓడీలు, ఆర్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# మాటకు కట్టుబడి మాఫీ చేశాం

- రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడుస్తున్నాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20 (జనం సాక్షి) :** మాటకు కట్టుబడి రుణమాఫీ చేశామని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చినమాటకు కట్టుబడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సీఎం రేవంత్ రెడ్డి సకాలంలో 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలే కేంద్రబిందువుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం జరుగుతున్నా, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశంసించాల్సింది పోయి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు గొప్ప పరిపాలన చేసి ఉంటే 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా ఎలా మారిందని ప్రశ్నించారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ప్రాజెక్ట్ ల పేరుతో ప్రభుత్వ సొమ్మును కాంట్రాక్టర్లకు దోసి పెట్టారని ధ్వజమెత్తారు. విద్యా, వైద్య రంగాన్ని అధ్వాన్నంగా తయారు చేశారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎక్కువ సమయం కేటాయించాలని, వారి పట్లమర్యాదగా నడుచుకోవాలని అధికారులకు హితవు పలికారు. ప్రజా పిర్యాదులను పెండింగ్ లో పెట్టరాదని, వారం, పది రోజుల్లో వాటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ గాంధీ కుటుంబం ప్రాణాలైనా అర్పిస్తుంది కానీ మాట మాత్రం తప్పదని, నెహ్రూ ప్రధానమంత్రి ఉన్నప్పుడు పేద రైతుల పక్షాన నిలబడి ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారన్నారు. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసి దున్నే వాడికి భూమి పేద ప్రజలకు ఇల్లు కట్టించి పంచారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ భారతదేశానికి సాంకేతిక టెక్నాలజీ అందించారని, యూనివర్సిటీలు, కాలేజీలు నిర్మించారని, సోనియా గాంధీ మనోహన్ సింగ్ హయాంలో దేశ రైతుల రుణమాఫీ ఒకేసారి చేశారన్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ మాట ఇచ్చారని రేవంత్ రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. రుణమాఫీ పై రైతుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్లలో ప్రత్యేక కౌంటర్లు మండల కేంద్రాల్లోనూ సహాయ కేంద్రాలు ఏర్పాటు. చేస్తామన్నారు. రైతు వేదికల్లో అందుబాటులో రైతు రుణమాఫీ లబ్ధిదారుల జాబితా. ఉంచుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, కామారెడ్డి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా చేపట్టిన లో ప్యాకేజీల పెండింగ్ పనులను పూర్తి చేసేలా ముఖ్యమంత్రి ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని, రైతుల రుణమాఫీ ఓ విప్లవాత్మకమైన మార్పని ఇది చరిత్రలో నిలుస్తుందని పేర్కొన్నారు. రుణమాఫీ అమలు ద్వారా సోనియా, రాహుల్ ఇచ్చిన హామీ నెరవేర్చామని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు మాఫీ చేసింది రూ.25వేల కోట్లు మాత్రమేనని, కాంగ్రెస్ సర్కారు 8నెలల్లోనే 31వేల కోట్లు మాఫీ చేసిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద తప్పిదమని, దీన్ని సాగునీటి కోసం కాకుండా కమీషన్ల కోసమే నిర్మించి ప్రజా ధనాన్ని వృథా చేశారనిఅన్నారు. ఫలితంగా రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీది గోబెల్స్ ప్రచారం

- కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి
- పొన్నంపై కృష్ణారెడ్డి ఆరోపణలకు ఖండన



**కరీంనగర్ బ్యూరో, జులై 20 (జనం సాక్షి) :** శుక్రవారం రోజు బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీపై , మంత్రి పొన్నం ప్రభాకర్ పై చేసిన ఆరోపణలను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పలువురు నాయకులతో కలిసి శనివారం రోజు కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బీజేపీ నాయకులు కొడిగుడ్డుపై ఈకలు పీకాలని చూస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మాటల్లో తప్పులు వెతుకుతున్నారన్నారు. ఆయన మాట తప్పని వ్యక్తి, విద్యార్థి దశ నుండి కష్టపడి ఎదిగి నాయకుడయ్యాడని అన్నారు. అబద్ధాలు ప్రచారం చేయటంలో బిజెపి దిట్ట అని వాట్సప్ యూనివర్సిటీ నుంచి గ్లోబెల్స్ ప్రచారం, రుణమాఫీ మీద అడ్డగోలు ఆరోపణలు మానుకోవాలని, రైతుల జోలికి వస్తే బిజెపి నేతలకు బుద్ధి చెప్తామన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీతో 75% రైతులు లబ్ది పొందనున్నారని పొన్నం ప్రభాకర్ అన్న మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. రైతుల ఆశీర్వాదంతో రాబోయే కాలంలో మా నాయకులు రాహుల్ గాంధీ ప్రధాని కానున్నారన్నారు. ఉచిత బస్సు , ఉచిత కరెంటు, 500 లకే సిలిండర్ అందిస్తామన్న గ్యారంటీ లను పారదర్శకంగా అమలు చేస్తున్నామని రైతుల ముఖాల్లో సంతోషం చూస్తుంటే తట్టుకోలేక దృష్టి మరలించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు సంక్షేమం కోరుకునే పార్టీ, కమలం కండువా తీసి చూస్తే రైతుల సంబరాలు కనిపిస్తాయని 6000 కోట్ల పైచిలుకు రైతుల అకౌంట్లో వేస్తే కనీసం కృతజ్ఞత చెప్పే తెలివి లేదా? రైతులకు మీరు గడిచిన 10 ఏళ్లలో 100 కోట్లయినా ఇచ్చారా? చావు తప్పి కన్ను లొట్ట పోయిన చందంగా కేంద్రంలో బిజెపి సర్కార్ అని కెసిఆర్ డ్రామా కంపెనీ చేసిన నిర్వాకం వల్ల ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం 7000 కోట్ల మిత్తి చెల్లిస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముద్దం తిరుపతి గౌడ్, నూనె గోపాల్ రెడ్డి, కుంభాల రాజు కుమార్, కనకా రెడ్డి, జూపాక సుదర్శన్, చింతల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
























Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370